www.trinetnews.com

# తెలంగాణ ట్రైనెట్ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

సంపుటి 01 సంచిక 19 ఎడిటర్ :వెంకటేశ్వర్లు రాపోలు శనివారం ఆగస్ట్ 29, 2026 పేజీలు:12 వెల.10/-


## భారత్‌కు రానున్న 'జావెలిన్'.. భుజంపై నుంచే శత్రువుకు గురి..!



2లో

## డా. గుళ్ల సూర్యప్రకాశ్ కు జీవిత సాఫల్య పురస్కారం




12

# జల వివాదాలపై గట్టిగా వాదించాలి

- రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా వాదించాలి
- మహారాష్ట్ర, ఏపీతో జల వివాదాలపై సమీక్ష
- తుమ్మిడిహట్టి భేటీ, సీడబ్ల్యూసీ సమావేశంపై చర్చ
- సుప్రీంకోర్టు, జల బోర్డుల్లోని కేసులపై ఆరా
- ఇతర రాష్ట్రాల వాదనలకు దీటుగా తెలంగాణ వైఖరి
- ప్రజ్ఞానందకు సీఎం రేవంత్ అభినందనలు
- యువతకు ప్రజ్ఞానంద విజయం స్ఫూర్తిదాయకమని వ్యాఖ్య



**ట్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 28 :** అంతర్రాష్ట్ర జల వివాదాలకు సంబంధించి వివిధ వేదికలపై రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేలా గట్టిగా వాదించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో నీటిపారుదల శాఖపై మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. సెప్టెంబరు 1న తుమ్మిడిహట్టిపై దిల్లీలో జరగనున్న అధికారుల భేటీ, సెప్టెంబరు 7న సీడబ్ల్యూసీ హైలెవెల్ కమిటీ సమావేశ ఎజెండాపై ఈ సమీక్షలో చర్చించినట్లు సమాచారం. మహారాష్ట్ర, ఏపీతో వివాదాలపై అధికారులు, న్యాయవాదులు తెలంగాణ వైఖరిని స్పష్టం చేయాలని సీఎం సూచించినట్లు తెలుస్తోంది. సుప్రీంకోర్టు, కేంద్ర జలవనరుల సంఘం, కృష్ణా, గోదావరి నదీ జలాల నిర్వహణ బోర్డుల్లో ఉన్న వివిధ కేసులపై చర్చించారు. కేసులు ఏ దశలో ఉన్నాయి.. ఇతర రాష్ట్రాల వాదనలేంటి.. తెలంగాణ ప్రయోజనాలు వంటి అంశాలపై సీఎం ఆరాతీసినట్లు సమాచారం.

**ప్రజ్ఞానందకు అభినందనలు తెలిపిన సీఎం**

అమెరికాలోని సెయింట్ లూయిస్‌లో జరిగిన గ్రాండ్ చెస్ టూర్ టైటిల్‌ను సొంతం చేసుకుని.. చరిత్ర సృష్టించిన భారత చెస్ గ్రాండ్ మాస్టర్ ఆర్. ప్రజ్ఞానందకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ వేదికలపై భారత ఖ్యాతిని మరోసారి ప్రపంచానికి చాటిచెప్పిన ప్రజ్ఞానంద విజయం ప్రతి పౌరుడు గర్వించదగ్గ విషయమని సీఎం పేర్కొన్నారు. ప్రజ్ఞానంద విజయం క్రీడాకారులకు, యువతీ యువకులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. భవిష్యత్తులో ప్రజ్ఞానంద మరెన్నో అద్భుతమైన విజయాలు సాధించి, దేశానికి కీర్తి తీసుకురావాలని సీఎం ఆకాంక్షించారు

# ఉజ్బెకిస్థాన్, కిర్గిస్థాన్‌లకు మోదీ

- 29 నుంచి నాలుగు రోజుల విదేశీ పర్యటన
- ఉజ్బెకిస్థాన్‌లో మిర్జియోయెవ్‌తో చర్చలు
- వాణిజ్యం, రక్షణ, ఇంధనంపై కీలక భేటీలు
- కిర్గిస్థాన్‌లో ఎస్‌సీవో సదస్సుకు హాజరు
- పుతిన్‌తో మోదీ ప్రత్యేక భేటీ
- షీ జిన్‌పింగ్, షెహబాజ్ షరీఫ్‌తోనూ సమావేశం అవకాశం
- ఎస్‌సీవో ప్లీనరీలో ప్రసంగించనున్న ప్రధాని



**ట్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 28 :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ద్వైపాక్షిక, బహుపాక్షిక సమావేశాలకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 29 నుంచి సెప్టెంబరు 1 వరకు ఉజ్బెకిస్థాన్, కిర్గిస్థాన్‌లలో మోదీ పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా కిర్గిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరిగే షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సులో పాల్గొని, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో మోదీ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ఈ భేటీలో ఇరు దేశాల మధ్య ఉన్న ద్వైపాక్షిక సంబంధాలను నేతలిద్దరూ సమగ్రంగా సమీక్షించనున్నారని విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి సిబీ జార్జ్ తెలిపారు. కిర్గిస్థాన్ అధ్యక్షుడు సాదిర్ జాపరోవ్ ఆహ్వానం మేరకు ఎస్‌సీవో సదస్సుకు హాజరవుతున్న మోదీ చివరిరోజు ప్లీనరీలో ప్రసంగిస్తారు. ఎస్‌సీవో దేశాల ఇతర నేతలతో కలిసి ఆరో వరల్డ్ నోమాడ్ గేమ్స్ ప్రారంభ వేడుకలకు మోదీ హాజరవుతారు. ఎస్‌సీవో సదస్సుకు పుతిన్‌తోపాటు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తదితరులు హాజరయ్యే అవకాశముంది. 2017 నుంచి భారత్ పూర్తిస్థాయి సభ్య దేశంగా ఉన్న ఈ శిఖరాగ్ర సదస్సు 25వ వార్షికోత్సవాన్ని జరుపుకోనుంది.

మిగతాద్ది 2 లో

## 29న రాజ్యాంగ పరిరక్షణపై జస్టిస్ మేనకా గురుస్వామి కీలక ప్రసంగం



2లో..



**ట్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 28 :** భారత రాజ్యాంగం, పరిరక్షణపై హైదరాబాద్‌లో కీలక చర్చ జరగనుంది. ఎస్. జైపాల్ రెడ్డి మెమోరియల్ ఫౌండేషన్.. మంథన్ ఫౌండేషన్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనుంది.



## పరకాల వివాదం తర్వాత.. సీఎం నివాసానికి మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్:** రక్షా బంధన్ సందర్భంగా మంత్రులు కొండా సురేఖ, సీతక్క ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసానికి వెళ్లి రాఖీ కట్టారు. పరకాల వివాదం తర్వాత కొండా సురేఖ.. సీఎం నివాసానికి వెళ్లడం ఇదే తొలిసారి. సీఎంతో భేటీ అనంతరం కొండా సురేఖ మీడియాతో మాట్లాడకుండానే అక్కడి నుంచి వెళ్లి పోయారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్‌కు 'సర్' నోటీసు

- కరీంనగర్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎస్ఐఆర్ నోటీసులు
- తండ్రి పేరు తప్పుగా నమోదవడంతో బీఎల్‌వో నోటీసు
- నోటీసులకు స్పందించిన మంత్రి పొన్నం
- తండ్రి పేరు సవరణకు పత్రాలు సమర్పణ
- ఓటర్ జాబితా సవరణ ప్రక్రియలో ఘటన



2లో..

**ట్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 28 :** ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు నోటీసు వచ్చింది. మంత్రి తండ్రి పేరు తప్పుగా పడడంతో బీఎల్‌వో నోటీసులు ఇచ్చారు. నోటీసులకు స్పందించిన మంత్రి.. తండ్రి పేరు సవరణకు తగిన పత్రాలను బీఎల్‌వోకు

# ఆయిల్‌పామ్ సాగుకు ఊతం

- సాగు విస్తరణను వేగవంతం చేయాలి: తుమ్మల
- రైతుల ఆసక్తికి అనుగుణంగా మొక్కల లభ్యత పెంచాలి
- సకాలంలో మొక్కలు అందేలా చర్యలు
- వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్ల పంపిణీ వేగవంతం
- యాంత్రీకరణ రాయితీని నేరుగా రైతుల ఖాతాల్లో జమ
- ఆగస్టులో 1.17 లక్షల టన్నుల యూరియా సరఫరా
- ఫెర్టిలైజర్ యాప్‌పై రైతులకు అవగాహన కల్పించాలి

**ట్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 28 :** రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణ కార్యక్రమం మరింత వేగవంతం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు.



2లో..



## తెలంగాణలో పెరిగిన క్రైమ్.. హైదరాబాద్‌లో తగ్గిన తీవ్రమైన నేరాలు

**ట్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 28 :**

- మూడేళ్లలో తెలంగాణలో నేరాలు 7.15% పెరుగుదల
- కేసులు 2.65 లక్షల నుంచి 2.84 లక్షలకు పెరుగుదల
- డ్రగ్స్ కేసులు 46.10% పెరిగాయి
- ఆర్గనైజ్డ్ క్రైమ్ 25 నుంచి 451 కేసులకు పెరుగుదల
- హైదరాబాద్‌లో తీవ్రమైన నేరాలు 26.23% తగ్గాయి
- రాష్ట్రంలో తీవ్ర నేరాలు 10.33% తగ్గుదల
- సైబర్ క్రైమ్ రేటు 13.29% తగ్గింది
- సైబరాబాద్‌లో డ్రగ్స్ కేసులు 90.98% పెరిగాయి

2లో

2లో



## యుద్ధ ట్యాంకుల ప్రాధాన్యత ఎప్పటికీ తగ్గదు : రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

**జబల్పూర్ (మధ్యప్రదేశ్):** యుద్ధ రంగంలో డ్రోన్లు, క్షిపణుల పాత్ర ఎంత పెరుగుతున్నప్పటికీ, యుద్ధ ట్యాంకుల ప్రాధాన్యత ఎప్పటికీ తగ్గదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు.

2లో

## 'అదృష్టమంటే ఇదేనేమో'.. లక్కీడ్రాలో ఆసక్తికర ఘటన

హైదరాబాద్‌లోని క్యూర్ పరిధిలో తెలంగాణ ప్రభుత్వం నిర్మించనున్న ఇందిరమ్మ టవర్స్‌లో ఫ్లాట్ల కేటాయింపునకు లక్కీడ్రా ప్రారంభమైంది. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలార్‌దేవుపల్లి లక్ష్మీగూడలో ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. లక్కీ డ్రా టోకెన్‌ను ఓ బాలుడితో తీపించగా.. ఆ చిన్నోడి కుటుంబానికే ఇల్లు వరించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ వీడియోను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. పేదల సొంతింటి కల తీర్చాలనే ఈ ప్రభుత్వ సంకల్పానికి, దేవుడి ఆశీస్సులు తోడైనట్టు చిన్నోడు తీసిన లక్కీ డ్రాలో వారి కుటుంబానికే (జరపుల లక్ష్మీ) టోకెన్ రావడం తమ అందరినీ ఆనందానికి, ఆశ్చర్యానికి గురిచేసిందని మంత్రి పేర్కొన్నారు. "ఇలాంటి సందర్భాలు చాలా అరుదు. చిన్న పిల్లలు దేవుళ్లతో సమానం. చిన్నారులు స్వచ్ఛమైన మనసు కలిగినవారు. ఆ దేవుడి ఆశీర్వాదం, ప్రభుత్వ సహకారంతో వారి కల నేరవేరుతున్నందున ఆ కుటుంబం సొంతింటిలో జీవితాంతం చల్లగా బతకాలని, ఆ ఆడబిడ్డను ఆశీర్వదించాను" అని పేర్కొంటూ వీడియోను షేర్ చేశారు.



మిగతాది 2లో

## రైస్ మిల్లుల్లో విజిలెన్స్ తనిఖీలు.. రూ.కోట్ల విలువైన ధాన్యం మాయం



02

**ట్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 28 :** బాసర జిల్లా భైంసా, ముథోల్ మండలాల్లో శుక్రవారం పలు రైస్ మిల్లులో విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీంతో రూ.కోట్ల విలువైన ధాన్యానికి సంబంధించి అక్రమాలు వెలుగు చూశాయి. ముథోల్ మండలంలోని వర్తాల గ్రామంలోని నీలకంఠేశ్వర్ రైస్ మిల్లులో తనిఖీలు చేయగా.. 2022-23 సంవత్సరం రబీ కాలానికి సంబంధించి ప్రభుత్వం 4,224 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సీఎంఆర్ కోసం ఇవ్వగా, కేవలం 336 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే లెక్కతేలింది.



## పోక్సో నేరగాడని తెలిసీ.. బాలికల పాఠశాలలో పోస్టింగా..?

**థాణె:** మహారాష్ట్రలోని థాణె జిల్లాలో గల ఓ ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో 22 మంది బాలికలపై లైంగిక వేధింపుల ఘటన తీవ్ర దుమారం రేపింది. ఈ కేసులో పాఠశాలలో వంటవాడిగా పనిచేస్తోన్న గణపత్ గవిల్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.

# ఉజ్బెకిస్థాన్, కిర్గిస్థాన్‌లకు మోదీ

మొదటి పేజీ తరువాయి

కిర్గిస్థాన్ కంటే ముందు 29, 30 తేదీల్లో ఉజ్బెకిస్థాన్‌లో ప్రధాని పర్యటిస్తారు. ఆ దేశ అధ్యక్షుడు షౌకత్ మిర్జియోయెవ్ ఆహ్వానం మేరకు తాష్కెంట్‌కు వెళతారు. ఇది ఉజ్బెకిస్థాన్‌లో మోదీకి నాలుగో పర్యటన. తాష్కెంట్‌లో మిర్జియోయెవ్‌తో మోదీ ప్రతినిధి స్థాయి చర్చలు జరపనున్నారు. భారత్ – ఉజ్బెకిస్థాన్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ చర్చల ప్రధాన ఉద్దేశం. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, డిజిటల్ కనెక్టివిటీ, ఇంధనం, విద్య, ప్రజల మధ్య సంబంధాలు వంటి అంశాలపై ఇరు దేశాల నేతలు చర్చించనున్నారు. తాష్కెంట్‌లో శాస్త్రి మెమోరియల్, తాష్కెంట్ స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ ఓరియంటల్ స్టడీస్‌లోని మహాత్మాగాంధీ కేంద్రాన్ని మోదీ సందర్శించనున్నారు.

# పోక్సో నేరగాడని తెలిసీ.. బాలికల పాఠశాలలో పోస్టింగా..?

మొదటి పేజీ తరువాయి

కాగా.. దర్యాప్తులో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుడు తరచూ ఇలాంటి నేరాలకు పాల్పడటమే గాక.. గతంలో ఓసారి పోక్సో చట్టం కింద జైలుకు కూడా వెళ్లినట్లు తెలిసింది. అలాంటి నేరచరిత్ర ఉన్న వ్యక్తిని స్కూల్లో నియమించుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

“గణపత్ గవిల్ గతంలో మరో ఆశ్రమ పాఠశాలలో పనిచేశాడు. ఆ సమయంలో అతడు పలువురు బాలికలను వేధించినట్లు ఆరోపణలు రావడంతో పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. నాడు అతడిని విధుల నుంచి సస్పెండ్ చేశారు. కొన్నాళ్ల పాటు జైల్లో ఉండి వచ్చాడు. ఇప్పుడు అతడిని మళ్లీ ఎలా విధుల్లోకి తీసుకున్నారు? ఎవరు నియమించారన్నది ఇంకా తెలియరాలేదు” అని సంబంధిత అధికారులు వెల్లడించారు.

**ప్రేమజంట బ్రేకప్‌తో పేపర్ లీకేజీ గుట్టురట్టు**

ఠాణె జిల్లాలోని తెంబాలో గల ఆదివాసి ఆశ్రమ పాఠశాలలో తాజా ఘటన చోటుచేసుకుంది. తొలుత బాధిత విద్యార్థులు ఆగస్టు 24న దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. భోజనం కోసం వచ్చిన తమను గణపత్ అసభ్యంగా తాకుతూ కొంతకాలంగా వేధిస్తున్నాడని పేర్కొన్నారు. దీంతో స్కూల్ యాజమాన్యాన్ని సంప్రదించిన పోలీసులు.. కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. ప్రస్తుతం దీనిపై దర్యాప్తు కొనసాగుతోంది. గణపత్ నియామకంపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

# ఆయిల్‌పామ్ సాగుకు ఊతం

మొదటి పేజీ తరువాయి

రైతుల్లో పెరుగుతున్న ఆసక్తికి అనుగుణంగా మొక్కల లభ్యత పెంచడంతోపాటు సకాలంలో మొక్కలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సచివాలయంలో వ్యవసాయ, సహకార శాఖల పరిధిలోని పలు అంశాలపై ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ పురోగతి, ఆయిల్‌పామ్ సాగు విస్తరణ, రసాయన ఎరువుల లభ్యత, యూరియా సరఫరా, ఇబ్బందులు, వ్యవసాయ యాంత్రీకరణ, రైతు వేదికలపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు తదితర అంశాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. రైతులకు వ్యవసాయ పనులు సులభతరం చేయడంతోపాటు సాగు ఖర్చులు తగ్గించేందుకు అమలు చేస్తున్న వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రైతులకు అందించాల్సిన పనిముట్లను ఖరారు చేసినట్లు తెలిపారు.

రైతుల అవసరాలకు అనుగుణంగా పనిముట్లను ఎంపిక చేసి పంపిణీ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈసారి యాంత్రీకరణ పథకం కింద అందించే రాయితీ నిధులు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. యూరియా సరఫరాలో ఇబ్బందులు లేవని.. కేంద్రం ప్రవేశపెట్టిన ఫెర్టిలైజర్ యాప్ ద్వారా వచ్చే సమస్యలు పరిష్కరిస్తూ రైతులకు యూరియా సరఫరా చేస్తున్నామని మంత్రి తుమ్మల తెలిపారు. ఆగస్టు సరఫరా ప్రణాళికలో భాగంగా 1.50 లక్షల మెట్రిక్ టన్నులకు గాను 1.17 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను రాష్ట్రానికి తెప్పించగలిగామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఫెర్టిలైజర్ యాప్ వినియోగం, యాప్‌లో బుకింగ్, లభ్యత, కొనుగోలు ప్రక్రియ వంటి అంశాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను తుమ్మల ఆదేశించారు.

# తెలంగాణలో పెరిగిన క్రైమ్.. హైదరాబాద్‌లో తగ్గిన తీవ్రమైన నేరాలు

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్‌లో తీవ్రమైన నేరాలు తగ్గినట్లు డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. తెలంగాణలో నేరాలపై పోలీసు అధికారులతో డీజీపీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వివరాలు వెల్లడించారు. తెలంగాణలో మూడేళ్లలో నేరాలు 7.15 శాతం పెరిగాయి. 2023–24లో 2,65,377 కేసులు నమోదు కాగా, 2025–26లో వీటి సంఖ్య 2,84,363కు పెరిగింది. డ్రగ్స్ కేసుల్లో 46.10% పెరుగుదల నమోదై 2,026 నుంచి 2,960 కేసులు పెరిగాయి. ఆర్గనైజ్డ్ క్రైమ్ కేసులు 25 నుంచి 451కి పెరిగాయి. ట్రాఫిక్ నేరాల్లో 9.48% పెరుగుదల నమోదైంది. మరోవైపు సైబర్ క్రైమ్ రేటు 13.29 శాతానికి తగ్గింది. ఆర్థిక నేరాలు 13.28%, తీవ్ర నేరాలు 10.33 శాతానికి తగ్గాయి. హైదరాబాద్ నగరంలో తీవ్రమైన నేరాలు 26.23% తగ్గగా, సైబరాబాద్‌లో డ్రగ్స్ కేసులు 90.98% పెరిగాయి. ఆదిలాబాద్‌లో డ్రగ్స్ కేసులు 57 నుంచి 219కి చేరాయి.

సమీక్ష సందర్భంగా అధికారులకు డీజీపీ పలు సూచనలు ఇచ్చారు. నెలవారీ క్రైమ్ రివ్యూలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. క్రైమ్ రివ్యూలు కేవలం గణాంకాలకే పరిమితం కాకూడదన్నారు. నేరాల కారణాలు, పని విధానం, దర్యాప్తు నాణ్యత, కేసుల పరిష్కారంపై విశ్లేషణ చేయాలన్నారు. ఫీల్డ్ లెవల్ పోలీసింగ్‌ను బలోపేతం చేయాలని ఆదేశించారు. తనిఖీల్లో గుర్తించిన సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. నేర ధోరణులను ముందుగానే గుర్తించి యాక్షన్ ప్లాన్‌లు రూపొందించాలని పేర్కొన్నారు. క్రైమ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ (సీసీటీఎన్ఎస్) డేటా అప్‌డేట్ 96%కి చేరిందన్నారు. గతంలో ఈ ఇది 70–80 శాతం ఉన్నట్లు పేర్కొన్నారు. ఏఐ, సీసీటీఎన్ఎస్, టీజీ కాప్, హాక్ఐ టెక్నాలజీ, ఈగల్, ఐసీజేఎస్, కొత్త క్రిమినల్ చట్టాల అమలుపైనా డీజీపీ సమీక్ష నిర్వహించారు. యూనిట్ స్థాయి జవాబుదారీతనం, సత్వర నిర్ణయాలు, ఫోకస్డ్ ఫీల్డ్ యాక్షన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశించారు. డ్రగ్స్‌పై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు.

# యుద్ధ ట్యాంకుల ప్రాధాన్యత ఎప్పటికీ తగ్గదు : రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

మొదటి పేజీ తరువాయి



సరిహద్దుల్లో శత్రువుకు ఇవి “ఉక్కు గోడ”లా నిలిచి, సైనికుల ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని కొనియాడారు. గురువారం మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో ఉన్న 57 ఏండ్ల చరిత్ర కలిగిన వెహికల్ ఫ్యాక్టరీ జబల్‌పూర్ (వీఎఫ్ జే)లో రూ.472 కోట్ల వ్యయంతో నిర్మించనున్న టీ–సిరీస్ యుద్ధ ట్యాంకుల ఓవర్‌హాల్ కేంద్రానికి ఆయన శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రాజ్?నాథ్?సింగ్ మాట్లాడారు. మన సైన్యం ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన బలగాల్లో ఒకటిగా ఉందని, టీ–72, టీ–90 యుద్ధ ట్యాంకులు గ్రౌండ్ వార్‌ఫేర్‌కు అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఈ నూతన కేంద్రం ద్వారా ఏటా 80 టీ–72, టీ–90 ట్యాంకులను ఓవర్‌హాల్ చేయనున్నట్లు తెలిపారు. భారత సైన్యానికి ఏటా సుమారు 230 ట్యాంకుల పునరుద్ధరణ చేయాల్సిన అవసరం ఉందన్నారు.

# 29న రాజ్యాంగ పరిరక్షణపై జస్టిస్ మేనకా గురుస్వామి కీలక ప్రసంగం

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది, రాజ్యసభ సభ్యురాలు డాక్టర్ మేనకా గురుస్వామి ‘ఇండియన్ కాన్స్టిట్యూషన్ అండ్ ఇట్స్ ప్రొటెక్షన్’ (Indian Constitution and its Protection) అనే అంశంపై ప్రసంగించనున్నారు.

ఈ కార్యక్రమం ఆగస్టు 29, శనివారం సాయంత్రం హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లో ఉన్న ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ విశ్వేశ్వరయ్య భవన్ మెయిన్ ఆడిటోరియంలో జరగనుంది. సాయంత్రం 5.30 గంటలకు హై–టీ ఏర్పాటు చేశారు. అనంతరం 6 గంటలకు మేనకా గురుస్వామి ప్రసంగం ప్రారంభమవుతుంది. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, చట్టపరమైన అంశాలపై ఆసక్తి ఉన్నవారు ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుతం దేశంలో రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్యం, ప్రాథమిక హక్కులు, చట్టబద్ధ పాలన వంటి అంశాలపై విస్తృతంగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రసంగానికి ప్రాధాన్యత ఏర్పడింది. అలాగే, రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు.. రాజ్యాంగాన్ని పరిరక్షించడంలో న్యాయవ్యవస్థ, ప్రజాస్వామ్య సంస్థలు, పౌరుల పాత్ర ఏమిటనే అంశాలపై మేనకా గురుస్వామి తన అభిప్రాయాలను పంచుకోనున్నారు.

సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదిగా మేనకా గురుస్వామి రాజ్యాంగం, పౌర హక్కులకు సంబంధించిన పలు కీలక కేసుల్లో వాదించారు. ముఖ్యంగా భారతీయ శిక్షాస్మృతిలోని (IPC) సెక్షన్ 377ను సవాలు చేసిన న్యాయపోరాటంలో ఆమె కీలక పాత్ర పోషించారు. ఈ నేపథ్యంలో రాజ్యాంగాన్ని ఎలా పరిరక్షించాలి? ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో పౌరుల బాధ్యత ఏమిటి? వంటి అంశాలపై ఆమె చేసే ప్రసంగం ఆసక్తిని రేకెత్తించే అవకాశం ఉంది. ఈ కార్యక్రమానికి నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా, హైదరాబాద్ వైస్ ఛాన్స్‌లర్

# పరకాల వివాదం తర్వాత.. సీఎం నివాసానికి మంత్రి కొండా సురేఖ

మొదటి పేజీ తరువాయి

సీఎం రేవంత్‌రెడ్డికి బంగారు రాఖీ కట్టిన తర్వాత.. ఆమె నివాసంలో కొండా సురేఖ మీడియాతో మాట్లాడారు. “సీఎం రేవంత్‌రెడ్డికి మూడోసారి రాఖీ కట్టా. నేను అందరికీ సోదరినే. పండుగ వాతావరణంలో ఎలాంటి రాజకీయ వ్యాఖ్యలు చేయను. ముఖ్యమంత్రికి మహిళల అండ ఎప్పుడూ ఉంటుంది. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే శక్తి ఆయనకు ఇవ్వాలని దేవుడిని కోరుకున్నా. ఆడబిడ్డల ఆశీర్వాదాలు సీఎంకు ఎప్పుడూ ఉండాలని కోరుకున్నా” అని తెలిపారు.

**ఏం జరిగిందంటే?**

ఇటీవల.. ములుగు, పరకాలలో జరిగిన కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. అయితే ఈ కార్యక్రమాల్లో వరంగల్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తోన్న కొండా సురేఖ పాల్గొనలేదు. ముఖ్యమంత్రి పర్యటనలో స్థానిక మంత్రి పాల్గొనకపోవడం చర్చనీయాంశమైంది. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని మంత్రి కొండా సురేఖ తీవ్ర స్థాయిలో వ్యతిరేకిస్తున్నారు. తమ వర్గీయులను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపణలు చేశారు. మరోవైపు పరకాల బహిరంగ సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి వచ్చే ఎన్నికల్లో రేవూరి ప్రకాశ్‌రెడ్డిని భారీ ఆధిక్యతతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే ఎన్నికల్లో రేవూరే అభ్యర్థి అన్న సంకేతం ఇచ్చినట్లయ్యింది. ఇది జరిగిన మరుసటి రోజే కొండా సురేఖ కుమార్తె పరకాల నియోజకవర్గంలోని గీసుకొండలో సభ ఏర్పాటు చేసి ముఖ్యమంత్రిపైన, స్థానిక ఎమ్మెల్యేపైన తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేయడంతో పాటు వచ్చే ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీచేస్తానని చెప్పారు. సుస్మిత చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ అధిష్ఠానం కూడా సీరియస్‌గా తీసుకొన్నట్లు సమాచారం. నేరుగా ముఖ్యమంత్రిపై చేసిన విమర్శలు, ఆరోపణలు కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చనీయాంశంగా మారాయి. ఈ వ్యవహారంలో పీసీసీ క్రమశిక్షణా కమిటీ మంత్రి కొండా సురేఖకు నోటీసు ఇవ్వగా, కుమార్తె చేసిన ఆరోపణలకు తానెలా బాధ్యురాలిని అవుతానని సమాధానం ఇచ్చారు. క్రమశిక్షణా రాహిత్యంగా భావించి నోటీసులివ్వడంతోనే పరిమితం కాకుండా చర్యలకు కూడా ఉపక్రమించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో సీఎం నివాసానికి కొండా

# రైస్ మిల్లుల్లో విజిలెన్స్ తనిఖీలు.. రూ.కోట్ల విలువైన ధాన్యం మాయం

మొదటి పేజీ తరువాయి

మిగతా 3,888 మెట్రిక్ టన్నుల ధాన్యం మాయమైంది. లెక్కతేలని ధాన్యం విలువ సుమారు రూ.8.70 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

బైంసా మండలంలోని మాటేగా గ్రామంలో ఉన్న నీలకంఠ రైస్ మిల్లులో తనిఖీలు చేయగా అక్కడ 977 మెట్రిక్ టన్నుల ధాన్యం తేడా వచ్చింది. దీని విలువ సుమారు రూ.2.19 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. బైంసా మండలంలోని దేగామ గ్రామంలో ఉన్న ఆదిత్య నారాయణ రైస్ మిల్‌కు పౌరసరఫరాల శాఖ 1,991 టన్నుల ధాన్యం ఇవ్వగా.. మిల్లులో ఒక్క బస్తా కూడా లేదు. మాయమైన ధాన్యం విలువ రూ.4.86 కోట్లు ఉంటుందని అధికారులు అంచనాకు వచ్చారు. ఈ విజిలెన్స్ దాడిలో కరీంనగర్ విజిలెన్స్ డీఎస్పీ సీతారెడ్డి, తహసీల్దార్ దినేష్ చంద్ర, సీఐలు అనిల్ కుమార్, ప్రశాంత్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ‘అదృష్టమంటే ఇదేనేమో’.. లక్కీడ్రాలో ఆసక్తికర ఘటన

మొదటి పేజీ తరువాయి

మరోవైపు, నేటి నుంచి ఈ నెల 31వ తేదీ వరకు 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సుమారు 8 వేల ఫ్లాట్లకు లక్కీడ్రా నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. రోజుకు నాలుగు నియోజకవర్గాల చొప్పున ఈ ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో 480 ఫ్లాట్లకు 600 మంది లబ్ధిదారులను లక్కీడ్రా ద్వారా ఎంపిక చేస్తామని, అనంతరం అధికారులు క్షేత్రస్థాయిలో తుది పరిశీలన చేస్తారన్నారు. వీరిలో ఎవరైనా అనర్హులుగా తేలితే మిగిలిన 120 మందిలోని అర్హులకు అవకాశం కల్పిస్తామని చెప్పారు. క్యూర్ పరిధిలో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి పొంగులేటి తెలిపారు. మరో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థలాల గుర్తింపు ప్రక్రియ పూర్తయిందని, ఆయా నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం సెప్టెంబర్ 3వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించారు.

# మాజీ మంత్రి అంబటి రాంబాబుకు అస్వస్థత.. అపోలో ఆస్పత్రికి తరలింపు

హైదరాబాద్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు అస్వస్థతకు గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు ఆయనను హైదర్‌గూడలోని అపోలో ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పలు పరీక్షలు నిర్వహించగా గుండెకు సంబంధించిన సమస్య ఉన్నట్లు గుర్తించారు. దీంతో వైద్యులు రెండు స్టెంట్లు వేశారు. ప్రస్తుతం ఆయన ఐసీయూలో వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు.

ఆరోగ్యం నిలకడగా ఉందని, అబ్జర్వేషన్ అనంతరం సాధారణ గదికి తరలిస్తామని వైద్యులు తెలిపారు. వైద్యులు ఆయన ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. అంబటి అనారోగ్యానికి గురయ్యాడని తెలియడంతో వైసీపీ శ్రేణులు, ఆయన అభిమానులు ఆందోళనకు గురవుతున్నారు. పలువురు నేతలు ఆసుపత్రికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీస్తున్నారు.

# నార్సింగిలో హిట్ అండ్ రన్ కేసు... అతివేగంతో బైకును ఢీకొన్న గుర్తు తెలియని వాహనం...

హైదరాబాద్ లో మరో హిట్ అండ్ రన్ కేసు నమోదయ్యింది. గుర్తు తెలియని వాహనం మితిమీరిన వేగంతో వచ్చి ఢీకొనడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందారు. శుక్రవారం ( ఆగస్టు 28 ) జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి... గోల్కొండకు చెందిన మహమ్మద్ అబ్దుల్ సమద్ అనే యువకుడు నార్సింగి నుండి గండిపేటవైపు డెలివరీ తీసుకొని వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మితిమీరిన వేగంతో వచ్చిన వాహనం అబ్దుల్ ప్రయాణిస్తున్న బైకును ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయిందని చెబుతున్నారు స్థానికులు. వాహనం కొట్టిన వెంటనే అదుపుతప్పి ఫుట్పాత్ పై పడి ప్రాణాలు విడిచాడు అబ్దుల్. అబ్దుల్ ఫస్ట్ క్లబ్ లో డెలివరీ బాయ్ గా పని చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందించారు స్థానికులు. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలానికి చేరుకున్న నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు పోలీసులు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా గుర్తు తెలియని వాహనం కోసం గాలిస్తున్నారు పోలీసులు.

# భారత్‌కు రానున్న ‘జావెలిన్’.. భుజంపై నుంచే శత్రువుకు గురి..!



భారత అమ్ముల పొదిలో మరో అస్త్రం చేరనుంది. అధునాతన జావెలిన్ క్షిపణులను కొనుగోలు చేసేందుకు అమెరికాతో భారత్‌కు ఒప్పందం కుదిరింది. ఈ విషయాన్ని మన దేశంలోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ శుక్రవారం వెల్లడించారు. ఇరు దేశాల మధ్య సమర్థవంతమైన ద్వైపాక్షిక రక్షణ భాగస్వామ్యాన్ని ఈ ఒప్పందం ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు.

యూఎస్ ఫారిన్ మిలిటరీ సేల్స్ ప్రక్రియలో భాగంగా ఈ క్షిపణుల కొనుగోలుకు సంబంధించిన అంగీకార పత్రాలపై భారత సైన్యం తాజాగా సంతకం చేసింది. అయితే, ఒప్పందం లో భాగంగా ఎన్ని క్షిపణులను మన దేశం కొనుగోలు చేస్తోంది..? మొత్తం ఖర్చెంత..? అన్న వివరాలు ఇంకా తెలియరాలేదు.

జావెలిన్.. ట్యాంక్ విధ్వంసకర క్షిపణి (ఏటీజీఎం–యాంటీ ట్యాంక్ గైడెడ్ మిసైల్). దీనిని భుజంపై నుంచి శత్రు ట్యాంకుల పైకి గురిపెట్టి ప్రయోగించవచ్చు. దీనిలో 3.7 అడుగుల క్షిపణి, డిస్పోజబుల్ లాంఛ్ ట్యూబ్, కమాండ్ కంట్రోల్ యూనిట్ ఉంటాయి. వాస్తవానికి ట్యాంక్‌పైకి విధ్వంసకర ఆయుధాలను ప్రయోగించినప్పుడు.. ఆ ప్రదేశం నుంచి పొగ, వేడి వెలువడతాయి. ప్రత్యర్థులు హీట్ సెన్సర్లతో వాటిని గుర్తిస్తారు. కానీ, జావెలిన్‌లో తొలుత ట్యూబ్ నుంచి ఓ మోటర్ క్షిపణిని బయటకు కొంతదూరం విసురుతుంది. ఆ తర్వాత క్షిపణి మోటార్ పనిచేయడం మొదలుపెట్టి లక్ష్యం వైపు దూసుకెళుతుంది. దీనిని కంప్యూటర్‌తో నియంత్రిస్తారు. దీంతో కచ్చితంగా జావెలిన్‌ను ఎక్కడినుంచి ప్రయోగించారో శత్రువుకు అర్థం కాదు. ఈ లోపు ప్రయోగించిన వారు సురక్షిత ప్రదేశంలో దాక్కోవచ్చు.

రియాక్టివ్ ఆర్మర్ రక్షణ కవచాలను ఛేదించి.. ట్యాంకును ధ్వంసం చేసేలా దీనిలో రెండు దశల్లో పేలుడు పదార్థాలను అమర్చారు. తొలిదశలో కవచాన్ని ఛేదించి.. ఆ తర్వాత దశలో వార్‌హెడ్ ట్యాంక్‌ను ధ్వంసం చేస్తుంది. వీటిని అమెరికాకు చెందిన రక్షణరంగ దిగ్గజాలు రేథియాన్, లాక్‌హీడ్ మార్టిన్ సంస్థలు అభివృద్ధి చేశాయి. వీటి ఉత్పత్తి చాలా క్లిష్టమైన, ఖరీదైన వ్యవహారం. వీటి ధర దాదాపు 2 లక్షల డాలర్ల వరకూ ఉంటుందని అంచనా.

**ఉక్రెయిన్‌కు దేవదూత..**

రష్యాతో పోరులో ఉక్రెయిన్ ఈ క్షిపణులను విపరీతంగా వినియోగించింది. మాస్కోకు చెందిన పలు యుద్ధ ట్యాంకులను పేల్చేసింది. వీటి నుంచి తప్పించుకోవడం రష్యాకే సవాల్‌గా మారిందంటే.. వీటి సామర్థ్యాన్ని అర్థం చేసుకోవచ్చు. అప్పట్లో ఈ క్షిపణులను ఉక్రెయిన్ వాసులు ‘దేవదూత’తో పోల్చారు.

# కర్ణాటక మంత్రి నాగేంద్ర రెండోసారి రాజీనామా

కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. వాల్మీకి కుంభకోణ ఆరోపణలపై ఆ పార్టీ నేత బి.నాగేంద్ర తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. గతంలోనూ ఇవే ఆరోపణలపై ఆయన పదవి నుంచి తప్పుకొన్నారు. డీకే శివకుమార్ సీఎంగా బాధ్యతల చేపట్టిన తర్వాత మంత్రివర్గంలో చేరిన నాగేంద్ర.. విపక్షాల అవినీతి ఆరోపణల వేళ మరోసారి మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. తన రాజీనామా నిర్ణయాన్ని ప్రకటిస్తూ మీడియా ముందు ఒకింత భావోద్వేగానికి గురయ్యారు.ఇదీ నేపథ్యం: మహర్షి వాల్మీకి షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి కార్పొరేషన్‌లో అకౌంట్స్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన పి.చంద్రశేఖరన్ 2024 మే నెలలో ఆత్మహత్య చేసుకున్నారు. కార్పొరేషన్ నిధుల దుర్వినియోగం జరిగిందని ఆరోపిస్తూ ఓ లేఖ రాశారు. కార్పొరేషన్ ఖాతా నుంచి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాకు రూ.89.63 కోట్లు, అక్కడి నుంచి మరికొన్ని ఖాతాలకు ఆ నిధులు బదిలీ అయినట్లు విచారణలో తేలింది. దీంతో అప్పట్లో రాజకీయంగా దుమారం రేగింది. ఈ వివాదం సమయంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న నాగేంద్ర 2024 జూన్‌లో పదవికి రాజీనామా చేశారు.ప్రచురణ వివాదంలో సోనియా ఆత్మకథ.. స్పందించిన పెంగ్విన్ ఇండియా అయితే, తనపై వచ్చిన ఆరోపణలన్నీ రాజకీయ ప్రేరేపితమైనవని నాగేంద్ర పేర్కొన్నారు.

## అన్నాచెల్లెళ్లు అనుబంధానికి ప్రతీక రాఖి







**హైదరాబాద్ , ట్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 28 :**
అన్నాచెల్లెళ్లు అనుబంధానికి ప్రతీక రాఖి అని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. రాఖి పండుగ సందర్భంగా బిఆర్ఎస్ ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ వైస్ ప్రెసిడెంట్ , మహిళ నాయకురాలు గొంగిండి సంతోషి
ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నాచెల్లెళ్లు, తోబుట్టువుల మధ్య ఉన్న పవిత్ర ప్రేమకు, బంధానికి చిహ్నంగా జరుపుకునే అతి ముఖ్యమైన హిందూ పండుగ రక్షాబంధన్ రాఖీ పండుగ అని పేర్కొన్నారు. మాజీ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ కు పలువురు మహిళలు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రావణ మాసంలో పౌర్ణమి రోజున
సోదరి తన అన్నయ్య కు, తమ్ముడి చేతికి రక్షా సూత్రం (రాఖీ) కట్టి, అతనికి ఆయురారోగ్యాలు, అదృష్టం కలగాలని కోరుకుంటారని తెలిపారు.

## ఘనంగా రాఖి పండుగ వేడుకలు



**హైదరాబాద్,చిక్కడపల్లి, ట్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 28 :**
అన్నాచెల్లెళ్లు, తోబుట్టువుల మధ్య ఉన్న పవిత్ర ప్రేమకు, బంధానికి చిహ్నంగా జరుపుకునే అతి ముఖ్యమైన హిందూ పండుగ రక్షాబంధన్ రాఖీ పండుగ శ్రావణ మాసంలో పౌర్ణమి రోజున సోదరి తన అన్నయ్య కు, తమ్ముడి చేతికి రక్షా సూత్రం (రాఖీ) కట్టి, అతనికి ఆయురారోగ్యాలు, అదృష్టం కలగాలని కోరుకుంటారు . అంబర్ పేట్ నియోజకవర్గంలోని రాఖీ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా సోదరులకు రాఖీలు కట్టి స్వీట్ లను తినిపించి ఆశీర్వాదం తీసుకున్నారు.

## వంశీ రెడ్డి, తనుష్ రాణింపు.. ధ్రువ్ ఎలెవన్ సీసీ ఘన విజయం

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, ఆగస్టు 28:**
హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ 'సి' డివిజన్ వన్డే లీగ్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా ధ్రువ్ ఎలెవన్ సీసీ, సికింద్రాబాద్ యూనియన్ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది.
ఎం. వంశీ రెడ్డి, వి. తనుష్ అద్భుత బ్యాటింగ్‌తో రాణించడంతో ధ్రువ్ ఎలెవన్ సీసీ 52 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.
తొలుత బ్యాటింగ్ చేసిన ధ్రువ్ ఎలెవన్ సీసీ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 316 పరుగులు చేసింది. ఎం. వంశీ రెడ్డి 91 బంతుల్లో 11 ఫోర్లు, 5 సిక్సర్లతో 121 పరుగులు చేయగా, వి. తనుష్ 113 బంతుల్లో 9 ఫోర్లతో 68 పరుగులు చేశాడు.
317 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన సికింద్రాబాద్ యూనియన్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 265 పరుగులు మాత్రమే చేయగలిగింది. ధ్రువ్ ఎలెవన్ సీసీ బౌలర్ దీపక్ కుమార్ 10 ఓవర్లలో 54 పరుగులు ఇచ్చి 4 వికెట్లు పడగొట్టాడు.
ధ్రువ్ ఎలెవన్ సీసీ అధ్యక్షుడు ఎల్. మహేశ్వర్ రావు, కార్యదర్శి ఎల్. గంగాధర్ తిలక్ జట్టు సమష్టి స్ఫూర్తితో విజయం సాధించినందుకు క్రీడాకారులను అభినందించారు.

## రిషి రాథోడ్ రామావత్ ఆల్‌రౌండ్ ప్రదర్శన.. హీరాధి సీసీ ఘన విజయం



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, ఆగస్టు 28: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ 'సి' డివిజన్ వన్డే లీగ్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా సన్‌గ్రేస్ సీసీ, హీరాధి సీసీ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది.
రిషి రాథోడ్ రామావత్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో హీరాధి సీసీ 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.
టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న సన్‌గ్రేస్ సీసీ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 211 పరుగులు చేసింది. హీరాధి సీసీ బౌలర్ రిషి రాథోడ్ రామావత్ 55 పరుగులు ఇచ్చి 4 వికెట్లు పడగొట్టాడు.
212 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన హీరాధి సీసీ 45 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది.
రిషి రాథోడ్ రామావత్ 134 బంతుల్లో 14 ఫోర్లతో 101 పరుగులు చేసి అద్భుత సెంచరీ సాధించాడు. శివ ఆదిత్య దాస్ గుప్తా 58 బంతుల్లో 4 ఫోర్లతో 38 పరుగులు చేయగా, కెప్టెన్ అక్షజ్ గౌడి 52 బంతుల్లో 4 ఫోర్లతో 42 పరుగులు చేశాడు.
హీరాధి క్రికెట్ క్లబ్ కార్యదర్శి శ్రీ మహేందర్ గౌడ్ జట్టు సమష్టి కృషితో విజయం సాధించినందుకు ఆటగాళ్లందరినీ అభినందించారు.

## బంగారం మైనింగ్ లో హట్టి- సింగరేణి జతకట్టాలి

- **భవిష్యత్తు ప్రాజెక్టుల్లో జాయింట్ వెంచర్ గా కలిసి పని చేయడానికి పరిశీలన చేయాలి**
- **సింగరేణి అధికారులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దిశ నిర్దేశం**
- **బంగారం శుద్ధి కేంద్రం పరిశీలన, హట్టి, యుటీ బంగారు గనులలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విస్తృత పర్యటన.**

బంగారం మైనింగ్‌లో విశేష అనుభవమున్న కర్ణాటక ప్రభుత్వ సంస్థ హట్టి గోల్డ్ మైన్స్‌తో సింగరేణి కలిసి పనిచేసేలా జాయింట్ వెంచర్ అవకాశాలను పరిశీలించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు అధికారులను ఆదేశించారు. రెండు ప్రభుత్వ రంగ సంస్థల సాంకేతిక సామర్థ్యం, అనుభవాన్ని సమన్వయం చేస్తే దేశీయ బంగారం ఉత్పత్తిలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు.
కర్ణాటక గోల్డ్ మైన్స్ ప్రాంతంలో రెండో రోజు పర్యటనలో భాగంగా శుక్రవారం రాయచూర్ జిల్లాలోని హట్టి, యూటి బంగారు గనులను ఉప ముఖ్యమంత్రి సందర్శించారు. బంగారు ఖనిజం తవ్వకం నుంచి శుద్ధ బంగారం తయారీ వరకు చేపడుతున్న ప్రక్రియలను క్షుణ్ణంగా పరిశీలించారు
హట్టి గోల్డ్ మైన్స్‌కు బంగారం అన్వేషణ, తవ్వకం, ప్రాసెసింగ్, శుద్ధిలో అపార అనుభవం ఉందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. బొగ్గు, ఇతర ఖనిజాల అన్వేషణ, తవ్వకాల్లో సింగరేణికి ఉన్న సాంకేతిక నైపుణ్యాన్ని హట్టి అనుభవంతో జోడించాలని సూచించారు. బంగారం అన్వేషణ, తవ్వకం, వెలికితీత, శుద్ధి, ఆధునిక సాంకేతికత వినియోగం, నిపుణుల సేవలు, మానవ వనరుల శిక్షణ తదితర అంశాల్లో రెండు సంస్థలు సంయుక్తంగా పనిచేసేందుకు కార్యాచరణ రూపొందించాలని సింగరేణి అధికారులను ఆదేశించారు.

### ఆర్థిక భద్రతలో బంగారం కీలకం

దేశ ఆర్థిక భద్రతలో బంగారం కీలక పాత్ర పోషిస్తుందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. దేశంలో అందుబాటులో ఉన్న బంగారు ఖనిజ వనరులను శాస్త్రీయంగా అన్వేషించి వెలికితీయడంలో సింగరేణి వంటి ప్రభుత్వ రంగ సంస్థలు ముందుండాలన్నారు.
బంగారం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి దేశీయ ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. హట్టి--సింగరేణి భాగస్వామ్యంతో బంగారం ఉత్పత్తి పెంపు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, స్థానిక ఉపాధి కల్పనతోపాటు దేశ ఆర్థికాభివృద్ధికి మేలు జరుగుతుందని తెలిపారు.

## పద్మారావు గౌడ్ నివాసంలో సందడిగా రాఖీ పండుగ



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, ఆగస్టు 28:**
సికింద్రాబాద్ : సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ నివాసంలో శుక్రవారం రక్షా బంధనం వేడుకలు సందడిగా జరిగాయి. మోండా మార్కెట్ లోని పద్మారావు గౌడ్ నివాసంలో ఆయన సోదరి శకుంతల రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. రక్షా బంధనం సోదర సోదరీ మణుల మధ్య ప్రేమాభిమానాలకు దర్పణం పడుతుందని, విభిన్న సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు చాటాల్సి ఉందని పద్మారావు గౌడ్ పేర్కొన్నారు. ప్రజలకు రక్షా బంధనం శుభాకాంక్షలు తెలిపారు. పద్మారావు గౌడ్ కుమారులు కిషోర్ కుమార్, కిరణ్ కుమార్, రామేశ్వర్ గౌడ్, త్రినేత్ర గౌడ్ లకు వారి సోదరీమణులు మనీష, మౌనికలు రాఖీలు కట్టారు.

## తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను లోక్ భవన్‌లో పరామర్శించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.

గుండె సంబంధిత సమస్యతో అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం డిశ్చార్జ్ అయ్యి లోక్ భవన్‌కు చేరుకున్న గవర్నర్ గారిని ఈరోజు సాయంత్రం ఉప ముఖ్యమంత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకుని, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని డిప్యూటీ సీఎం ఆకాంక్షించారు.

## అక్రమ మోటార్లపై జలమండలి విజిలెన్స్ కొరడా

### బాపునగర్‌లో 14 మోటార్లు స్వాధీనం

జలమండలి నీటి సరఫరా పైపులైన్ లకు అక్రమంగా మోటార్లు అమర్చి నీటిని తోడుతున్న వారిపై విజిలెన్స్ అధికారులు చర్యలు చేపట్టారు. శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు ఖైరతాబాద్ జోన్ పరిధిలోని డివిజన్--16, ఎస్.ఆర్. నగర్ వార్డు బాపునగర్ ప్రాంతంలో జలమండలి విజిలెన్స్ బృందం ప్రత్యేక తనిఖీలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో 14 అక్రమ మోటార్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నీటి సరఫరా సమయంలో పైపులైన్లకు మోటార్లు అమర్చి నీటిని తోడటం వల్ల ఇతర వినియోగదారులకు తగినంత నీరు అందకపోవడంతో పాటు సరఫరా వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతుందని జలమండలి తెలిపింది. అక్రమంగా మోటార్లు వినియోగించే వారిపై తనిఖీలు కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

## పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం

జీహెచ్ఎంసీ చేపడుతున్న బండ్లగూడ ఎక్స్ రోడ్ వద్ద బాక్స్ డ్రెయిన్ నిర్మాణ పనులకు అనుకూలంగా, హైదరాబాద్ మహానగరానికి తాగునీరు సరఫరా చేసే కృష్ణా డ్రింకింగ్ వాటర్ సప్లై ప్రాజెక్ట్ ఫేజ్--×××, రింగ్ మెయిన్--×కి చెందిన 1500 ఎంఎం వ్యాసం గల ఎంఎస్ గ్రావిటీ మెయిన్‌పై జంక్షన్ పని చేపట్టనున్నారు. ప్రతిపాదిత బాక్స్ డ్రెయిన్ అలైన్‌మెంట్‌లో ఈ ప్రధాన పైప్‌లైన్ ఉండటంతో, డ్రెయిన్ నిర్మాణ పనులు నిరాటంకంగా కొనసాగేందుకు జంక్షన్ పని చేపట్టడం అవసరమైంది. ఈ పనులు తేది: 29.08.2026, శనివారం ఉదయం 10 గంటల నుంచి తేదీ 30.08.2026 ఆదివారం ఉదయం 10 గంటల వరకు చేపడతారు. కావున ఈ 24 గంటలు కృష్ణా ఫేజ్--×××, రింగ్ మెయిన్--× పరిధిలోని కొన్ని రిజర్వాయర్ కమాండింగ్ ప్రాంతాల్లో పేర్కొన్న సమయంలో ఆయా ప్రాంతాల్లో తాగునీటి సరఫరా పూర్తిగా లేదా పాక్షికంగానూ.. మరికొన్ని ప్రాంతాల్లో లో - ప్రెషర్ తో నీటిసరఫరా జరిగే అవకాశం ఉంది.
అంతరాయం ఏర్పడే ప్రాంతాలు:
శాస్త్రిపురం, బండ్లగూడ, శంషాబాద్, మధుబన్, దుర్గానగర్, సులేమాన్ నగర్, పీడీపీ, గోల్డెన్ హైట్స్, అత్తాపూర్, కిస్మత్‌పూర్, 9 నంబర్, అల్లాబండ, భోజగుట్ట, గంధంగూడ, ప్రశాసన్ నగర్, జూబ్లీహిల్స్, తట్టిఖానా, గచ్చిబౌలి, మాదాపూర్ మరియు షేక్‌పేట్ రిజర్వాయర్ పరిధిలోని కొన్ని ప్రాంతాలు. కావున అంతరాయం ఏర్పడనున్న ప్రాంతాల్లోని వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోగలరని కోరడమైనది.

## జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ గారికి రాఖీ కట్టిన సరిత తిరుపతయ్య యాదవ్.

రాఖీ పౌర్ణమి సందర్భంగా యూసుఫ్‌గూడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర గొర్రెలు మరియు మేకల అభివృద్ధి సహకార సమాఖ్య చైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య యాదవ్ గారు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే శ్రీ వి. నవీన్ యాదవ్ గారికి రాఖీ కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సోదర--సోదరీమణుల ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను ఆనందంగా జరుపుకున్నారు..ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ సరిత తిరుపతయ్య యాదవ్ గారికి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు..

## హర్మూజ్‌లో సీమైన్స్‌ను తొలగించేశాం: అమెరికా ప్రకటన



హర్మూజ్ జలసంధి తమ ఆధీనంలో ఉందని నిరూపించుకొనేందుకు అమెరికా కీలక అడుగు వేసింది. ఇప్పుడు ఆ జలసంధి సురక్షితం అనే భావన ప్రపంచానికి కల్పించేందుకు అత్యంతక కీలక ప్రకటన చేసింది. పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభంకాగానే హర్మూజ్ (గొత్మిఖ్ శీట ఎశీతీఎబఓ)ను తన నియంత్రణలోకి తెచ్చుకున్న ఇరాన్ (×త్మిఅ).. దానిలోని అంతర్జాతీయ నౌకా మార్గాల్లో సీమైన్స్‌ను పరిచింది. దాంతో ఇరాన్ చెప్పిన మార్గంలో ఇతర మార్గాల్లో వెళ్లిన పలు నౌకలు వాటిని ఢీకొని పేలిపోయిన సంగతి తెలిసిందే. నౌకాయానానికి ఆటంకం కలిగిస్తోన్న ఆ సీమైన్స్ (గామ్మ వీఱఅవం)ను పూర్తిగా తొలగించినట్లు తాజాగా యూఎస్ సెంట్రల్ కమాండ్ సంచలన ప్రకటన చేసింది. వీటి తొలగింపు ఆపరేషన్ రహస్యంగా చేపట్టినట్లు పేర్కొంది. వాస్తవానికి ఈ సీమైన్స్ (గామ్మవీఱఅవం ఱఅ ఎశీతీఎబఓ) తొలగింపు ఆపరేషన్ అత్యంత సంక్లిష్టమైంది. విశాల సముద్రంలో ఆవగింజ కోసం వెతికినట్లు ఉంటుంది. చాలా కాలంగా ట్రంప్ వీటిని తొలగిస్తామని బలంగా చెబుతున్నారు. కొన్ని నెలల క్రితం వీటిని తొలగించేందుకు అమెరికా రెండు గైడెడ్ మిసైల్ డిస్ట్రాయర్లను రంగంలోకి దింపింది. వీటికి అండగా ఎంకే 18, మాడ్ 2 కింగ్‌ఫిష్ మానవ రహిత పరికరాలు కూడా వాడుతోంది. సీమైన్స్‌లో చాలా రకాలుంటాయి. సముద్ర జలాల్లో నౌకలు కదిలినప్పుడు ఏర్పడే పీడనం, తరంగాల శబ్దం, నౌకల విద్యుత్తు శక్తి ఆధారంగా పనిచేసే మైన్స్ ఉంటాయి. వీటిల్లో కొన్నింటిని లేజర్ లేదా రాడార్ల సాయంతోనూ గుర్తించలేము, ఒకవేళ గుర్తించినా వాటిని పేల్చడం కష్టతరం. అలాంటి ఆపరేషన్‌ను అమెరికా పూర్తి చేశానని ప్రకటించడం ఓ భారీ ఊరట.

త్రినెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
శనివారం ఆగస్ట్ 29, 2026
www.trinetnews.com

# రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**---మహిళా ప్రయాణికులతో ఆత్మీయంగా ముచ్చటించిన మంత్రి..**
**--- రాఖీలు కట్టిన మహిళా ప్రయాణికులు**

త్రినెట్ న్యూస్ ఆగస్ట్ 28 :
రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రానికి వెళ్తున్న క్రమంలో పందిళ్ల నుంచి హుస్నాబాద్ బస్‌స్టేషన్ వరకు సాధారణ ప్రయాణికులతో కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు.
ఈ సందర్భంగా బస్సులోని మహిళా ప్రయాణికులు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు రాఖీలు కట్టి తమ ఆత్మీయతను చాటుకున్నారు. మహిళా ప్రయాణికులు రాఖీలు కట్టడంతో మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. ప్రయాణికులను ఆత్మీయంగా పలకరిస్తూ వారి ప్రయాణ అనుభవాలను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.పండుగ రోజున విధులు నిర్వహిస్తున్న డ్రైవర్, కండక్టర్లకు అభినందనలు
రాఖీ పౌర్ణమి వంటి పండుగ రోజుల్లో కూడా ప్రజలు తమ గమ్యస్థానాలకు సురక్షితంగా చేరేందుకు నిరంతరం



సేవలందిస్తున్న ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేకంగా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పండుగ రోజుల్లో కుటుంబాలకు దూరంగా ఉంటూ ప్రజల కోసం సేవలందిస్తున్న ఆర్టీసీ సిబ్బంది సేవలను అభినందించారు.
మహిళలకు ఉచిత ప్రయాణం.. ఇప్పటివరకు రూ.12 వేల కోట్ల విలువైన సేవలు
ప్రజా పాలన ప్రభుత్వంలో మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రంలో మహిళలు సుమారు రూ.12 వేల కోట్ల విలువైన ప్రయాణాన్ని ఉచితంగా పొందారని పేర్కొన్నారు.
మహాలక్ష్మి పథకం అమలుతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ గణనీయంగా పెరిగిందని, పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా దాదాపు 5 వేల ఆర్టీసీ బస్సులను అందుబాటులో ఉంచి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నామని మంత్రి వెల్లడించారు.
సంక్షేమం, అభివృద్ధే ప్రజా పాలన ప్రభుత్వ లక్ష్యం
ప్రజా పాలన ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళు_న్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.
200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ, నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, రైతు భరోసా, రైతు రుణమాఫీ తదితర పథకాల ద్వారా ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు.
ముఖ్యంగా మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వారి ఆర్థిక సాధికారత, కుటుంబ ఆర్థిక అభివృద్ధి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. మహిళల సంక్షేమం, సాధికారతకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు.
ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి ప్రతి కుటుంబంలో సంతోషాన్ని, ఐక్యతను నింపాలని మంత్రి ఆకాంక్షించారు.

# మహేశ్వరం ప్రాంతాన్ని భారత్ ఫ్యూచర్ సిటీలో కలపాలి

**•విలీనం కాని గ్రామాలను చేర్చాలని జేఏసీ డిమాండ్**
**•ఈ నెల 31, సెప్టెంబర్ 1న రిలే నిరాహార దీక్షలు**

త్రినెట్ న్యూస్ ఆగస్ట్ 28 :
రంగారెడ్డి జిల్లాలో ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేయనున్న భారత్ ఫ్యూచర్ సిటీలో మహేశ్వరం ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో భాగస్వామ్యం చేయాలని ఫ్యూచర్ సిటీ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు మహేశ్వరంలో శుక్రవారం జేఏసీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులో మహేశ్వరం, కందుకూరు మండలాలకు చెందిన కొన్ని గ్రామాలు ఇప్పటికే విలీనమయ్యాయని జేఏసీ నాయకులు తెలిపారు. మిగిలిన గ్రామాలను కూడా ఫ్యూచర్ సిటీలో చేర్చాలని కోరుతూ ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్ లు ఏకగ్రీవ తీర్మానాలు చేసి ఎంపీడీవోతో పాటు జేఏసీకి అందజేయాలని సూచించారు.ఈ అంశంపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రంగారెడ్డి జిల్లా ఇంఛార్జ్, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు పలుమార్లు



వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు.జేఏసీ ఛైర్మన్ వత్తుల రఘుపతి మాట్లాడుతూ.. సుమారు 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. ఐటీ, ఏఐ, డేటా సెంటర్లు, లైఫ్ సైన్సెస్, విద్య, వైద్యం, తయారీ రంగాల్లో భారీ పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే అమెజాన్ వెబ్ సర్వీసెస్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన జరగడం పెట్టుబడుల ఆకర్షణకు నిదర్శనమన్నారు. ఫ్యూచర్ సిటీలో పరిశ్రమలు, సంస్థలు ఏర్పాటైతే స్థానిక యువతకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంతో అనుసంధానించే రహదారులు అభివృద్ధి కానుండటంతో మహేశ్వరం రవాణాపరంగా కీలక ప్రాంతంగా మారుతుందని తెలిపారు. బుల్లెట్ ట్రైన్, మెట్రో, రతన్ టాటా 300 ఫిట్ రేడియల్ రోడ్లు, మల్టీమోడల్ రవాణా వ్యవస్థలు అందుబాటులోకి వస్తే ఈ ప్రాంతానికి మరింత ప్రాధాన్యం పెరుగుతుందన్నారు.కొత్త పరిశ్రమలు, కార్యాలయాలు, వాణిజ్య సంస్థలు, రహదారుల అభివృద్ధితో రియల్ ఎస్టేట్, నిర్మాణం, రవాణా, హోటళ్లు, చిన్న వ్యాపారాలు, సేవా రంగాలు విస్తరించే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా జేఏసీ అధ్యక్షుడు కర్నాటి మనోహర్ మాట్లాడుతూ.. ఫ్యూచర్ సిటీ పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందితే మహేశ్వరం ప్రాంతానికి భారీగా ప్రయోజనం చేకూరుతుందని, భవిష్యత్ తరాలకు మెరుగైన నగరాన్ని అందించేందుకు ప్రతి గ్రామ పంచాయతీ ముందుకు రావాలని ఆయన కోరారు.ఫ్యూచర్ సిటీలో విలీనం కోసం తీర్మానం చేయని గ్రామాల సర్పంచ్‌ల తీరుకు నిరసనగా ఈ నెల 31, సెప్టెంబర్ 1న మహేశ్వరం లోని ప్రభుత్వ కార్యాలయాల ముందు రిలే నిరాహార దీక్షలు చేపడతామని జేఏసీ నాయకులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వట్టేలా మల్లేష్ యాదవ్, రాష్ట్ర బీజేపీ నాయకుడు కడారి జంగయ్య, సీపీఐ నాయకుడు దత్తునాయక్, బీజేపీ మాజీ ఎంపీటీసీ పోతర్ల సుదర్శన్ యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కాకిశ్వర్ ముదిరాజ్, ఎమ్మార్పీఎస్ మాజీ మండల అధ్యక్షుడు ఎర్ర గణేష్, జేఏసీ సలహాదారు కె. జగన్‌రెడ్డి, గోటికె రవీందర్‌రెడ్డి, నర్సింహా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్కతుర్తి మండల ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు

**•అక్కాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధానికి ప్రతీక రాఖీ పౌర్ణమి**

త్రినెట్ న్యూస్ ఆగస్ట్ 28 :
అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలు, ఆత్మీయ అనుబంధం, పరస్పర విశ్వాసానికి ప్రతీకగా జరుపుకునే పవిత్రమైన రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా ఎల్కతుర్తి మండలంలోని అక్కాచెల్లెళ్లకు, అన్నదమ్ములకు ఎల్కతుర్తి మండల ప్రెస్ క్లబ్, విలేకరుల తరఫున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా సోదరీమణులు తమ సోదరులకు ప్రేమతో రాఖీ కట్టి వారి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలను ఆకాంక్షించడం ఆనవాయితీగా వస్తోందని ప్రెస్ క్లబ్ ప్రతినిధులు పేర్కొన్నారు. సోదరులు తమ అక్కాచెల్లెళ్లకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇవ్వడం, వారి పట్ల ప్రేమాభిమానాలను



చాటుకోవడం ఈ పండుగ ప్రత్యేకత అన్నారు.రాఖీ పౌర్ణమి కేవలం రాఖీ కట్టుకునే పండుగ మాత్రమే కాదని, కుటుంబ బంధాలు, ప్రేమ, ఆప్యాయత, పరస్పర గౌరవం, విశ్వాసానికి ప్రతీకగా నిలిచే పవిత్రమైన కుటుంబ పండుగ అని తెలిపారు. ఆధునిక జీవన విధానంలో బంధాలు, ఆత్మీయతలు కొంత దూరమవుతున్న నేపథ్యంలో ఇటువంటి పండుగలు కుటుంబ సభ్యులను ఒకచోట చేర్చి బంధాలను మరింత బలోపేతం చేస్తాయని అన్నారు.ఈ పండుగ ప్రతి ఒక్కరిలో ప్రేమ, ఐక్యత, పరస్పర గౌరవం, కుటుంబ విలువలను పెంపొందించాలని ఆకాంక్షించారు. ఎల్కతుర్తి మండలంలోని ప్రతి కుటుంబంలో రాఖీ పౌర్ణమి ఆనందం, శాంతి, సుఖసంతోషాలను నింపాలని, అన్నాచెల్లెళ్ల అనుబంధం కలకాలం కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు.ఈ సందర్భంగా ఎల్కతుర్తి మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సాతూరి చంద్రమౌళి, గౌరవ అధ్యక్షులు కందుకూరి రాజన్న, ఉపాధ్యక్షులు చిర్ర ఉదయచందర్, రామోజు సతీష్‌చారి, ప్రధాన కార్యదర్శి సిద్ధాంతి నిరంజన్, కార్యదర్శి కొలిపాక శ్రీనివాస్, జూపాక శ్రీనివాస్, ప్రచార కార్యదర్శులు నల్ల రాజిరెడ్డి, బొంకూరి వంశీ, కర్రె తిరుపతి, కార్యవర్గ సభ్యులు బెజ్జెంకి నరేష్, ఎర్రోళ్ల రాజబాబు, అడ్డూరి అనిల్, అంబాల ప్రవీణ్, క్లబ్ సభ్యులు ఎర్రోళ్ల సతీష్, చిలుముల ప్రమోద్, కుందుర్తి సదానందం, అడ్డూరి శ్రీకాంత్, సుద్దాల జయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.మండలంలోని ప్రతి అక్కాచెల్లెమ్మకు, అన్నదమ్ములకు, వారి కుటుంబ సభ్యులందరికీ ఎల్కతుర్తి మండల ప్రెస్ క్లబ్ మరియు ప్రెస్ క్లబ్ విలేకరుల తరఫున రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.

# బూరుగడ్డ గ్రామంలో ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం

త్రినెట్ న్యూస్ ఆగస్ట్ 28 :
కాకతీయుల కాలంనాటి పురాతన ముత్యాలమ్మ తల్లి (ఊరు ముత్యాలమ్మ) పురాతన గుడి కొంత శిథిలావస్థకు చేరగా నూతన గుడి నిర్మాణం. ప్రతిష్ట కార్యక్రమాలు గత మూడు రోజులుగా గ్రామ ప్రజల సహకారాలతో పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకొని నేడు విగ్రహాలను ప్రతిష్ట చేయడం జరిగినది మొదటగా ముత్యాలమ్మ తల్లి విగ్రహం పోతురాజు విగ్రహం జంట నాగుల విగ్రహాలను పండితులు ప్రతిష్ట గావించినారు, ముదుంబై హరీష్ కుమార్





ఆచార్యులు గారి నేతృత్వంలో రాజశేఖర్ చారి మరియు వారి బృందం యజ్ఞ కార్యక్రమాలను పూర్తి చేసి నేడు ప్రతిష్టను పూర్తి చేసినారు, గ్రామస్తులు పూజా కార్యక్రమంలో పాల్గొని నవధాన్యాలు కొబ్బరికాయలతో అమ్మవారిని దర్శించుకున్నారు, అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని, స్థానిక సర్పంచ్ ఎరగాని రాధా నాగరాజులతో కలిసి రాష్ట్ర ఐఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి ఎరగాని నాగన్న గౌడ్ లు ప్రారంభించినారు, కార్యక్రమంలో కారింగుల సముద్ర, మాజీ సర్పంచ్ షేక్ సలీమా, మాజీ దేవాలయ చైర్మన్ఎరగాని గురవయ్య, షేక్ అలీ, బత్తిని వెంకన్న,మండ ఉపేందర్, ఎరగని మట్టపల్లి, ఎరగని గురవయ్య,ఉపేందర్, బెల్లంకొండ మట్టపల్లి, శేఖర్, సోమ గాని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు,

# టీవీ9 రిపోర్టర్ అనిల్ రెడ్డి సతీమణి సరళ గారికి శ్రద్ధాంజలి ఘటించినఎమ్మెల్యే





**డా,, తెల్లం వెంకట్రావు.**

త్రినెట్ న్యూస్ ఆగస్ట్ 28 :
టీవీ9 రిపోర్టర్ సీనియర్ జర్నలిస్ట్ అనిల్ రెడ్డి సతీమణి శ్రీమతి సరళ ఆకస్మికంగా మృతి చెందడం పట్ల భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు సంతాపం వ్యక్తం చేశారు. వారి ఇంటి వద్దకు వెళ్లి పార్థివ దేహానికి పూలమాల సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి రిపోర్టర్ అనిల్ రెడ్డికి ధైర్యం చెప్పి సానుభూతి వ్యక్తం చేశారు. శ్రీమతి సర ళకు ఆత్మ శాంతి కలిగించాలని భగవంతుని ప్రార్థించారు.
ఈ కార్యక్రమంలో భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ, వార్డు మెంబర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా విహెచ్‌పీఎస్ ఆవిర్భావ వేడుకలు

త్రినెట్ న్యూస్ ఆగస్ట్ 28 :
మల్కాజిగిరి వికలాంగులకు ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ఇన్‌చార్జ్ తిప్పారపు లక్ష్మణ్ మాదిగ డిమాండ్ చేశారు.
వికలాంగుల హక్కుల పోరాట సమితి (విహెచ్‌పీఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మల్కాజిగిరి చౌరస్తాలో విహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు వినయ్ మాదిగ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, ఎం.జె.ఎఫ్ రాష్ట్ర నాయకులు మనోహర్ జెండాను ఆవిష్కరించారు.





ఈ సందర్భంగా తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, వినయ్ మాదిగ మాట్లాడుతూ.. వికలాంగుల హక్కుల కోసం మందకృష్ణ మాదిగ 19 ఏళ్ల క్రితం వికలాంగుల హక్కుల పోరాట సమితి ఉద్యమాన్ని నిర్మించారని తెలిపారు. ఆ ఉద్యమం ద్వారా వికలాంగులకు అనేక హక్కులు, ప్రయోజనాలు సాధించామని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వికలాంగుల పెన్షన్‌ను పెంచి అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చట్టసభలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పిస్తున్న విధంగానే వికలాంగులకు కూడా వారి జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. వికలాంగులకు దక్కాల్సిన హక్కులు, వాటా సాధించే వరకు భవిష్యత్తులోనూ ఉద్యమాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో లక్ష్మణ్ కుమార్, బి. రజిత, ఎం. వెంకటేష్, బి. నరసింహ, ఈశ్వరయ్య, అజీరా బేగం, సూరజ్, ప్రకాష్, ఎస్. కీర్తి తదితరులు పాల్గొన్నారు.

# రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపిన గోపాల్‌పూర్ హైస్కూల్ 1987--88 బ్యాచ్ పూర్వ విద్యార్థులు



త్రినెట్ న్యూస్ ఆగస్ట్ 28 :
హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని గోపాల్‌పూర్ హైస్కూల్‌లో 1987--88 విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ చదివిన పూర్వ విద్యార్థులు రాఖీ పౌర్ణమి సందర్భంగా తమ తోటి సోదరీమణులు, సోదరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.రాఖీ పండుగ అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలు, ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఈ పర్వదినం ప్రతి కుటుంబంలో ఆనందం, శాంతి, ఐక్యత, సుఖసంతోషాలను నింపాలని ఆకాంక్షించారు.తమతో కలిసి చదువుకున్న క్లాస్‌మేట్స్ ప్రస్తుతం ఎక్కడ ఉన్నప్పటికీ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు.పాఠశాల రోజుల్లో కలిసి గడిపిన మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ, ఎన్నో సంవత్సరాలు గడిచినా తమ మధ్య ఉన్న ఆత్మీయ అనుబంధం చిరస్థాయిగా కొనసాగాలని ఆకాంక్షించారు. తమ బ్యాచ్‌కు చెందిన ప్రతి ఒక్కరి కుటుంబంలో సంతోషం, శాంతి, ఐక్యత వెల్లివిరియాలని కోరుతూ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.

# గౌరవ రాష్ట్ర మంత్రివర్యులు శ్రీ ఉత్తంకుమార్ రెడ్డి గారి సహకారంతో హుజూర్నగర్ పట్టణాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయిస్తాము??





మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ తో కలిసి 5వ వార్డులో సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన రాష్ట్ర ఐఎన్టీయూసీ ప్రధాన, కార్యదర్శి ఎరగాని నాగన్న గౌడ్ జనసముద్రం న్యూస్ ఆగస్టు 29 సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ నియోజకవర్గం రిపోర్టర్ అలవాల రవి హుజూర్నగర్ పట్టణశీ లోని ఐదో వార్డులో ఇటీవల రాష్ట్ర ఇరిగేషన్ మరియు సివిల్ సప్లై శాఖ మాత్యులు శ్రీ ఉత్తంకుమార్ రెడ్డి గారు మంజూరు చేసిన ఐదు లక్షల సిసి రోడ్డు పనులను నేడు ప్రారంభించినారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హుజూర్నగర్ నియోజకవర్గం రాష్ట్రంలోనే అభివృద్ధి పథంలో ముందుండే నియోజకవర్గంగా అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి బాటలు వేసిన ఉత్తంకుమార్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలిపారు, కార్యక్రమంలో కౌన్సిలర్ ఎరగాని సుష్మా మురళి, ఫ్లోర్ లీడరు కోతి సంపత్ రెడ్డి, కౌన్సిలర్లు కోడి మల్లయ్య, చెన్నగాని సైదులు, పు లిచింతల వెంకటరెడ్డి, నాగరాజు, శీలం శ్రీనివాస్, నాయకులు చిట్యాల అమర్నాథరెడ్డి, పాస్టర్ డేవిడ్ రాజు, చింతకాయల రాము,బెల్లంకొండ గురవయ్య, మద్దం నాగేందర్, శీలం సహదేవ, నవీన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు,

ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
శనివారం ఆగస్ట్ 29, 2026
www.trinetnews.com

# ప్రభుత్వ విద్యాసంస్థలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి,

**●మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య,**





**ట్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 28 :**
ప్రభుత్వ విద్యాసంస్థలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తూ, వారి అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. శుక్రవారం జిల్లాలోని కాసిపేట మండలంలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరిశీలించారు. మల్కేపల్లి ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి తరగతి గదులు, వంటశాల, విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను పరిశీలించి బోధన, తరగతుల నిర్వహణ, వసతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల అభ్యసన స్థాయికి అనుగుణంగా బోధన అందించాలని, వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండలంలోని సోనాపూర్ గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ విచారణలను పరిశీలించి ప్రక్రియకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిబంధనల ప్రకారం పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని అధికారులకు సూచించారు. అనంతరం గ్రామంలో బెల్లంపల్లి ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ ఆధ్వర్యంలో, నాబార్డ్, సెంటర్ ఫర్ సస్టైనబుల్ అగ్రికల్చర్ సహకారంతో నిర్వహిస్తున్న పోషకాహార లోపాన్ని ఎదుర్కోవడం, అగ్రో ఫారెస్ట్రీ ప్రాజెక్టులో భాగంగా కోలాం గిరిజన కుటుంబాలకు మామిడి, ఉసిరి, పనస, జామ, బొప్పాయి తదితర పండ్ల మొక్కలను ఉచితంగా అందజేశారు. ప్రతి కుటుంబం మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, మొక్కలను పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు కుటుంబాలకు పౌష్టికాహారం, భవిష్యత్తులో అదనపు ఆదాయం లభించే అవకాశం ఉంటుందని తెలిపారు. గ్రామస్థులతో మాట్లాడి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై సమీక్షించి పనులు వేగవంతం చేయాలని, గిరిజన ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పనకు అధికారులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి అనిత, తహసీల్దార్ సునీల్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ సింగ్, మండల పంచాయతీ అధికారి సఫ్దర్ అలీ, మండల విద్యాధికారి, ఎఫ్‌పిసి ఛైర్మన్ ఎంబడి కిషన్, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్, సర్పంచ్‌లు, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా 40వ నూలు పూర్ణిమ గాయత్రీ యజ్ఞోపవీత ధారణ





**ట్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 28 :**
ఆమనగల్ పట్టణ కేంద్రంలోని భక్త మార్కండేయ దేవస్థానంలో శుక్రవారం 40వ నూలు పూర్ణిమ గాయత్రీ యజ్ఞోపవీత ధారణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ భక్త మార్కండేయ దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి గాయత్రీ యజ్ఞోపవీత ధారణ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాల్లో 500కు పైగా మార్కులు సాధించిన పద్మశాలి విద్యార్థులను ఘనంగా సన్మానించారు. విద్యార్థులను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించి అభినందనలు తెలిపారు.
ఈ సందర్భంగా ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్ గాయత్రీ యజ్ఞోపవీత ధారణ కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్‌ను ఘనంగా సన్మానించారు.
కార్యక్రమంలో గాజుల సత్యరాములు,అవ్వారి శివలింగం, అప్పం శ్రీను, ఎంగలి రఘు,దోర్నాల ఈశ్వరయ్య, చిలువేరు వాసు, తిరుపతయ్య, యాదగిరి, శ్రీను, రవీందర్, శ్రీధర్, మహేష్, దినేష్, రవి, నరేష్, యాదగిరి, పెద్దయ్య, శివలింగం తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు నిరంతరాయంగా త్రాగునీటిని అందించాలి

**●మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,**

**ట్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 28 :**
ప్రజలకు త్రాగునీటి ఇబ్బంది లేకుండా నిరంతరాయంగా సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని చెన్నూర్ పట్టణంలో అమృత్ 2.0 పథకం క్రింద కొనసాగుతున్న నీటి ట్యాంక్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ ప్రజలకు ప్రతినిత్యం నిరంతరాయంగా త్రాగునీటిని అందించేందుకు చేపట్టిన అమృత్ 2.0 పథకంలో నీటి ట్యాంక్ నిర్మాణం, పైప్ లైన్ల పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి ప్రహరీ గోడ, ఆసుపత్రిలోని పనులను పరిశీలించి వేగవంతం చేయాలని తెలిపారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న అదనపు గదుల పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. తరగతి గదులు, వంటశాలను పరిశీలించి వంట సిబ్బంది ఆహారం తయారీ సమయంలో శుభ్రత నిబంధనలు పాటించాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఎలాంటి సమాచారం లేకుండా విధులకు గైర్హాజరైన ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తహసిల్దార్ మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ లతో కలిసి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ, రీ సర్వే నిర్వహణ తీరును పరిశీలించారు. ఎస్ ఐ ఆర్ నోటీసుల జారీ ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించాలని, బూత్ స్థాయి అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహించేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. భూముల రీ సర్వే లో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ, అటవీ భూములు, గ్రామాల హద్దుల నిర్ధారణ సమర్ధవంతంగా చేపట్టాలని, రెవెన్యూ రికార్డులను సక్రమంగా సిద్ధం చేసి అవసరమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని తెలిపారు. భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ వేగవంతం చేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు.
అనంతరం కోటపల్లి మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తహసిల్దార్ రాఘవేంద్ర, మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగేశ్వర్ రెడ్డి లతో కలిసి ఎస్ ఐ ఆర్, భూముల రీ సర్వే ప్రక్రియ నిర్వహణపై సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో నోటీసుల జారీ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని, భూముల రీ సర్వే నిర్వహణలో అధికారులు నిబంధనలకు లోబడి విధులు నిర్వహించాలని, సర్వే ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని తెలిపారు.
ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల భద్రతకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి





**●ప్రైవేట్ పాఠశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకుల భారీ ర్యాలీ**
**●తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేసిన అధ్యాపకులు**

**ట్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 28 :**
పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ మాచర్ల పట్టణంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది బుధవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. రింగ్‌రోడ్డు లోని సెయింట్ జేవియర్ స్కూల్ నుంచి ప్రారంభమైన ర్యాలీలో పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఇటీవల నల్గొండ జిల్లా మల్లేపల్లిలో ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్య, విశాఖపట్నంలో ఎల్‌కేజీ విద్యార్థి మృతి ఘటనలు పాఠశాలల భద్రతపై ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. ఉపాధ్యాయుల భద్రతకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం మాచర్ల తహసీల్దార్ బందెల కిరణ్‌కుమార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు విలువలు, క్రమశిక్షణ అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులకు సురక్షిత వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఎంఈఓ కోటేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రవర్తనలో మార్పులను గుర్తించి సమస్యలను ప్రారంభ దశలోనే పరిష్కరించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శేషిరెడ్డి మాట్లాడుతూ.. పాఠశాల బస్సుల ఫిట్‌నెస్, డ్రైవర్ల అర్హత, భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రైవేట్ పాఠశాలల అధ్యక్షుడు కె.వి. రమణ తోపాటు పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల భద్రతకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ప్రవర్తనపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల ప్రిన్సిపాల్స్ డి.శ్రీనివాస్, రామకృష్ణ శాస్త్రి, హనుమంతరావు, హరిణి, వెంకటరెడ్డి, దరియా హుస్సేన్, సిస్టర్ సుజాత, క్రాంతి కుమార్, జానీ, రాజు, హారిక తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాఖీ పూర్ణిమ వేడుకలు

**●అన్నలకు రాఖీ కట్టేందుకు వెళ్లిన చెల్లెళ్లు**
**●సామూహిక యజ్ఞోపవీత ధారణలు**



**ట్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 28 :**
రాఖీ పౌర్ణమి వేడుకలు శుక్రవారం ఘనంగాను జరిగాయి. శ్రవణ మాసంలో ముఖ్యమైన పండుగలలో ఒకటిగా ప్రసిద్ధి పొందిన శ్రావణ పౌర్ణమి జంధ్యాల పౌర్ణమి గా పిలువబడే ఈ రోజున పట్టణాల్లోనూ, పల్లెల్లోనూ పండుగ వాతావరణం కనిపించింది. తమ అన్నదమ్ములకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపేందుకు సోదరీమణులు ఉదయాన్నే బయలుదేరి వెళ్లారు. ద్విచక్రవాహనంపై కొందరు అలాగే కార్లలో మరికొందరు, బస్సులు ఇతరత్రా రవాణా సదుపాయాలతో ఉదయాన్నే సోదరీమణులు తమ అన్న తమ్ముళ్లు ఉండే ప్రాంతాలకు బయలుదేరి సాయంత్రం కల్లా తిరుగు ముఖం పట్టారు. ప్రేమతో రాఖీ కట్టి ఆనందాన్ని ఆప్యాయతను పంచి శుభాకాంక్షలు అందజేశారు. సోదర సోదరీమణులకు ప్రేమానురాగాలకు ఆప్యాయతలకు గుర్తుగా నిలిచే ఈ పండుగ రోజున రాఖీలు కట్టడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. రాఖీ పర్వదినాన్ని పరుచుకొని రాఖీలు కట్టేందుకు వెళుతున్న వారితో రహదారులు కిక్కిరిసిపోయాయి. అలాగే శ్రావణ పౌర్ణమి రోజునే జంధ్యాల పౌర్ణమి వేడుకలను జరుపుకోవడం సంప్రదాయంగా వస్తున్న పరంపరలో భాగంగా పలువురు యజ్ఞాపవీత ధారణ కార్యక్రమాల్ని నిర్వహించుకున్నారు. బ్రాహ్మణులు, వైష్ణవులు పద్మశాలీలు, విశ్వబ్రాహ్మణులు తదితర వర్గాలకు చెందిన పలువురు తమ సంప్రదాయాన్ని సారంగా వస్తున్న యజ్ఞోపవీత ధారణ కార్యక్రమాల్ని సంప్రదాయబద్ధంగా ఆలయాల్లో సామూహికంగా చేపట్టారు. అలాగే ఈ సంవత్సరం ఉపనయనము చేసుకున్న బ్రాహ్మణ వటవులకు ఉపాకర్మ కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే శ్రావణమాసంలో పౌర్ణమితో కూడిన శుక్రవారం కావడం మూలంగా పలువురు ముత్తయిదువలు వరలక్ష్మీ వ్రతాన్ని సహితం నోము కన్నారు.మొత్తం మీద శ్రావణ పౌర్ణమి పండుగ వేడుకలతో ఆధ్యాత్మిక తో పాటు పండుగ వాతావరణం నిండుగా కనిపించింది.

# శ్రావణ మాసం రాఖీ పౌర్ణిమ లిసందర్భంగా ప్రత్యేక కుంకుమ పూజలు. తులసి దళాభిషేకం అమ్మ వారికి పూల అలంకరణలిఅమ్మ వారి నిజరూప దర్శనంలిఅమ్మ వారికి ముడుపు సమర్పణ





**ట్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 28 :**
శ్రీ సూర్య ధన్వంతరి ధనలక్ష్మి సహిత దేవాలయంలో, చింత కుంట చెరువు దగ్గర, జగిత్యాల కుంకుమ పూజలు తులసి దళా భిషేకం అమ్మ వారి నిజ రూప దర్శనం పూల అలంకరణ.
జగిత్యాల పట్టణ చింతకుంట లోని శ్రీ సూర్య ధన్వంతరి ధనలక్ష్మి సహిత దేవాలయం లో శ్రీ ధనలక్ష్మి సేవా సమితి అధ్వర్యంలో శ్రావణ మాసం రాఖీ పౌర్ణమి లిశుక్రవారం పౌర్ణమి పర్వదినం పురస్కరించుకొని, మాతలు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన, తులసి దళాభి షేకం లలితా సహస్ర నామాల స్థోత్ర పారాయణం చేసారు. పారాయణం అనంతరం మాతలు అమ్మ వారికి ఒడి బియ్యం సమర్పించారు. శ్రావణ మాసం సందర్భం గా .కుంకుమ పూజ అనంతరం లక్కీ డిప్ ద్వార ముగ్గురిని ఎంపిక చేసి వారికి బహుమతులు యివ్వడం జరిగినది. అలాగే అమ్మ వారి శేష వస్త్రం మరియు అమ్మ వారి ప్రసాదం తాంబూలం ఆలయ పూజారి ఆశీర్వచనములతో బహుకరించడం జరిగినది.
తదనంతరం లిఅమ్మ వారికి ముడుపులు కట్టారు
ఈ కార్యక్రమము నందు దేవాలయ ట్రస్ట్ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ వడ్లగట్ట రాజన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ వొడ్నాల శ్రీనివాస్, సహాయ కార్యదర్శి భారతాల సాగర్- గీత, మహిళా సభ్యులు వొడ్నాల లత, వడ్లగట్ట స్వాతి, కావ్య శ్రీ, ప్రియాంక, సుశీల, గంగమ్మ, జమున, శోభ,
అర్చకులు శ్రీహరి
తదితరులు పాల్గొన్నారు.

# హాస్టల్ భవనాలను తమకు అప్పజెప్పాలంటూ పాలిటెక్నిక్ విద్యార్థుల ధర్నా

**●తుమ్మల లవకుమార్ AISP రాష్ట్ర అధ్యక్షులు**




**ట్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 28 :**
రాయచోటిలో జిల్లా పోలీసు కార్యాలయానికి తాత్కాలికంగా స్వాధీనం చేసుకున్న తమ హాస్టల్ భవనాలను తిరిగి తమకు అప్పగించాలని రాయచోటి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు కళాశాల గేటు వద్ద శుక్రవారం ధర్నా చేశారు. అఖిలభారత స్టూడెంట్స్ పవర్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల లవకుమార్ ఆధ్వర్యంలో సుమారు 150 మంది పాలిటెక్నిక్ విద్యార్థులు శుక్రవారం ఉదయం తరగతులు బహిష్కరించి కళాశాల గేటు వద్ద ప్లకార్డ్స్ ధరించి తమ హాస్టల్ చెప్పాలని నినాదాలు చేసి ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా లవ కుమార్ మాట్లాడుతూ 2022 లో అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటిని ప్రకటించిన సందర్భంలో ఎస్పీ కార్యాలయం కోసం పాలిటెక్నిక్ విద్యార్థుల హాస్టల్ భవనాలను తాత్కాలికంగా ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నదని అన్నారు. జిల్లా కేంద్రంలో రాయచోటి నుండి మదనపల్లి తరలిన తర్వాత ఎస్పీ ఆఫీసు జిల్లా కార్యాలయం అన్నీ కూడా మదనపల్లెకు తరలిపోయాయని ఇప్పుడైనా తమ హాస్టల్ భవనాలు తమకు అప్పజెప్పాలని విద్యార్థుల నినాదాలు చేశారు.రాయచోటి పట్టణం నందు గల పాలిటెక్నిక్ కళాశాలలో ప్రస్తుతం 250 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని వారికి హాస్టల్ వసతి లేదని విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఆ కళాశాల హాస్టల్ భవనాలను హాస్టల్ భవనం నిర్మించిన తర్వాత పాలిటెక్నిక్ విద్యార్థులు వివిధ జిల్లాల నుండి వందలాదిమంది విద్యార్థులు ఆ కళాశాలలో చదువుకుంటూ వసతిగృహంలో ఉండేవారని భోజనం మరియు ఇతర మౌలిక సౌకర్యాలు ఆ విద్యార్థులకు ఉండేవని అన్నారు.
అయితే హాస్టల్ భవనమును ఎస్పీ గారి కార్యాలయానికి ఇచ్చిన తర్వాత కళాశాల విద్యార్థులు పట్టణంలో ఉన్నటువంటి బిసి ఎస్సి హాస్టల్స్ లో ఉంటూ 6 కిలోమీటర్ల మేర బస్సులలో ఆటోలలో ప్రయాణం చేసి ఉదయం టిఫిన్ చేసి మధ్యాహ్నం తిరిగి హాస్టల్ కు వెళ్లి తిని రావడానికి వీలు లేక ఉదయం చేసిన భోజనాన్నే తీసుకొని వచ్చి మధ్యాహ్నం తిని తిరిగి మళ్ళీ హాస్టల్స్ కి వెళ్లే పరిస్థితి వారికి నెలకొని ఉందని వారు మండిపడ్డారు.అంతేకాకుండా ప్రభుత్వ హాస్టల్స్ లో సీట్లు దొరకక ప్రైవేట్ హాస్టల్స్ లో నాలుగు వేల నుండి 5వేల రూపాయల వరకు డబ్బులు కట్టి వారు ఉండాల్సినటువంటి పరిస్థితి నెలకొని ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.
ఎస్పీ కార్యాలయ నిర్వహణకు తాత్కాలికంగా ఇచ్చినటువంటి పాలిటెక్నికల్ కళాశాల విద్యార్థుల వసతృహ భవనమును తిరిగి ఆ కళాశాల విద్యార్థులకు అప్పజెప్పాలని తద్వారానే వివిధ జిల్లాల నుండి వచ్చి ఇక్కడ విద్యను అభ్యసించే పేద ,మధ్యతరగతి విద్యార్థులకు బంగారు భవిష్యత్తును అందించిన వారు అవుతారని లేనిపక్షంలో విద్యార్థులకు అప్పజెప్పేవరకు అఖిల భారత విద్యార్థి పవర్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని రాష్ట్ర అధ్యక్షులు లవకుమార్ హెచ్చరించారు ఈ కార్యక్రమంలో 150 మంది పాలిటెక్నిక్ విద్యార్థులు మరియు ఏఐఎస్ పి జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే జూలకంటి కి రాఖీ కట్టిన శాంతి

**ట్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 28 :**
రాఖీ పార్ణమి సందర్భంగా మాచర్ల పట్టణ టీడీపీ మహిళా నాయకురాలు మాదినేటి శాంతి మాచర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చేతికి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు.



# ఎమ్మార్పీఎస్ నూతన అధ్యక్షునిగా యనమల గంగలప్ప ఎన్నిక





**త్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 28 :**
మండల కేంద్రంలోని ఆర్ డి టి భవనం ఆవరణంలో ని ఆగస్టు 28వ తేదీ ఉదయము ఎనిమిది గంటలకు శ్రీ సత్య సాయి జిల్లా ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్చార్జి వైకాయిట్ బెనర్జీ మాదిగ శ్రీ సత్యసాయి జిల్లా పలక ఆంజనేయులు ఆధ్వర్యంలో
ఆమడగూరు మండల మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మండల అధ్యక్షులుగా యనమల గంగులప్ప
ఉపాధ్యక్షులు సప్పిడి పెద్ద నరసింహులు మండల కమిటీ 15 మంది సభ్యులు మండలంలోని 22 గ్రామాల మాదిగ పల్లెలు గ్రామ కమిటీలు సభ్యులు అందరి తీర్మానాలతో
ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది
ఈ సందర్భంగా
సత్యసాయి జిల్లా ఇన్‌చార్జ్ బెనర్జీ శ్రీ సత్య సాయి జిల్లా ఈ సందర్భంగా హాజరైన అందరితో మాట్లాడుతూ
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలు కొనసాగించాలి
అంటరానితనం వివక్షత రూపురేఖలు మార్చాలి దళితుల వాడల్లో సమ్మక్క సమావేశాల నిర్వహించాలి మాదిగ పల్లెల గ్రామాలలో క్షేత్రస్థాయిలో సంవత్సరమాయేలు నిర్వహించి చైతన్యము తేవాల
మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ నాయకులు మాన్యశ్రీ పద్మశ్రీ అవార్డు గ్రహీత
మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు
ఎం ఆర్ పి ఎస్ ఎం ఎస్ పి అనుబంధ సంఘాలు నూతన కమిటీ ఏర్పాటు చేయాలని
పలు సూచనలు సలహాలు తెలియజేశారు
ఆమడగూరు మండలఎమ్మార్పీఎస్ కమిటీ యధావిధిగా కొనసాగిస్తూ
ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు
ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జ్ జ్ బెనర్జీ పలక ఆంజనేయులు
హాజరైన మండలంలోని 22 గ్రామా కమిటీలు సభ్యులు అందరి ఆమోదం ప్రకారము ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఏర్పాటు చేశాము
అమడగూరు మండలంలోని 22 గ్రామాల కమిటీలు చిన్నగానపల్లి
దూదరగుట్టపల్లి పూలికుంటపల్లి
జెకెపల్లి మహమ్మదాబాద్ ఐదు గ్రామాలలో నూతన ఎమ్మార్పీసీ దిమ్మెలు ఏర్పాటు చేశారు
17 గ్రామాలలో నూతన జన్మలు ఏర్పాటు చేయాలి తెలిపారు సెప్టెంబరు 9వ తేదీ జాతీయ నాయకులు సమీక్ష సమావేశాలు నిర్వహిస్తారు మందాకృష్ణ ఆదేశాల మేరకు ఈ సమావేశానికి మండలం నుండి అందరూ హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారుఅనంతరం
శ్రీ సత్య సాయి జిల్లా పెనుగొండ
మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ఆవరణంలోని
వికలాంగుల ఆవిర్భావ దినోత్సవం పురవీధుల గుండా ర్యాలీ ఘనంగా నిర్వహించారు
మానవహారం ఏర్పాటు చేశారు
చిలకలూరిపేట దళితులు యాక్సిడెంట్ జరిగింది
ఐదు నిమిషాలు మౌనం పాటించారు
శ్రీ సత్యసాయి జిల్లా: సెప్టెంబర్ 9న వరంగల్‌లో నిర్వహించనున్న ఎమ్మార్పీస్ ఎం ఎస్ పి నూతన కమిటీల జాతీయ సదస్సును విజయవంతం చేయాలని శ్రీ సత్యసాయి జిల్లా ఇన్‌చార్జ్ బెనర్జీ పిలుపునిచ్చారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎమ్మార్పీస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ సదస్సుకు శ్రీ సత్య సాయి జిల్లాలో అన్ని నియోజకవర్గం నుంచి మండలాల మరియు వివిధ గ్రామాల నుంచి నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.
28 న వికలాంగుల దినోత్సవం సందర్భంగా పెనుగొండ పట్టణంలో జరిగినవికలాంగుల ర్యాలీ లో నుంచి మన వికాంగుల సోదరులను అధిక సంఖ్యలో తరలించి ర్యాలీ ని విజయవంతం చేశారుకావున శ్రీ సత్యసాయి జిల్లా నుంచి ఎమ్మార్పీఎస్ మరియు ఎం ఎస్ పినాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారుసెప్టెంబర్ 9న వరంగల్‌లో జరిగే జాతీయ సదస్సును జయప్ర

# ఘనంగా ప్రారంభమైన సాయి శ్వాస స్పెషాలిటీ హాస్పిటల్.




**త్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 28 :**
నెల్లూరు నగరంలోని విజయ మహల్ గేట్, ఆత్మకూర్ బస్టాండ్ సమీపంలో సాయి శ్వాస స్పెషాలిటీ హాస్పిటల్ ఘనంగా ప్రారంభమైంది. ఈ హాస్పిటల్ ప్రారంభానికి ముఖ్యఅతిథిగా రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి హాజరయ్యారు. ఈ హాస్పటల్ ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటుందని తెలియజేశారు.ఈ సందర్భంగా హాస్పటల్ యాజమాన్యం డాక్టర్ సునీల్ మాట్లాడుతూ రోగనిరోధక వ్యవస్థ హానిచేయని దానికి ప్రతిస్పందించినప్పుడు, అలెర్జీ ప్రతిచర్య కలగడాన్ని చర్మ అలెర్జీ అంటారు. పుప్పొడి, మొక్కలు, ఆహారం, కొన్ని మందులు మొదలైన వివిధ అలెర్జీ కారకాలు అలెర్జీలకు కారణం కావచ్చు. దురద, గడ్డలు, ఎరుపుదనం, ఇతర చర్మ సమస్యలు సాధారణంగా కనిపిస్తాయి. కొన్నిసార్లు, వాటి కారణాన్ని సులభంగా గుర్తించడం సాధ్యం కాకపోవచ్చు. కొన్నిసార్లు, ఇది ఆటలమ్మ లేదా తట్టు వంటి వైద్యపరమైన పరిస్థితుల వల్ల కూడా కావచ్చు . అలెర్జీ నిపుణుడు అలెర్జీకి కారణాన్ని నిర్ధారించగలడు. అలెర్జీలకు చికిత్స చేయడానికి అనేక నివారణ పద్ధతులు, చికిత్సా ఎంపికలు అందుబాటులో ఉన్నాయి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ యాజ

# భక్తి భావానికి ప్రతీకగా శివాలయం.

**●భూమిపూజ చేసిన మంత్రి మండిపల్లి**





**త్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 28 :**
రామాపురం మండలం మన్నేరువాండ్లపల్లెలో రూ.20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న లిశివాలయానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి లి భూమిపూజ నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామ ప్రజల చిరకాల ఆకాంక్షగా ఉన్న శివాలయం నిర్మాణం త్వరలో పూర్తై భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా నిలవాలని ఆకాంక్షించారు.ప్రజా సంక్షేమంతో పాటు ఆధ్యాత్మిక, సాంస్కృతిక విలువల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారులి. ఆలయ నిర్మాణానికి సహకరిస్తున్న గ్రామస్థులను అభినందించారు.ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, భక్తులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఫాతిమాపురంలో పుచ్చకాయల వినోద్ రెడ్డి మృతదేహానికి నివాళులు



**త్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 28 :**
చింతలపూడి నియోజకవర్గం, ఫాతిమాపురం అడ్డరోడ్డు: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు శ్రీ పుచ్చకాయల వినోద్ రెడ్డి మృతి పట్ల పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. పుచ్చకాయల ప్రదీప్ రెడ్డి మాజీ మార్కెట్ యాడ్ నెంబరు ఆయన తండ్రి మాజీ వైఎస్ఆర్సిపి టౌన్ ప్రెసిడెంట్ వినోద్ రెడ్డి శుక్రవారం ఫాతిమాపురం అడ్డరోడ్డులోని ఆయన స్వగృహానికి చేరుకున్న ఆంధ్రప్రదేశ్ శాసనమండలి చైర్మన్ శ్రీ కొయ్యే మోషేను రాజు, చింతలపూడి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ శ్రీ కంభం విజయ రాజు వినోద్ రెడ్డి పార్థివ దేహానికి నివాళులు అర్పించారు.
అనంతరం శోకసంతప్త కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ బొడ్డు వెంకటేశ్వరరావుతో పాటు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
ఏలూరు మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ బాబు, తెలుగుదేశం పార్టీకి చెందిన మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ముత్తా రెడ్డి చెన్నకేశవ రెడ్డి చిలుకూరు జానారెడ్డి చల్లా బత్తుల శీను తదితరులు కూడా హాజరై పుచ్చకాయల వినోద్ రెడ్డి పార్థివ దేహానికి నివాళులు అర్పించారు.

# రాఖీ బంధంతో మంత్రి మండిపల్లికి కి ఆత్మీయ స్వాగతం





**త్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 28 :**
అన్నమయ్య జిల్లా రామాపురం మండలం మన్నేరు వాండ్ల పల్లిలో రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కిలి రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి రమ్య రాయల్,మహిళలు ఆత్మీయంగా రాఖీలు కట్టి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి మాటాడుతు సోదరీమణుల ప్రేమాభిమానాలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, అన్నా-చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ బంధం ఎల్లప్పుడూ ప్రేమ, ఆప్యాయతలతో మరింత బలపడాలని ఆకాంక్షించారురాఖీ పౌర్ణమి వేడుకలు ప్రేమానురాగాలు, ఆత్మీయతల నడుమ ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మన్నేరు వాండ్లపల్లి అక్క చెల్లెమ్మలు పాల్గొన్నారు

# చిరంజీవి సొంత ఊరు మొగల్తూరులో ముఖ్యమంత్రి పర్యటన

**●సీఎం పర్యటనకు ఏర్పాట్లు ముమ్మరం**
**●హెలిప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలించిన సీఎంఓ అధికారుల బృందం**





**త్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 28 :**
ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సెప్టెంబర్ 1న మొగల్తూరులో పర్యటించనున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం ఏర్పాట్లను ముమ్మరం చేసింది. సీఎం పర్యటనలో భాగంగా నిర్వహించనున్న కార్యక్రమాలకు సంబంధించి అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. మొగల్తూరు కుక్కల వారి తోట హైవే రోడ్డు వద్ద సీఎం హెలికాప్టర్ దిగేందుకు ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ ప్రాంతాన్ని సీఎంఓ అధికారుల బృందం పరిశీలించింది. పరిశీలించిన అనంతరం సీఎంఓ అధికారులు అంగీకారం తెలపడంతో హెలిప్యాడ్ పనులు ప్రారంభించారు. పాతకాలవ హైవే వై జంక్షన్ వద్ద ప్రజావేదిక, పెన్షన్ పంపిణీ కార్యక్రమాలు జరిగే ప్రాంతాలను కూడా పరిశీలించి ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేసారు. సీఎం పర్యటన సందర్భంగా భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, ప్రజలకు ఇబ్బందులు లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు దృష్టి సారిస్తున్నారు. పర్యటన విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి సొంత ఊరు మొగల్తూరు లో సీఎం పర్యటన నేపథ్యంలో చిరంజీవి అభిమానులు సైతం పాల్గొనే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.

# లక్కిరెడ్డిపల్లి మండలంలో టీడీపీలోకి భారీగా చేరికలు

**●కాంట్రాక్టర్ హరినాథ రెడ్డి తో పాటు 100 కుటుంబాలు చేరిక**
**●కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి మండిపల్లి**





**త్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 28 :**
లక్కిరెడ్డిపల్లి మండలం దిన్నిపాడు గ్రామం పర్వతరెడ్డిగారిపల్లెలో వైఎస్సార్‌సీపీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి ప్రధాన అనుచరుడిగా ఉన్న ఎ 1కాంట్రాక్టర్ దిన్నిపాడు హరినాథ్ రెడ్డిలి వైఎస్సార్‌సీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు.
హరినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో 100 కుటుంబాలకు పైగా టీడీపీ కండువాలు కప్పుకునిలి తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారందరికీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి లి కండువాలు కప్పి సాదరంగా తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాయచోటి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీపై ప్రజల్లో రోజురోజుకూ విశ్వాసం పెరుగుతోందని, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో టీడీపీలో చేరుతున్నారని తెలిపారు.
హరినాథ్ రెడ్డి టీడీపీలో చేరడం, ఆయనతో పాటు 100 కుటుంబాలు పార్టీ బాట పట్టడం రాయచోటి నియోజకవర్గంలో టీడీపీకి పెరుగుతున్న ప్రజా మద్దతుకు నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు.తెలుగుదేశం పార్టీలో చేరిన ప్రతి ఒక్కరినీ సాదరంగా ఆహ్వానిస్తూ, వారికి పార్టీలో సముచిత గౌరవం కల్పిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. రాయచోటి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు మదన్మోహన్, మదన్ మోహన్ రెడ్డి, రమేష్ రెడ్డి, రామసుబ్బారెడ్డి, ఉమాపతి రెడ్డి తదితర టీడీపీ నాయకులతో పాటు మండల నాయకులు, గ్రామ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# యొనుముల కేశవరెడ్డి కి రాఖీ కట్టిన వేముల మంగమ్మ



**త్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 28 :**
రాఖీ పౌర్ణమి సందర్భంగా మాచర్ల టీడీపీ సీనియర్ నాయకులు యొనుముల కేశవరెడ్డి కి మాచర్ల పట్టణ టీడీపీ మహిళా నాయకురాలు వేముల మంగమ్మ రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు.

# వారతిప్పలో మట్టి తవ్వకాలపై మైనింగ్ అధికారుల తనిఖీలు



**త్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 28 :**
మొగల్తూరు మండలం వారతిప్ప గ్రామంలో అక్రమ మైనింగ్ దందా జరుగుతోందని ఇటీవల పల్లవసేన రాష్ట్ర అధ్యక్షుడు కొల్లాటి బాబురావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారులు, రెవెన్యూ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి ఎస్.పీ.కే. మల్లేశ్వరరావు, జి. వెంకటేశ్వరరావుతో పాటు రెవెన్యూ సిబ్బంది గ్రామంలో మట్టి తవ్వకాలు, మట్టి నిల్వలపై పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్.పీ.కే. మల్లేశ్వరరావు మాట్లాడుతూ మైనింగ్ నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు చేపట్టడం, అనుమతులు లేకుండా మట్టి నిల్వ చేయడం వంటివి చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీ సు కుం టా ము ని హెచ్చరించారు.
రెవెన్యూ భూముల్లో ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు లేదా మట్టి నిల్వలు చేపట్టినా, బాధ్యులపై పోలీసుల సహకారంతో కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తనిఖీల్లో వీఆర్వో సుజాతతో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
శనివారం ఆగస్ట్ 29, 2026
www.trinetnews.com

# ఎస్సీల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కే.ఎస్.జవహర్ కు డాక్టర్ కుక్కమూడి ప్రసాద్ విజ్ఞప్తి

**ట్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 28 :**
పల్నాడు జిల్లాలోని ఎస్సీల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని
పల్నాడు జిల్లా రివ్యూ మీటింగ్ కు ముఖ్యఅతిథిగా వచ్చిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్. జవహర్ కు పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ డాక్టర్ కుక్కమూడి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పల్నాడు జిల్లా నరసరావుపేట కలెక్టర్ కార్యాలయం లోని గుర్రం జాషువా మీటింగ్ హాల్ నందు జరిగిన రాష్ట్ర ఎస్సీ కమిషన్ పల్నాడు జిల్లా రివ్యూ మీటింగ్ నందు పల్నాడు జిల్లా డీవీఎంసీ సభ్యులతో కలిసి ఆయనకు పలు సమస్యలతో కూడినందుకు పత్రాన్ని అందజేశారు. ఆ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ.. పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ నూతన కమిటీ ఏర్పాటై 12 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు జిల్లా స్థాయి సమావేశాలు ఏర్పాటు చేయలేదని వెంటనే సంబంధిత ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసి జిల్లాస్థాయి ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు ఏర్పాటు చేయించాలా చూడాలని, దిష్టియ పున్నయ్య





కమిషన్ సిఫార్సులు అమలు జరిగేలా చూడాలని, ప్రతినెల చివరి రోజున ఎస్సీ, ఎస్టీ వాడల్లో పౌరుహక్కుల దినోత్సవం నిర్వహించి, భారత రాజ్యాంగం కల్పించిన పౌర హక్కుల పై చట్టాలపై అవగాహన కల్పించేలా చూడాలని, ఎస్సీలు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ పోరంబోకు, బంజర భూములకు డీకే పట్టాలు పంపిణీ చేసేలా చూడాలని, ఎస్సీ కాలనీలలోని ప్రజలకు మౌలిక వసతులను మంచినీటి సౌకర్యలను కల్పించాలని, ఎస్సీ, ఎస్టీ కేసులలోని బాధితులకు రావలసిన నష్టపరిహారాన్ని సకాలంలో అందేలా చూడాలని, ఎస్సీలపై జజరుగుతున్న దాడులను, వేధింపులను అరికట్టాలని , గ్రామాలలో వివక్షపు తావువు లేకుండా చట్టాలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయించాలని, అలాగే ముటుకూరు గ్రామపంచాయతీ సర్పంచ్ పదవిని జనాభా ప్రాతిపదికన ఈసారి జరగబోయే ఎన్నికలలో ఎస్సీ రిజర్వ్డ్ అయ్యేలా చూడాలని పలు సమస్యలను ఆయన చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన సమస్యలపై సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలియజేశారని ప్రసాద్ అన్నారు. అనంతరం డివిఎంసి సభ్యులంతా కలిసి బొకే అందజేసి, శాలువాలతో ఆయనను ఘనంగా సత్కరించారు.
ఈ కార్యక్రమంలో
డి వీఎంసీ సభ్యులు దేగల నాగేశ్వరరావు, చింతపల్లి లాజర్ బాబు, కోట నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ములకల్లంక - బొబ్బిలంక వారధిని పూర్తి చేయాలని ఎంపీకి వినతి

**ట్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 28 :**
ములకల్లంక – బొబ్బిలంక వారధి నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేసి తమ రవాణా కష్టాలను తీర్చాలని గ్రామస్తులు కోరారు. శుక్రవారం రాజమహేంద్రవరంలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు మరియు స్థానిక ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిని బీజేపీ నాయకులు ఏపీఆర్ చౌదరి, నీరుకొండ వీరన్నచౌదరి, మండల అధ్యక్షురాలు రాపాక వెంకటలక్ష్మితో కలసి ములకల్లంక గ్రామస్తులు కలిశారు. ఈ సందర్భంగా వంతెన పనులను త్వరగా పూర్తి చేయాలంటూ ఆమెకు వినతిపత్రం సమర్పించారు. వంతెన పనులు సగం లోనే నిలిచిపోవడంతో గోదావరి వరద



సమయంలో విద్యార్థులు, రైతులు, పాడిరైతులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పురందేశ్వరి సానుకూలంగా స్పందిస్తూ, వారధి పూర్తికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా ఎంపికైన పురందేశ్వరిని నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గూడపాటి జయరాం, పోలిన రామచంద్రం, వరప్రకాశ్, గోవిందరాజు, మాజీ సర్పంచ్ కంటిపూడి సత్యనారాయణ, పెండ్యాల సర్వారాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ద్వారకాతిరుమల సెక్టార్ సమావేశాన్ని సందర్శించిన ఆర్జేడీ సుజాత రాణి

**అంగన్‌వాడీ కేంద్రాలకు ఓవర్ హెడ్ ట్యాంకులు ఏర్పాటు చేయాలని సూచన**

జంగారెడ్డిగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ద్వారకాతిరుమల మండలం ద్వారకాతిరుమల సెక్టార్ సమావేశాన్ని ప్రాంతీయ సంయుక్త సంచాలకులు ఆర్జేడీ సుజాత రాణి శుక్రవారం సందర్శించారు.ఈ సందర్భంగా ఆమె అంగన్‌వాడీ కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు గ్రేడింగ్ ఇవ్వాలని, సాక్ష్యం అంగన్‌వాడీ కేంద్రాలకు ఓవర్ హెడ్ ట్యాంకులు ఏర్పాటు చేసేందుకు సంబంధిత పంచాయతీల స్పెషల్ ఆఫీసర్లతో



**ద్వారకాతిరుమల సెక్టార్ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జేడీ సుజాత రాణి**

మాట్లాడాలని సూపర్‌వైజర్, సీడీపీఓలకు సూచించారు.అనంతరం ఆర్ఎల్ఎం మెసేజ్‌లను తల్లుల గ్రూపులకు పంపించి తప్పనిసరిగా పిల్లలకు నేర్పించాలని, ఐవీఆర్ఎస్ కాల్స్ వచ్చినప్పుడు ప్రభుత్వం అందిస్తున్న ఐసీడీఎస్ సేవల గురించి తల్లులకు అవగాహన కల్పించాలని, నవ చేతన యాప్‌లో 0 నుండి 5 సంవత్సరాల పిల్లలందరినీ తల్లుల సమక్షంలో స్క్రీనింగ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ ఈ.తులసి, సీడీపీఓ పి.బ్యూలా తదితరులు పాల్గొన్నారు.

# కర్ణాటక మంత్రి నాగేంద్ర రెండోసారి రాజీనామా

బెంగళూరు: కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. వాల్మీకి కుంభకోణ ఆరోపణలపై ఆ పార్టీ నేత బి.నాగేంద్ర తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. గతంలోనూ ఇవే ఆరోపణలపై ఆయన పదవి నుంచి తప్పుకొన్నారు. డీకే శివకుమార్ సీఎంగా బాధ్యతల చేపట్టిన తర్వాత మంత్రివర్గంలో చేరిన నాగేంద్ర.. విపక్షాల అవినీతి ఆరోపణల వేళ మరోసారి మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. తన రాజీనామా నిర్ణయాన్ని ప్రకటిస్తూ మీడియా ముందు ఒకింత భావోద్వేగానికి గురయ్యారు.
ఇదీ నేపథ్యం: మహర్షి వాల్మీకి షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి కార్పొరేషన్‌లో అకౌంట్స్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన పి.చంద్రశేఖరన్ 2024 మే నెలలో ఆత్మహత్య చేసుకున్నారు. కార్పొరేషన్ నిధుల దుర్వినియోగం



జరిగిందని ఆరోపిస్తూ ఓ లేఖ రాశారు. కార్పొరేషన్ ఖాతా నుంచి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాకు రూ.89.63 కోట్లు, అక్కడి నుంచి మరికొన్ని ఖాతాలకు ఆ నిధులు బదిలీ అయినట్లు విచారణలో తేలింది. దీంతో అప్పట్లో రాజకీయంగా దుమారం రేగింది. ఈ వివాదం సమయంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న నాగేంద్ర 2024 జూన్‌లో పదవికి రాజీనామా చేశారు. అయితే, తనపై వచ్చిన ఆరోపణలన్నీ రాజకీయ ప్రేరేపితమైనవని నాగేంద్ర పేర్కొన్నారు. ఈ క్రమంలోనే సీఎంగా డీకే శివకుమార్ బాధ్యతలు చేపట్టాక రెండోసారి మంత్రివర్గంలో చేరారు. దీంతో ఆయన్ను తొలగించాలంటూ ప్రతిపక్షాలు మరోసారి రాజీనామా డిమాండ్‌ను తెరపైకి తీసుకొచ్చాయి. ఇటీవలి వర్షాకాల సమావేశాల సమయంలోనూ శాసనసభ లోపల, బయటా ఇదే అంశంపై భాజపా, జేడీఎస్ నిరసనలు తెలిపాయి. రాజకీయంగా ఒత్తిడి పెరగడంతో ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కలిసిన అనంతరం నాగేంద్ర తన రాజీనామా నిర్ణయాన్ని ప్రకటించారు.

## జగిలి రాయుడు ని పరామర్శించిన మండల అధ్యక్షుడు యనమల మదన్మోహన్




**ట్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 28 :**
లక్కిరెడ్డిపల్లి మండలం అనంతపురం గ్రామం ఈడిగ పల్లికి చెందిన టిడిపి కార్యకర్త జగిలి రాయుడు ప్రమాదవశాత్తు గాయపడి వైద్యం చేయించుకుని అనంతరం డాక్టర్ల సలహా మేరకు విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో వారి నివాసం వెళ్లి పరామర్శించి, ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు యనమల మదన్మోహన్
ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు మురికి నాటి వెంకటరమణ, చిట్లూరు చలపతి, రమణ టిడిపి గ్రామ నాయకులు, కార్యకర్తలు, తదితరులు, ఉన్నారు

# రైస్ మిల్లుల్లో విజిలెన్స్ తనిఖీలు.. రూ.కోట్ల విలువైన ధాన్యం మాయం

ముథోల్: బాసర జిల్లా భైంసా, ముథోల్ మండలాల్లో శుక్రవారం పలు రైస్ మిల్లుల్లో విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీంతో రూ.కోట్ల విలువైన ధాన్యానికి సంబంధించి అక్రమాలు వెలుగు చూశాయి. ముథోల్ మండలంలోని వర్తాల గ్రామంలోని నీలకంఠేశ్వర్ రైస్ మిల్లులో తనిఖీలు చేయగా.. 2022–23 సంవత్సరం రబీ కాలానికి సంబంధించి ప్రభుత్వం 4,224 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సీఎంఆర్ కోసం ఇవ్వగా, కేవలం 336 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే లెక్కతేలింది. మిగతా 3,888 మెట్రిక్ టన్నుల ధాన్యం మాయమైంది. లెక్కతేలని ధాన్యం విలువ సుమారు రూ.8.70 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు.
భైంసా మండలంలోని మాటేగా గ్రామంలో ఉన్న నీలకంఠ రైస్ మిల్లులో తనిఖీలు చేయగా అక్కడ 977 మెట్రిక్ టన్నుల ధాన్యం తేడా వచ్చింది. దీని విలువ సుమారు రూ.2.19 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. భైంసా మండలంలోని దేగామ గ్రామంలో ఉన్న ఆదిత్య



నారాయణ రైస్ మిల్‌కు పౌరసరఫరాల శాఖ 1,991 టన్నుల ధాన్యం ఇవ్వగా.. మిల్లులో ఒక్క బస్తా కూడా లేదు. మాయమైన ధాన్యం విలువ రూ.4.86 కోట్లు ఉంటుందని అధికారులు అంచనాకు వచ్చారు. ఈ విజిలెన్స్ దాడిలో కరీంనగర్ విజిలెన్స్ డీఎస్పీ సీతారెడ్డి, తహసీల్దార్ దినేష్ చంద్ర, సీఐలు అనిల్ కుమార్, ప్రశాంత్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## యెనుముల కేశవరెడ్డి కుమార్తె వివాహ కార్యక్రమం లో పాల్గొన్న మాచర్ల టీడీపీ మహిళా నాయకులు

**ట్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 28 :**
కడప లో జరిగిన మాచర్ల పట్టణ టీడీపీ సీనియర్ నాయకులు యెనుముల కేశవరెడ్డి కుమార్తె వివాహ కార్యక్రమంలో మాచర్ల పట్టణానికి చెందిన టీడీపీ మహిళా నాయకులు పచ్చిపాల అనురాధ మరియు పలువురు పాల్గొని, అక్షింతలు వేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు.



## రాష్ట్ర న్యాయశాఖ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఈ నెల 29న వింజమూరుకు రాక

**ట్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 28 :**
రాష్ట్ర న్యాయశాఖ, మైనారిటీ సంక్షేమ శాఖ, జిల్లా ఇంచార్జి మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ ఈ నెల 29వ తేదీన వింజమూరులో పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు.
ఆగస్టు 29వ తేదీ (శనివారం) ఉదయం 6.00 గంటలకు తాడేపల్లిలోని క్యాంపు నివాసం నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి, ఉదయం 10.00 గంటలకు వింజమూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు. అనంతరం వింజమూరు పరిధిలో స్థానిక ఎమ్మెల్యే ఏర్పాటు చేసిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు.
సాయంత్రం 4.00 గంటలకు వింజమూరు నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి, రాత్రి 8.30 గంటలకు నంద్యాలకు చేరుకుంటారని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## చిలకలూరిపేట లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం పై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన నవులూరి శివారెడ్డి

**ట్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 28 :**
విజయవాడ నుంచి బయలుదేరిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు చిలకలూరిపేట పట్టణంలోని అడ్డరోడ్డు వద్ద బర్త్ డే సెలబ్రేషన్స్ ముగించుకొని వస్తున్న ఆటోను అర్ధరాత్రి ఢీకొన్న ప్రమాదం లో ఐదుగురు మరణించగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘోర ప్రమాద ఘటనపై అమరావతి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాచర్ల, సత్తెనపల్లి అసెంబ్లీ స్థానాల ఎమ్మెల్యే అభ్యర్థి నవులూరి శివారెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇలాంటి ప్రమాదాలు తిరిగి జరగకుండా చూడాలని, అందుకు అవసరమైన చర్యలు వెంటనే తీసుకోవాలన్నారు. ప్రమాద స్పాట్ ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని శివారెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



నవులూరి శివారెడ్డి,
అమరావతి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు మాచర్ల, సత్తెనపల్లి అసెంబ్లీ స్థానాల ఎమ్మెల్యే అభ్యర్థి.

## కారంపూడి లో ఘనంగా జరిగిన ముదిరాజ్ ల బోనాల పండుగ

**ట్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 28 :**





ట్రాక్టర్ లో వినాయకుడిని కారంపూడి పుర వీధుల్లో ఊరేగించుకుంటూ , ఢీజే ఆర్కెస్ట్రా పాటలతో నృత్యాలు చేస్తూ వర్షాలు సమృద్ధిగా కురవాలని కారంపూడి పట్టణ టిడిపి మాజీ అధ్యక్షులు కటికల బాలకృష్ణ ఆధ్వర్యంలో ముదిరాజ్ లు శుక్రవారం బోనాల పండుగను కోలాహలంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని సందడి చేస్తూ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించటం జరిగింది.

## టెంప్‌సెన్స్ ఇన్‌స్ట్రుమెంట్స్ బంపర్ లిస్టింగ్..

# ఇన్వెస్టర్ల సొమ్ము డబుల్



**ఐపీఓలో రూ.300 ఇష్యూ ధర**
**ఎన్ఎస్ఈలో రూ.634తో లిస్టింగ్**
**ఏకంగా 111% ప్రీమియం**
**గరిష్ఠంగా రూ.634.85..**
**కనిష్ఠంగా రూ.582**
**ఐపీఓ ద్వారా రూ.650 కోట్లు సమీకరణ**
**ఇష్యూకు 184 రెట్ల సబ్‌స్క్రిప్షన్**
**థర్మల్ ఇంజినీరింగ్, స్పెషలైజ్డ్ కేబుళ్ల తయారీ**
**సమీకరించిన నిధులతో కంపెనీ విస్తరణ**

టెంప్‌సెన్స్ ఇన్‌స్ట్రుమెంట్స్ సంస్థ.. స్టాక్ మార్కెట్ లిస్టింగ్‌లో అదరగొట్టింది. శుక్రవారం ఈ కంపెనీ షేర్లు ఏకంగా 111 శాతం ప్రీమియంతో లిస్టయ్యాయి. అంటే ఐపీఓలో మదుపర్లు పెట్టిన సొమ్ముకు రెట్టింపు కంటే ఎక్కువ ప్రతిఫలం అందించింది. ఐపీఓ ఇష్యూ ధర రూ.300 కాగా.. ఎన్ఎస్ఈలో ఈ కంపెనీ షేర్లు రూ.634 వద్ద ట్రేడింగ్‌ను ఆరంభించాయి. ఆపై రూ.634.85 వద్ద గరిష్ఠాన్ని తాకిన షేరు విలువ.. తర్వాత 8 శాతం మేర పతనమై రూ.582 వద్ద కనిష్ఠాన్ని తాకింది. మొత్తం రూ.650 కోట్లు సమీకరించే లక్ష్యంతో ఈ నెల 20న ప్రారంభమైన ఈ పబ్లిక్ ఇష్యూ 24న ముగిసింది. ఐపీఓలో ధరల శ్రేణిని రూ.285-300గా నిర్ణయించింది. పబ్లిక్ ఇష్యూలో రూ.555 కోట్లు ఆఫర్ ఫర్ సేల్ ద్వారా, రూ.95 కోట్లు ఫ్రెష్ ఇష్యూ ద్వారా షేర్లను జారీ చేశారు. మొత్తం 184 రెట్ల సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం నుంచి గ్రే మార్కెట్ ప్రీమియంలో మంచి ధర పలుకుతూ వచ్చింది. ఒక్కో షేరుకు రూ.300 లాభాన్ని అంచనా వేశారు. అందుకు అనుగుణంగానే షేర్లు నేడు బంపర్ ఎంట్రీ ఇచ్చాయి. థర్మల్ ఇంజినీరింగ్ ఉత్పత్తులు, స్పెషలైజ్డ్ కేబుళ్లను తయారీ చేసే ఈ కంపెనీ.. ఐపీఓ ద్వారా సమీకరించిన నిధులను కంపెనీ విస్తరణకు వినియోగించనుంది.

# ఐపీఓలో రూ.300 ఇష్యూ ధర

## ఎన్ఎస్ఈలో రూ.634తో లిస్టింగ్



**ఏకంగా 111% ప్రీమియం**
**గరిష్ఠంగా రూ.634.85..**
**కనిష్ఠంగా రూ.582**
**ఐపీఓ ద్వారా రూ.650 కోట్లు సమీకరణ**

ఇష్యూకు 184 రెట్ల సబ్‌స్క్రిప్షన్ఓలా నుంచి కొత్త స్కూటర్.. సింగిల్ ఛార్జ్‌తో ప్రముఖ విద్యుత్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ (రాశ్రీఖ జుశ్రీవషితీఅఎ) దేశీయ విపణిలోకి కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్‌ను విడుదల చేసింది. మాస్ మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని ఎస్1జడ్ (రాశ్రీఖ ూ1) మోడల్‌ను లాంచ్ చేసింది. సొంతంగా అభివృద్ధి చేసిన భారత్ సెల్ ఎల్ఎఫ్‌పీ టెక్నాలజీని ఇందులో వినియోగించారు. దీన్ని ఓలా తన గిగా ఫ్యాక్టరీలో తయారు చేసింది. తక్కువ ధరలో, అధిక రేంజ్ స్కూటర్‌ను అందించేందుకు ఇది ఉపయోగపడుతుందని కంపెనీ ఓ ప్రకటనలో పేర్కొంది.

ఈ స్కూటర్ రెండు వేరియంట్లలో లభ్యమవుతుంది. 3.1ఎౌెస్త్ర, 5.1ఎౌెస్త్ర బ్యాటరీ ప్యాక్‌లతో లభిస్తుంది. చిన్న బ్యాటరీ వేరియంట్ ధర రూ.79,999 (ఎక్స్‌షోరూమ్)గా నిర్ణయించింది. ఇది సింగిల్ ఛార్జ్‌తో 179 కిలోమీటర్ల ఐడీసీ రేంజ్ ఇస్తుందని కంపెనీ పేర్కొంది. ఇక 5.1ఎౌెస్త్ర బ్యాటరీ వేరియంట్ రూ.99,999కి లభ్యమవుతుంది. ఇది ఒకసారి ఛార్జ్ చేస్తే 301 కిలోమీటర్లు ప్రయాణించొచ్చని కంపెనీ పేర్కొంది. మొత్తం నాలుగు రంగుల్లో లభిస్తుంది.

భారత్ సెల్ ఎల్ఎఫ్‌పీ టెక్నాలజీని ఇన్‌హౌస్‌లో అభివృద్ధి చేయడం ద్వారా బ్యాటరీ ఖర్చును గణనీయంగా తగ్గించగలిగామని ఓలా పేర్కొంది. అలాగని, ఇతర అంశాల్లో రాజీ పడకుండా తక్కువ ధరలో ఎస్1జడ్‌ను తీసుకొచ్చినట్లు తెలిపింది. 3.1ఎౌెస్త్ర బ్యాటరీ వేరియంట్ కలిగిన స్కూటర్లను ఈ ఏడాది డిసెంబర్ నుంచి, పెద్ద బ్యాటరీ కలిగిన స్కూటర్లను వచ్చే ఏడాది మార్చి నుంచి డెలివరీ చేస్తామని తెలిపింది. మూవ్ ఓఎస్ 5తో ఈ స్కూటర్ పనిచేస్తుంది. క్రూయిజ్ కంట్రోల్, రివర్స్ మోడ్, జీపీఎస్, ఓటీఏ ద్వారా సాఫ్ట్‌వేర్ అప్‌డేట్స్, జియో, ట్రైమ్, మోడ్ ఫెన్సింగ్ వంటి సదుపాయాలు ఇందులో ఉన్నట్లు ఓలా పేర్కొంది.
థర్మల్ ఇంజినీరింగ్, స్పెషలైజ్డ్ కేబుళ్ల తయారీ
సమీకరించిన నిధులతో కంపెనీ విస్తరణ



## రెండ్రోజుల నష్టాలకు బ్రేక్.. లాభాల్లో ముగిసిన సూచీలు

**సెన్సెక్స్ 330.92 పాయింట్లు లాభం**
**సెన్సెక్స్ 77,264.51 వద్ద ముగింపు**
**నిఫ్టీ 84.80 పాయింట్లు పెరిగింది**
**నిఫ్టీ 24,175.65 వద్ద స్థిరపడింది**
**ఐటీ, ఫార్మా, మెటల్ షేర్లలో కొనుగోళ్ల జోరు**
**వరుసగా రెండు రోజుల నష్టాలకు బ్రేక్**
**డాలర్‌తో రూపాయి విలువ రూ.95.39**
**బ్రెంట్ క్రూడ్ వి88.30, బంగారం వి4,603 వద్ద్ తీుఁఎఅస్త్ర**

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. అతర్జాతీయ మార్కెట్‌ల నుంచి సానుకూల సంకేతాలకు తోడు ఐటీ, ఫార్మా, మెటల్ స్టాక్స్ రాణించాయి. దీంతో సూచీల రెండ్రోజుల వరుస నష్టాలకు బ్రేక్‌పడింది. సెన్సెక్స్ 300 పాయింట్లకు పైగా లాభపడగా.. నిఫ్టీ 24,150 ఎగువన స్థిరపడింది.

సెన్సెక్స్ ఉదయం 77,128.05 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,933.59) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 77,357.97 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 330.92 పాయింట్ల లాభంతో 77,264.51 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 84.80 పాయింట్ల లాభంతో 24,175.65 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.39గా ఉంది.

సెన్సెక్స్ 30 సూచీలో టీసీఎస్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టైటాన్ షేర్లు లాభాల్లో ముగిశాయి. ఐసీఐసీఐ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, ఏషియన్ పెయింట్స్, ఐటీసీ, మారుతీ సుజుకీ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 88.30 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4603 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## ఇ-20 పెట్రోల్ స్థానంలో.. ఇ-10ని తెచ్చే నిర్ణయం తీసుకోలేదు




దిల్లీ: ఇ-20 పెట్రోల్ (20% ఇథనాల్ కలిపిన పెట్రోల్) స్థానంలో ఇ-10 పెట్రోల్‌ను తెచ్చే నిర్ణయం తీసుకోలేదని భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) తెలిపింది. 'ఇ-20 పెట్రోల్‌కు అనుగుణంగా లేని పాత వాహనాల ఇంజిన్లలో కొన్ని విడిభాగాలు దెబ్బతినే అవకాశం ఉన్నందున, తక్కువ ఇథనాల్ కలిపిన పెట్రోల్‌ను అందుబాటులోకి తేవాలా? ప్రస్తుత ఇంధన పంపిణీ నెట్‌వర్క్ ద్వారా, రెండు రకాల పెట్రోల్ ఎలా సరఫరా చేయవచ్చనే' అంశంపై చర్చ జరుగుతోందని స్పష్టం చేసింది. ఒకవేళ ప్రభుత్వం కనుక ఇథనాల్ మిశ్రమ విధానాన్ని మార్చాలని నిర్ణయిస్తే, ఇ-20 పెట్రోల్ నుంచి ఇ-10కి మారడంలో ఎలాంటి నిర్వహణపరమైన లేదా లాజిస్టికల్ సవాళ్లు ఉండవని బీపీసీఎల్ ఛైర్మన్, ఎండీ సంజయ్ ఖన్నా స్పష్టం చేశారు. ఇ-20 పెట్రోల్ స్థానంలో ఇ-10 పెట్రోల్ సరఫరా చేస్తామని తాను ఎక్కడా చెప్పలేదని అన్నారు. పెట్రోల్ బంకుల్లో ఇ-20తో పాటు ఇ-10 పెట్రోల్ కూడా అందుబాటులో ఉంటే పాత వాహనాల యజమానులకు మేలు కలుగుతోందనే విస్తృత చర్చల మధ్య సంజీవ్ ఖన్నా ఈ వ్యాఖ్యలు చేశారు.

## టీఎంపీవీ కొత్త బ్రాండ్ టాటా.కార్స్



**టాటా.కార్స్ బ్రాండ్‌ను ఆవిష్కరిస్తున్న టీఎంపీవీ ఎండీ, సీఈఓ శైలేష్ చంద్ర, టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ ముఖ్య వాణిజ్య అధికారి వివేక్ శ్రీవత్స**

**ముంబయి: కార్లు కొనుగోలు చేసే యువతను ఆకర్షించే లక్ష్యంతో టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ లిమిటెడ్ (టీఎంపీవీ) గురువారం తన కొత్త బ్రాండ్ గుర్తింపు అయిన టాటా.కార్స్‌ను ఆవిష్కరించింది. మరింత స్మార్ట్, పర్యావరణ హిత, అనుసంధానిత మొబిలిటీ అనుభవాలను తీర్చిదిద్దేలా.. ప్రపంచ వ్యాప్తంగా సులభంగా అర్థమయ్యేలా టాటా.కార్స్ పేరు నిర్ణయించినట్లు కంపెనీ పేర్కొంది. 'ఈ రోజు పరిచయం చేస్తున్న టాటా.కార్స్ కేవలం కొత్త బ్రాండ్ గుర్తింపు కాదు. మేము ఊహించే భవిష్యత్ కోసం మా సంకల్ప ప్రకటన కూడా' అని టీఎంపీవీ ఎండీ, సీఈఓ శైలేష్ చంద్ర వెల్లడించారు.**



# యమహా వైజెడ్ఎఫ్-ఆర్2

## ధరల శ్రేణి రూ.2.30-2.53 లక్షలు

చెన్నై: అంతర్జాతీయ విపణి కోసం తేలికపాటి స్పోర్ట్‌బైక్ వైజెడ్ఎఫ్-ఆర్2ను యమహా మోటార్ ఇండియా విడుదల చేసింది. ప్రారంభ ధర రూ.2.30 లక్షలు (ఎక్స్-షోరూమ్). టాప్ వేరియంట్ ఆర్2ఎం ధర రూ.2.53 లక్షలు (ఎక్స్‌షోరూమ్). ఈ బైక్ డెలివరీలు సెప్టెంబరు నుంచి ప్రారంభమవుతాయి. కొత్తగా అభివృద్ధి చేసిన 200 సీసీ లిక్విడ్ కూల్డ్, సింగిల్ సిలిండర్ ఇంజిన్ ఈ బైక్‌కు అమర్చారు. దీనికి 6 స్పీడ్ గేర్‌బాక్స్‌తో పాటు స్లిప్ అండ్ అసిస్ట్ క్లచ్‌ను స్టాండర్డ్‌గా ఇచ్చారు. స్ట్రీట్, రెయిన్, స్పోర్ట్స్, కస్టమ్ అనే రైడింగ్ మోడ్స్ ఇచ్చారు. టాప్ వేరియంట్‌లో అదనంగా టీఎఫ్‌టీ తెర, స్మార్ట్ కీ వంటి అధునాతన ఫీచర్లను జోడించారు.

## మా బాధ్యతల వల్ల ఇద్దరి మధ్య గ్యాప్ వచ్చింది: చిరంజీవి



తన మిత్రుడు జీవీ నారాయణ రావు అంత్యక్రియలకు చిరంజీవి హాజరయ్యారు. ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించిన చిరంజీవి .. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. నారాయణ రావుతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. "1977 నుంచి మా ఇద్దరి మధ్య పరిచయం. ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో కలుసుకున్నాం. తను అప్పటికే సీనియర్ స్టూడెంట్. మేం ట్రైనింగ్‌లో ఉన్నప్పుడు తన అనుభవాలు పంచుకునేవాడు. చాలా క్లోజ్‌గా ఉండేవాళ్లం. తర్వాత ఇండస్ట్రీలో ఎవరికి వాళ్లం బిజీ అయ్యాం. నా సినిమాల్లోనూ ఆయన నటించారు. ఆ తర్వాత మా బాధ్యతల వల్ల ఇద్దరి మధ్య గ్యాప్ వచ్చింది. యాదృచ్ఛికం ఏంటంటే.. పది రోజుల క్రితం కూడా 'మంచుపల్లకి' చూశాను. అందులో ఆయన కీలకపాత్రలో నటించారు. ఆ సినిమా స్ఫూర్తితో కొత్త కంటెంట్‌తో, ఐదుగురు కొత్త వాళ్లతో ఒక స్టోరీ రాశానని జీవీ చెప్పారు. నన్ను చూడాలన్నారు. దాని గురించి మాట్లాడిన తర్వాత ఇద్దరం కలిసి ఓ ఫొటో దిగాం. బహుశా ఆయన చివరి ఆలోచనలు నాతో పంచుకున్నారేమో. చాలా మొండి మనిషి. ఏ విషయాన్నీ లెక్క చేయడు" అని తన జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

## విభిన్న కోణాలున్న పాత్ర శూర్పణఖ!



రామాయణ స్క్రిప్ట్ తనకు శూర్పణఖలోని కొత్త కోణాలను అన్వేషించడంలో సహాయపడిందని అంటోంది కథానాయిక రకుల్ ప్రీత్ సింగ్. ఇప్పుడామె నితేశ్ తివారీ దర్శకత్వంలో రూపొందుతున్న 'రామాయణ: పార్ట్ 1' చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో ఆమె రావణుడి సోదరి అయిన శూర్పణఖ పాత్రలో కనిపించనుంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రకుల్ ఈ సినిమాలోని తన పాత్ర గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది."శూర్పణఖ జీవితంలోని ఇంతకుముందు తెలియని కొన్ని కోణాలు ఈ పాత్ర చేయటం ద్వారా తెలుసుకున్నాను. ఆమె గురించి నాకు తెలియని విషయాలు చాలా ఉన్నాయి. నేను ఈ స్క్రిప్ట్ చదివినప్పుడు, లక్ష్మణుడు ఆమె ముక్కును కోసిన సంఘటన కంటే ముందు, ఆ తర్వాత ఆమె జీవితం గురించి చాలా విషయాలు అందులో ఉన్నాయి. నేను ఈ పాత్ర చేయడం ద్వారా నాకు ఇవన్నీ ఆసక్తిగా అనిపించాయి. అందుకే నాకు ఈ పాత్ర చాలా బాగా నచ్చింది. శూర్పణఖ వ్యక్తిత్వంలోని విభిన్న కోణాలకు నేను ఆకర్షితురాలినయ్యాను. లంకలో ఆమెను అత్యంత అందమైన మహిళ అని అనేవారు. ఆమెకు అహం ఉండేది. చరిత్ర తరచుగా ఆమెను ఒక భయంకరమైన ప్రతినాయకురాలిగా మాత్రమే గుర్తుంచుకున్నప్పటికీ శూర్పణఖలోని సహజసిద్ధమైన సంక్లిష్టతే నేను ఈ పాత్రను పోషించేలా చేసింద"ంటూ చెప్పుకొచ్చింది.

## అమీర్‌పేట్ సెంటర్‌లో నిలబడి గుండు కొట్టించుకుంటా: హీరోయిన్ శ్వేత



శివ కుమార్ కాసారం, శ్వేతా లక్ష్మణ్ ప్రధానపాత్రల్లో నిశాంత్ దోటి దర్శకత్వంలో రానున్న చిత్రం 'సహ': లైఫ్ ఆఫ్ సంజు . సెప్టెంబర్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో గురువారం ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ చేసిన కామెంట్స్ ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. కచ్చితంగా ఈ సినిమా అందరికీ నచ్చుతుందని శ్వేత అన్నారు. "అందరి జీవితాలు 'సహ'కు కనెక్ట్ అవుతాయి. ప్రేమంటే అర్థం ఏంటో ఈ సినిమా చెబుతుంది. ప్రేమలో ఉండే బాధ, త్యాగం అన్ని ఇందులో చూపించాం. ఒక్కోసారి మనం తీసుకునే నిర్ణయం మన జీవితం మొత్తాన్ని మార్చేస్తుంది. ఈ ఎమోషన్స్‌ను చాలా అందంగా చూపించాం. మీ అందరికీ నేను రిక్వెస్ట్ చేయడం లేదు.. ఈరోజు నేను మీకు ఛాలెంజ్ చేస్తున్నాను. 'సహ' చూశాక 'ఎంత మంచి సినిమా తీశారు' అని అందరూ అనుకుంటారు. ఒకవేళ ఎవరైనా ఈ సినిమా చూసి నిరాశపడితే.. నేను అమీర్‌పేట్ సెంటర్‌లో నిలబడి గుండు కొట్టించుకుంటా. ఈ మాటను అందరూ గుర్తుపెట్టుకోండి. మేం అంత మంచి కంటెంట్‌తో వస్తున్నాం. హిట్ కొడతాం" అని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

**నన్ను నిందించండి: హీరో శివ కుమార్ కాసారం**

ఇక ఈ సినిమా అందరి అంచనాలు అందుకుంటుందని హీరో శివ కుమార్ కాసారం చెప్పారు. ఒకవేళ ఆ అంచనాలు ఒక్కశాతం అందుకోలేకపోయినా తనకు ఫోన్ చేసి తిట్టాలంటూ బహిరంగంగా తన ఫోన్ నంబర్‌ను చెప్పారు. 'సెప్టెంబర్ 4న విడుదల చేస్తున్నామంటే చాలా మంది వద్దు అన్నారు. పెద్ద సినిమాలు ఉన్నాయని చులకనగా మాట్లాడారు. పెద్ద సినిమాల మధ్య విడుదలై మంచి వసూళ్లు వచ్చినప్పుడే కదా.. ఇండస్ట్రీ మనవైపు చూసేది అనిపించింది" అని అన్నారు.

## అందరికీ వినోదాన్ని పంచే చిత్రం



'రంభ ఊర్వశి మేనక' చిత్రంతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమయ్యారు హీరో అల్లరి నరేశ్. ఆయన.. సురభి జంటగా నటించిన ఈ సినిమాని చంద్రమోహన్ చింతాడ తెరకెక్కించారు. అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ సంయుక్తంగా నిర్మించాయి. రాశీ సింగ్, విష్ణుప్రియ, ప్రిషా సింగ్ టైటిల్ పాత్రలు పోషించారు. ఈ చిత్రం సెప్టెంబరు 4న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే గురువారం హైదరాబాద్‌లో టైటిల్ గీతాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా నటి రాశీ సింగ్ మాట్లాడుతూ.. "ఈ సినిమా చాలా కొత్తగా ఉంటుంది. అందరికీ మంచి వినోదాన్ని అందిస్తుంది. ఈ చిత్రం కోసం నేను కఠినమైన ఆహార నియమాలు పాటించాను. నేనిప్పటి వరకు చేయని ఓ విభిన్నమైన పాత్రని ఇందులో పోషించాను" అన్నారు. "టైటిల్‌కి తగ్గట్లుగానే రంభ, ఊర్వశి, మేనక పాత్రల చుట్టూనే తిరిగే కథ ఇది. దీంట్లో అల్లరి నరేశ్ కామెడీ టైమింగ్ అదిరిపోతుంది. ఈ సినిమా కచ్చితంగా అందరికీ కనెక్ట్ అవుతుంది" అన్నారు నటి విష్ణు ప్రియ. ఈ కార్యక్రమంలో ప్రిషా సింగ్ తదితరులు పాల్గొన్నారు.


## దుల్కర్, నివిన్ మరోసారి మల్టీస్టారర్





కుటుంబ నేపథ్యం, ప్రేమకథా చిత్రాలతో సినీప్రియుల్ని అలరిస్తుంటారు మలయాళ కథానాయకుడు నివిన్ పౌలీ. గతంలో 'సర్వం మాయ' చిత్రంలో సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన యువకుడి పాత్రలో నటించి ప్రేక్షకుల హృదయాల్ని గెలుచుకున్నారు. ప్రస్తుతం ఇటీవలే విడుదలైన 'బెత్లెహం కుడుంబ యూనిట్' చిత్రంలో మమితా బైజుతో కలిసి ప్రేమప్రయాణం కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే హీరో నివిన్ తదుపరి చిత్రం దుల్కర్ సల్మాన్‌తో కలిసి చేయనున్నట్లు ఓ ఇంటర్వ్యూలో అధికారికంగా వెల్లడించారు. "దుల్కర్, నేను కలిసి పనిచేయడానికి ఆసక్తిగా ఉన్నాం. మా ఇద్దరికీ నచ్చే ఒక స్క్రిప్ట్, దాన్ని సుముఖంగా తీర్చిదిద్దే ఒక దర్శకుడు కావాలి. ఆగస్టు 21న 'బెత్లెహం కుడుంబ యూనిట్' చిత్రం విడుదలైన తర్వాత దుల్కర్ నన్ను అభినందించార"ని తెలిపారు. దుల్కర్, నివిన్ కాంబినేషన్‌లో 'విక్రమాదిత్యన్', 'బెంగళూర్ డేస్' చిత్రాలొచ్చాయి. మరోసారి వీరిద్దరి కలిసి ప్రేక్షకుల్ని ఎలా మెప్పించనున్నారో తెలియాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

## నాగార్జున 100వ చిత్రం.. అప్‌డేట్ పంచుకున్న టీమ్



అగ్ర కథానాయకుడు నాగార్జున తన కెరీర్‌లో కీలక మైలురాయికి చేరుకున్నారు. ఇప్పటివరకూ 99 చిత్రాల్లో నటించి అలరించిన ఆయన 100వ చిత్రానికి సంబంధించిన అప్‌డేట్‌ను పంచుకున్నారు. రా.కార్తీక్ దర్శకత్వంలో రూపొందుతున్న చఖఇఅస్త్ర100 అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై నిర్మిస్తున్నారు. టబు కీలక పాత్ర పోషిస్తున్నారు. దాదాపు చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీకి సంబంధించిన తొలి ప్రచార చిత్రాన్ని విడుదల చేసేందుకు రంగం సిద్ధమైంది.ఆగస్టు 29న నాగార్జున పుట్టినరోజును పురస్కరించుకుని టైటిల్ టీజర్‌ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా చిత్రం బృందం గురువారం అప్‌డేట్‌ను పంచుకుంది. 'రాక్‌స్టార్ కింగ్ సైజ్ స్కోర్ లోడింగ్' అంటూ చిత్ర నిర్మాణ సంస్థ చిన్న వీడియోను పంచుకుంది. పూర్తి వివరాలు ఆగస్టు 29న వెల్లడించనున్నారు.విడుదల తేదీ కూడా ప్రకటిస్తారా?మొదటి నుంచి ఈ మూవీకి సంబంధించి ఎలాంటి అప్‌డేట్ లేకుండా చాలా గోప్యంగా ఉంచుతున్నారు. ఇంతకు ముందెప్పుడూ చూడని సరికొత్త కథాంశంతో ఈ మూవీ రానుందని ఇన్‌సైడ్ టాక్. అంతేకాదు, ఇందులో నాగార్జున విభిన్న గెటప్పుల్లో కనిపిస్తారట. దసరా కానుకగా ఈ మూవీని విడుదల చేస్తారని గతంలో వార్తలు వచ్చాయి. ఇప్పుడు డిసెంబరు లేదా వచ్చే సంక్రాంతికి తీసుకొచ్చేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. శనివారం విడుదల చేసే ప్రచార చిత్రంతో విడుదల విషయంలో స్పష్టత వచ్చే అవకాశముంది. ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండటం విశేషం.

# ఇది వారానికి రెండు సార్లు తినండి.. వందేళ్లు ఆరోగ్యంగా జీవిస్తారు

ప్రస్తుతం జనాలు చాలామంది పుడుతూనే అనేక ఆరోగ్య సమస్యలతో బాధపడుతుతన్నారు. కొత్తరోగాలు.. మనుషలను పట్టి పీడిస్తున్నాయి. కొన్ని రోగాలైతే వైద్య నిపుణులకు అంతు చిక్కడం లేదుయకూడా. కాని పూర్వ కాలంలో జనాలు 80 .. 90 ఏళ్లు వచ్చినా..అలుపు సొలుపూ లేకుండా ఉత్సాహంగా ఉండేవారు. మీరు కూడా వందేళ్లు ఆరోగ్యంగా ఉండాలంటే వారానికి రెండు సార్లు జొన్న అన్నం తింటే సెంచరీ కొడతారు. దానిని ఎలా తయారు చేయాలి... ఏమేమి కావాలో ఈ స్టోరీలో తెలుసుకుందాం. . .!

జనాలకు ఆరోగ్య సమస్యలు పెరిగిపోతున్నాయి. దీంతో కొంత మంది బియ్యం అన్నాన్ని పూర్తిగా మానేసి.. మిల్లెట్స్? వంటకాలపై దృష్టి సారించారు. వాటిలో జొన్నలు ఎంతో శక్తిని ఇస్తాయి. అందుకే జొన్నల అన్నం తినేందుకు చాలామంది మొగ్గె చూపుతున్నారు. కాని దానిని ఎలా తయారు చేయాలో చాలామంది సతమతమవుతున్నారు.



జొన్నల అన్నం తయారీకి కావాల్సినవి

పచ్చ జొన్నలు : ఒక కప్పు
పెసరపప్పు : అర కప్పు
పల్లీలు : అర కప్పు
టమాటాలు : మూడు ( కూర ముక్కలు మాదిరిగా కట్? చేసుకోవాలి)
పచ్చిమిరపకాయలు: నాలుగు ( చిన్న ముక్కలుగా కట్?చేయాలి)
ఉల్లిపాయలు : రెండు ( మీడియమ్? సైజ్?) ( ఒక్కొ ఉల్లిపాయ ఆరు ముక్కలు)
కరివేపాకు : రెండు రెబ్బలు
కొత్తిమీర : రెండు రెబ్బలు
పుదీనా : రెండు రెబ్బలు
జీడిపప్పులు : 20
ఉప్పు : తగినంత
ఆవాలు : ఒక టీ స్పూన్?
మిరియాలు : ఒక టీ స్పూన్?
జీలకర్ర : ఒక టీ స్పూన్?
ఎండుమిరపకాయలు : రెండు
వెల్లుల్లి రెబ్బలు : ఆరు
పచ్చి కొబ్బరి : కొద్దిగా
అల్లం : కొద్దిగా
పసుపు : చిటికెడు
ఇంగువ: చిటికెడు

జొన్నల అన్నం తయారీ విధానం :

పెపరపప్పును శుభ్రంగా కడిగి కొద్ది సేపు నీళ్లలో నానబెట్టాలి. ఇప్పుడు జొన్నలను మిక్సీలో కొంచెం బరకగా ఉండేలా గ్రైండ్? చేసుకోవాలి.ఇప్పుడు కుక్కర్? లో పల్లీలు.. బరకగా చేసిన జొన్నల మిశ్రమం... ఇంతకుముందు నానబెట్టిన పెసరపప్పు.. తీసుకోవాలి. అందులో అన్నం వండేలా నీళ్లు పోయాలి.

తరువాత జీలకర, ఉల్లిపాయల ముక్కలు ( ఒక ఉల్లిపాయను ఆరు మక్కలు), పచ్చి మిరపకాయ ముక్కలు, టమాటా ముక్కలు, అల్లం, వెల్లుల్లి రెబ్బలు, పుదీనా, కొత్తిమీర, కరివేపాకు, కొద్దిగా నూనె, ఉప్పు వేసి మూత పెట్టి ఉడకపెట్టాలి. కుక్కర్? నాలుగు విజిల్స్? వచ్చేంత వరకు ఉడకనివ్వాలి. జొన్నలు ఆలస్యంగా ఉడుకుతాయి.

ఇప్పుడు మరో పొయ్యిపై తాలింపును రడీ చేసుకోవాలి. స్టవ్? వెలిగించి కళాయి పెట్టి మూడు చెంచాల నెయ్యి, జీడిపప్పు, కొబ్బరి ముక్కలు, ఆవాలు, ఎండి మిరప కాయలు, జీలకర్ర, కచ్చా పచ్చాగా దంచుకున్న మిరియాలు, కొత్తిమీర, చిటికెడు పసుపు, చిటికెడు ఇంగువ వేసి మొత్తం పచ్చివాసన పోయేదాకా వేయించుకోవాలి. వేగిన తాలింపుని ఉడికిన జొన్న అన్నంలో వేసి కలుపుకోవాలి. అంతే సూపర్ టేస్టీ జొన్నల అన్నం రెడీ. దీనిని వారానికి రెండు సార్లు తింటే ఎంతో బలంగా .. ఆరోగ్యంగా ఉంటారు.

## పూజకు ముందు మూడు చెంచాల నీటిని ఎందుకు తాగాలి..

# అలా చేయకపోతే ఫలితం ఉండదా..!




హిందూ సంప్రదాయం ప్రకారం.. చాలామంది ఇళ్లల్లో రోజు పూజచేస్తారు. షాపులు ఓపెనింగ్?లు.. ఇతర శుభకార్యాలు చేసేటప్పుడు కచ్చితంగా పూజతో ప్రారంభిస్తారు. ఎక్కడ పూజ చేసినా.. ఎప్పుడు చేసినా ముందు కచ్చితంగా స్పూన్ల నీటిని చేతిలో పోసుకొని తాగుతారు.. నీరు తాగి పూజప్రారంభింకపోతే ఫలితం రాదా.. పండితులు ఏం చెబుతున్నారు.. ఈ విషయం గురించి పురాణాల్లో ఏముంది.. మొదలగు విషయాలను ఈ స్టోరీలో తెలుసుకుందాం. . .!

హిందూ సంప్రదాయం ప్రకారం రోజూ పూజ చేయడం అనేది ఆచారం. ఎవరు ఎంతసేపు చేసినా కచ్చితంగా పూజ ప్రారంభానికి ముందు మూడు సార్లు నీటిని తాగుతారు. దీనినే ఆచమనం అంటారని పండితులు చెబుతున్నారు. ఇది కేవలం నీరు తాగే ఆచారమే కాదు. దీని వెనుకు చాలా ఆధ్యాత్మిక భావనలు ఉన్నాయి.

భగవంతుని ఆరాధించడానిక ముందు పవిత్రంగా ఉండాలి. శరీరం.. మనస్సు.. వాక్? ఇవి పూజకు చాలా ముఖ్యం. పండితులు చెప్పిన వివరాల ప్రకారం పూజకు ముందు మూడు సార్లు కొన్ని ప్రత్యేకమైన మంత్రాలు చదువుతూ మూడు సార్లు తాగాలి. శాస్త్రాల ప్రకారం ఆచమనం అనే ఈ ప్రక్రియతో శరీరం.. మనస్సు.. వాక్? శుద్ధి అవుతాయని పండితులు చెబుతున్నారు. ఈ ప్రక్రియ ద్వారా భక్తుడు తన శరీరాన్ని మాత్రమే కాదు, తన మనస్సును కూడా ప్రశాంతంగా మార్చుకుని దైవారాధనకు సిద్ధమవుతాడని శాస్త్రాల ద్వారా తెలుస్తుంది.

పూజ చేసేటప్పుడు ఇతర ఆలోచనలు రాకూడదు. అలా ఉండాలంటే శరీరం, మనస్సు, వాక్కు చాలా పవిత్రంగా ఉండాలి. ప్రస్తుతం జీవన విధానంలో అనేక ఆలోచనలు.. పని ఒత్తిడి,, కోప.. ఆందోళనలు... ఇలా అనేక విషయాలతో మనస్సు ప్రభావితమవుతుంది. అందుకే ఆచమనం చేస్తే అలాంటి విషయాలను కొంతసేపు పక్కన పెట్టి మనస్సు .. దృష్టి.. భగవంతునిపై ఉంటుందని పండితులు చెబుతున్నారు.

హిందూ సంప్రదాయాల ప్రకారం నీటికి చాలా పవిత్రత ఉంది. అన్ని ధార్మిక కార్యక్రమాల్లో నీటికి ప్రత్యేక స్థానం ఉంది. స్వామి వారికి అభిషేకం చేసేటప్పుడు నీటిని ఉపయోగిస్తారు. ఆచమనం అంటే మూడే సార్లు నీటిని చేతిలో పోసుకొని తాగడం. దీనివలన శరీరం మానసికంగా పవిత్రత అవడమే కాకుండా.. మలినాలు కూడా తొలగుతాయని పండితులు చెబుతున్నారు. కోపం, అసూయ, ఆందోళన, ప్రతికూల ఆలోచనలు, అహంకారం వంటి అంతర్గత దోషాలను కూడా సూచిస్తుంది.

ఆచమనం మంత్రాల శబ్దాలకు మనస్సు ఎంతో ప్రశాంతంగా ఉంటుంది. దీనివలన భక్తి భావన పెరిగి.. మనసు భగవంతుని ఆరాధనపై కేంద్రీకృతం అవుతుందని పండితులు చెబుతున్నారు.

ఆచమనం చేసేటప్పుడు మూడు సార్లు ఈ నామాలను చదువుతూ నీటిని తాగాలి

ఓం కేశవాయ స్వాహా
ఓం నారాయణాయ స్వాహా
ఓం మాధవాయ స్వాహా

ఆ తర్వాత గోవిందాయ నమ: అంటూ చేతులను కడుక్కోవాలి.

అయితే, ఈ సందర్బంగా మరికొన్ని మంత్రాలు, నామాలను కూడా ఉచ్చరించడం చేస్తారు.

పూజలో ఆచమనం చేసేటప్పుడు ఆచరించాల్సిన నియమాలు

స్నానం చేసిన తరువాత పంచ కట్టుకొని.. కండువా వేసుకొని బావి దగ్గరకు వెళ్లి చిన్న గిన్నెతో కాని బిందెతో గాని నీళ్లను తీసుకురావాలి. ఒకవేళ బోర్? ఉంటే అప్పుడే ఆన్? చేసి నీరు పట్టుకోవాలి. అలా తీసుకొచ్చిన నీటితో మాత్రమే ఆచమనం చేయాలి. అవకాశం ఉంటటే ఏ రోజు కారోజు నీటిని తెచ్చుకోవడం చాలా మంచిది. అలా అవకాశం లేకపోతే... దేవుని పూజకు తెచ్చుకున్న నీటిని ఇతర అవసరాలకు వాడకూడదు. తరువాత రోజు పూజ సమయం వరకు అందులో కొద్దగా వీపూది వేసి.. మూతపెట్టి తాకకుండా పక్కన పెట్టి ఉంచాలి. మళ్లీ పూజకు సిద్దం అయిన తరువాతనే ఈ నీటిపాత్రను అంటుకోవాలి.

మంత్రాలు తెలిసినవారు వాటిని శ్రద్ధగా జపిస్తూ ఆచమనం చేయాలి. తొందరపాటుగా కాకుండా, పూర్తి ఏకాగ్రతతో ఈ కర్మను నిర్వహించాలి. ఆచమనం అనంతరం పూజ లేదా జపాన్ని ప్రారంభించడం శ్రేయస్కరంగా భావిస్తారు.

# ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ కొత్త 'రాసోంక్' ట్యాబ్లెట్స్.. ఎఫ్‌డీఏ గ్రీన్ సిగ్నల్




అడ్వాన్స్‌డ్ ప్యాంక్రియాటిక్ క్యాన్సర్‌తో పోరాడుతున్న రోగులకు ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కొత్త ఔషధాన్ని ఆమోదించింది. అత్యంత ప్రాణాంతకమైన ఈ క్యాన్సర్ చికిత్సలో దశాబ్దాలుగా అసాధ్యంగా ఉన్న 'అండ్రగ్గబుల్' కేన్సర్ కారకాలను ఇది లక్ష్యంగా చేసుకుంటుంది. క్యాన్సర్ కణాల వృద్ధిని వేగవంతం చేసే మ్యుటేటెడ్ ప్రోటీన్‌ను సమర్థవంతంగా అడ్డుకునే 'డారాక్సోన్‌రాసిబ్' అనే సరికొత్త ట్యాబ్లెట్లకు ఆమోదం లభించింది.

ఈ రోజువారీ మాత్రలను రెవల్యూషన్ మెడిసిన్స్ సంస్థ 'రాసోంక్' బ్రాండ్ పేరుతో విక్రయించనుంది. అయితే ఈ ఔషధం ఖర్చు సామాన్యులకు అందనంత భారంగా ఉంది. ఒక నెల మందుల సరఫరా ధర సుమారు రూ.37 లక్షలు ఉంటుందని ఆ కంపెనీ ప్రకటించింది. అత్యంత ఖరీదైనప్పటికీ.. ప్రాణాలను రక్షించుకోవడానికి ఇది రోగులకు ఒక ప్రధాన ఆశాకిరణంగా మారుతోంది.

ఈ ప్రయోగాత్మక ఔషధాన్ని పరీక్షించిన అధ్యయనంలో రోగుల జీవన కాలం దాదాపు రెట్టింపు అయినట్లు తేలింది. ఇంతకుముందు ఇతర చికిత్సలు విఫలమైన 500 మంది మెటాస్టాటిక్ క్యాన్సర్ రోగులపై ఈ పరిశోధన చేపట్టారు. కీమోథెరపీ తీసుకున్న రోగులు సగటున 6.7 నెలలు జీవిస్తే, ఈ కొత్త మందు తీసుకున్న రోగులు ఏకంగా 13.2 నెలల పాటు జీవించారు. చర్మంపై దద్దుర్లు, నోటి పూతలు, విరేచనాలు వంటి కొన్ని జీర్ణ సమస్యలు దుష్ప్రభావాలుగా కనిపించినప్పటికీ.. కీమోథెరపీ కంటే తక్కువ దుష్ప్రభావాలు ఉన్నట్లు వెల్లడైంది.

ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ అనేది ఇతర అవయవాలకు పాకే వరకు గుర్తించడం కష్టంగా ఉండే అత్యంత ప్రమాదకరమైన క్యాన్సర్. యునైటెడ్ స్టేట్స్‌లో ప్రతి సంవత్సరం సుమారు 67వేల కొత్త కేసులు నమోదవుతుండగా.. 52వేల మందికి పైగా మరణిస్తున్నారు. దీని 5 ఏళ్ల సర్వైవల్ రేటు కేవలం 13 శాతం మాత్రమే. మాజీ సెనేటర్ బెన్ సాస్ ఈ మందు వాడిన తర్వాత తనకు నొప్పి తగ్గిందని '60 మినిట్స్' కార్యక్రమంలో తెలపడంతో ప్రజాదరణ పెరిగింది.

ఈ మందు తయారీలో ఉపయోగించిన 'మాల్క్యులర్ గ్లూ' టెక్నాలజీ భవిష్యత్తులో లంగ్ క్యాన్సర్‌తో పాటు ఇతర రకాల చికిత్సలకు కూడా మార్గం సుగమం చేస్తుందని వైద్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. లక్షలాది మంది ప్రాణాలను కాపాడే దిశగా క్యాన్సర్ వైద్య రంగంలో ఇదొక మైలురాయిగా నిలవనుంది.

# చిత్రమైన చాయ్..!



డిగ్రీ పాసవుతూనే ఉద్యోగం వచ్చింది. ఒక ఆదివారం రోజున కులాసాగా బాల్కనీలో కూర్చుని కూనిరాగాలు తీస్తున్నా. అమ్మ పొద్దున్నే వంట చేసేసి, ఏదో ఫంక్షన్‌కు వెళ్లింది. ఇంతలో నాన్న దగ్గరగా వచ్చి 'కాసిని మంచినీళ్లు ఇవ్వమ్మా' అన్నారు. నాన్నంటే ఉన్న భయంకొద్దీ పరుగు లాంటి నడకతో వెళ్లి తెచ్చిచ్చాను. ఆ వెంటనే 'కొంచెం టీ పట్రా తల్లీ' అన్నారు. ఎంత భయమున్నా, చేయడం రాదు కాబట్టి.. 'నేను టీ తాగను కదా.. నాకు రాదు నాన్నా' అన్నాను మెల్లగా. 'ఆడపిల్లవి.. ఆమాత్రం చేతకాదా? అదేం బ్రహ్మవిద్య కాదు. టీపొడి, పంచదార, పాలు, నీళ్లు పోసి మరిగించి, వడపోస్తే చాలు' అన్నారు. ఇంకేం మాట్లాడగలను? కిమ్మనకుండా భయభక్తులతో వెళ్లాను. డైనింగ్‌హాల్‌తోనే తప్ప వంటింటితో సంబంధం లేని నాకు.. పంచదార, టీపొడి డబ్బాలు కనిపెట్టడానికే బోల్డంత టైం పట్టింది. ఆయన చెప్పినట్టే చేసి, తీసుకెళ్లి ఇచ్చా. ఎలానూ చేస్తున్నా కదా అని, అద్భుతంగా ఉండటం కోసం.. అల్లం కూడా దట్టించా. దాంతో ఘుమఘుమలాడుతోంది. 'శభాష్' అంటూ కితాబులిస్తారనుకుంటే.. ఓ గుక్క తాగగానే 'అబ్బా..!' అని కేకపెట్టారు. పాపం.. నోరు కాలిందేమో అనుకున్నా. చాయ్‌కప్పు పక్కన పెట్టేసి.. టీపొడి తీసుకురమ్మన్నారు. అది చూసి.. 'ఇది టీపౌడర్ కాదు, ఆవపొడి. అసలు మీ అమ్మననాలి.. వంట నేర్పకపోతే ఎలా?!' అంటూ ఛడామడా తిట్టేసి, 'పిండివంటలు రాకపోయినా ఫరవాలేదు.. టీ కూడా చేతకాదా? కనీసం ఏది ఎక్కడుంటుందోనైనా తెలీదా' అని తలబాదుకుంటూ వెళ్లిపోయారు. ఇందులో అమ్మ పొరపాటు కూడా ఉంది. కాఫీ, హార్లిక్స్, బోర్నవీటా సీసాల మధ్య ఆవపొడి పెట్టింది. నాకేం తెలుసు.. టీపొడే అనుకున్నా. అదే మొదలు, చివర.. ఆ తర్వాత మా నాన్న- టీ అడిగితే ఒట్టు. వంట రాని నాచేత గరిటె పట్టించి.. పాకశాస్త్ర ప్రవీణురాలిని చేసిన ఘనత మా ఆయనదే.

# కురులు రాలకూడదంటే..

ఇటీవలి కాలంలో చాలామందికి జుట్టు రాలడం అనేది పెద్ద సమస్యగా తయారైంది. ఇందుకు చాలానే కారణాలున్నప్పటికీ మనం తీసుకునే ఆహారం చాలా ముఖ్యమైంది. రోజువారీ ఆహారంలో ప్రోటీన్, ఐరన్, జింక్, విటమిన్లు, గుడ్ కొలెస్ట్రాల్ ఉండేలా చూసుకోవాలి.

కంది, శనగ, పెసర, మినప్పప్పులు రోజూ తింటుండాలి.

పాలకూర, తోటకూర, గోంగూర, మెంతికూర వంటి ఆకుకూరలు వారానికి మూడుసార్లు తినాలి.

రాజ్మాలో ప్రోటీన్లు, ఐరన్ ఉంటాయి.

ఒమేగా-3 కొవ్వులకు చేపలు మంచి వనరు.

రోజూ పాలు, పెరుగు తప్పనిసరిగా తీసుకోవాలి. ఇవి ప్రోటీన్‌ను అందిస్తాయి.

బాదం, పిస్తా, గుమ్మడి, అవిసె గింజలు, వాల్‌నట్స్ వంటివి కొద్ది మోతాదులో నిత్యం తింటుండాలి.

నువ్వులు తినడం వల్ల శరీరానికి అవసరమైన ఐరన్, ఇతర ఖనిజాలు లభిస్తాయి.

జామ, బొప్పాయి, నారింజ, ఆపిల్, కివి, డ్రాగన్ ఫ్రూట్ వంటి పండ్లను మార్చి మార్చి తినాలి. అలాగే సి-విటమిన్ విస్తారంగా ఉన్న నిమ్మ, ఉసిరి తదితర పండ్లు తీసుకుంటే గనిరోధకశక్తి పెరుగుతుంది.

క్యారెట్, చిలగడదుంపల్లో బీటా-కెరోటిన్ లభిస్తుంది.

చేపలు, చికెన్, అవకాడొ, పనీర్, పప్పులు, గుడ్డు, పెరుగు వంటివన్నీ తగినంత పరిమాణంలో తీసుకోవడం ద్వారా ప్రోటీన్లు అందుతాయి.



రోజుకు రెండు లీటర్లకు తక్కువ కాకుండా నీళ్లు తాగాలి. దాహం వేసినప్పుడు మాత్రమే కాకుండా రోజంతా క్రమంగా నీళ్లు తాగుతుండాలి.

జంక్ ఫుడ్ బాగా తగ్గించాలి. ఎక్కువగా వేయించినవి, అధిక చక్కెర ఉన్నవి, శీతల పానీయాలు, ప్రాసెస్ చేసిన ఆహారాలు బాగా తగ్గించి, ఇంట్లో వండిన వాటికి ప్రాధాన్యం ఇవ్వాలి.

జుట్టు మరీ ఎక్కువగా రాలుతుంటే.. ఆహారం మార్చినంతలో సరిపోదు. ఐరన్/ఫెరిటిన్, బి-12, డి-విటమిన్లు తక్కువవడం, థైరాయిడ్ సమస్య ఉండటం వంటివి కారణాలు అయ్యుండవచ్చు. అకస్మాత్తుగా ఎక్కువగా జుట్టు రాలడం, కుచ్చులుగా ఊడటం.. లేదా నెలల తరబడి సమస్య అలాగే ఉండటం జరిగితే.. వైద్యుని సంప్రదించడం మంచిది.

# ఇంటి తోటలో రంగుల రాణి!





నీల గోరింట పూలనే... ముద్ద గోరింట, చిలకముక్కు పూలు అని పిలుస్తారు. హిందీలో గుల్ మెహందీ అనే పేరూ ఉంది. వీటి శాస్త్రీయ నామం ఇంపేషన్స్ బాల్సమినా. ఈ పూల వెనక భాగంలో చిన్న మొగ్గ ఆకారం చిలక ముక్కును పోలి ఉండటం వల్ల వీటికి ఈ పేరు వచ్చింది.
వర్షాకాలం వచ్చిందంటే చాలు... పల్లెల్లో ప్రతీ ఇంటా పచ్చదనానికి తోడుగా వికసిస్తుందీ నీలగోరింట మొక్క. రంగు రంగుల్లో పూలు విరబూస్తూ, చిట్టి గులాబీలను గుర్తుకు తెస్తూ మురిపిస్తాయి. పాత జ్ఞాపకాలెన్నో తట్టి లేపుతాయి. మరి దీన్ని ఎలా పెంచుకోవాలో తెలుసా?
నీల గోరింట పూలనే... ముద్ద గోరింట, చిలకముక్కు పూలు అని పిలుస్తారు. హిందీలో గుల్ మెహందీ అనే పేరూ ఉంది. వీటి శాస్త్రీయ నామం ఇంపేషన్స్ బాల్సమినా. ఈ పూల వెనక భాగంలో చిన్న మొగ్గ ఆకారం చిలక ముక్కును పోలి ఉండటం వల్ల వీటికి ఈ పేరు వచ్చింది. గులాబీ, ఎరుపు, తెలుపు, ఊదాతో పాటు డబుల్ కలర్స్‌లోనూ పూస్తూ రంగుల హరివిల్లును తలపిస్తాయి. వర్షాకాలలో మొదలై శీతకాలం వరకూ అందంగా విచ్చుకుంటాయి. విత్తనాలను నాటితే చక్కగా మొలకెత్తుతాయి. కాబట్టి వీటిని పెంచడం సులభమే. ఈ పూలు కాయలుగా మారి, పక్వానికి వచ్చిన దశలో చేత్తో చిన్నగా తాకగానే ఒక్కసారిగా పేలి గింజలు దూరంగా పడతాయి. అందుకే, దీన్ని టచ్‌మీనాట్ మొక్క అనీ పిలుస్తుంటారు. పూర్వం పల్లెల్లో పెరటి నిండా ఈ మొక్కలు విరబూసేవి. ఆడపిల్లలు ఈ పూల రేకులను నలిపి చేతులకు గోరింటాకులా పెట్టుకుని మురిసిపోయేవారు. అందుకే, ఆతరం పిల్లలకు ఇది అందమైన జ్ఞాపకం.

**ఎలా పెంచాలంటే..**

నీరు నిలవని సారవంతమైన మట్టిని ఎంచుకోండి. నేలతో పాటు కుండీల్లోనూ పెంచుకోవచ్చు. రోజూ కనీసం 4 నుంచి 6 గంటల పాటు నేరుగా తగిలే ఎండ సరిపోతుంది. నెలకోసారి వర్మీకంపోస్ట్ అందిస్తే ఆరోగ్యంగా ఎదుగుతాయి. పూత దశలో ఉన్నప్పుడు పొటాషియం ఉండే సహజ ఎరువులు ఇస్తే బాగా పూస్తాయి. మొక్క ఎత్తు పెరగకుండా గుబురుగా పెరగడానికి అప్పుడప్పుడూ చిగుళ్లను కత్తిరించండి. ఈ మొక్కకు పేనుబంక, తెల్ల మచ్చల సమస్య రావొచ్చు. దీనికోసం వేపనూనె స్ప్రే చేస్తే మొక్కలను సహజంగా కాపాడుకోవచ్చు.

# శ్రావణంలో 'పద్మ' సోయగం!



అందంగా అమరిన రేకలు, ఆహ్లాదంగా కనిపించే రంగులతో తామర పూలు ఎంతో ఆకర్షణీయంగా ఉంటాయి. అయితే, ఒకప్పటిలా వీటిని పెద్ద పెద్ద కొలనుల్లోనే పెంచాల్సిన అవసరం లేదు. మినీయేచర్ రకాలతో బాల్కనీల్లో చిన్న కుండీల్లో, జాడీల్లో కూడా పూయించొచ్చు.
లక్ష్మీదేవికి ప్రతిరూపంగా తామరపువ్వుని భావిస్తాం. అందుకే, ఆధ్యాత్మికంగా ఈ పూలకు ఎంతో ప్రాధాన్యం. వీటిని పూజలకే కాదు... అలంకరణల్లోనూ విరివిగా వాడుతుంటారు. ఒకప్పుడు ఇవి చెరువులు, కొలనుల్లోనే ఎక్కువగా కనిపించేవి. ఇప్పుడు బాల్కనీల్లోనూ సందడి చేస్తున్నాయి. ఇందుకు కారణం... కాలక్రమంలో పుట్టుకొచ్చిన మినీ, మైక్రో రకాలే. ఫెయిరీ, రెయిన్‌బో, బటర్‌ఫ్లై లవ్, స్పార్క్... వంటి వేల రకాలు ఇందులో ఉన్నాయి. గులాబీ, తెలుపు, పసుపు, ఎరుపు...వంటి వివిధ వర్ణాల్లో, భిన్న ఛాయల్లో విచ్చుకుని భలేగా ఆకట్టుకుంటాయి. వీటిల్లో రంగు మార్చుకునేవే కాదు, సుమధుర పరిమళాల్ని వెదజల్లే రకాలూ ఉన్నాయి. ఉదయించే సూర్యకాంతికి వికసించే ఈ బుజ్జి పద్మాలు పెంచుకునే ప్రదేశానికి ప్రత్యేక అందాన్నీ ఆహ్లాదకరమైన వాతావరణాన్నీ అందిస్తాయి.
ఎలా పెంచాలంటే... తామర పూల మొక్కల్ని దుంపలతోపాటు విత్తనాల ద్వారానూ పెంచొచ్చు. ఇందుకోసం ముందుగా రంధ్రాలు లేని వెడల్పాటి సెరామిక్, ప్లాస్టిక్ లేదా గాజు పాత్రను తీసుకోవాలి. సాధారణ బంకమట్టి లేదా నదీ పరీవాహక ప్రాంతపు ఒండ్రు మట్టిని కమలాల్ని పెంచుకోవడానికి ఎంచుకోవచ్చు. మట్టిలో ఎలాంటి రసాయన ఎరువులు కలపకుండా, కొద్దిగా వర్మీ కంపోస్ట్ చేర్చి మెత్తటి బురదలా తయారు చేయాలి. ఇప్పుడు దీనిలోపల దుంపల్ని నాటుకున్నాక శుభ్రమైన నీటిని నింపాలి. నీళ్లు ఎప్పుడూ మొక్కపై వరకూ ఉండేలా చూసుకోవాలి. ప్రతీ వారం నీటిని మార్చాలి. తామర మొక్కలు బాగా పెరగాలన్నా, పూలు బాగా రావాలన్నా రోజుకు కనీసం 5 నుంచి 6 గంటల పాటు ప్రత్యక్ష సూర్యకాంతి అవసరం. కాబట్టి బాల్కనీలో లేదా ఎండ తగిలే ప్రదేశంలో ఉంచాలి. నీరు ఆవిరైపోకుండా ఎప్పటికప్పుడు తగినంత నీటిని భర్తీ చేస్తుండాలి. మొక్క ఎదిగే కొద్దీ నీటిలో కరిగే మైక్రో న్యూట్రియంట్స్ లేదా ఆక్వాటిక్ ప్లాంట్ ఫెర్టిలైజర్లను తక్కువ మోతాదులో ఇవ్వాలి. దోమలు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవడం కూడా అవసరం. ముఖ్యంగా ఇందులో చిన్న బొగ్గు ముక్క వేయడం మరిచిపోవద్దు. అప్పుడు ఆకట్టుకునే పద్మాలు మీ ముంగిట విచ్చుకుని పరవశించేలా చేస్తాయి.

# సాంకేతికతను నేర నియంత్రణకు సాధనంగా వినియోగించాలి

**నేరాలపై లోతైన విశ్లేషణతోనే కట్టడి : డీజీపీ సీవీ ఆనంద్**
**డీజీపీ కార్యాలయంలో అన్ని యూనిట్ల అధికారులతో అర్ధవార్షిక నేర సమీక్ష సమావేశం**
**సైబర్, ఆర్థిక నేరాల్లో తగ్గుదల... మాదకద్రవ్యాలు, వ్యవస్థీకృత నేరాలపై ప్రత్యేక దృష్టి**
**సీసీటీఎన్ఎస్ డేటా నవీకరణ 96 శాతానికి**
**యూనిట్ల వారీగా నెలవారీ సమీక్షలు తప్పనిసరి డీజీపీ**
**క్షేత్ర స్థాయిలో అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి: డీజీపీ సీవీ ఆనంద్**
**బేసిక్ పోలీసింగ్ విధానాన్ని అమలు**
**వృత్తిపరమైన ప్రమాణాలు పాటించాలి ; డీజీపీ**





నేరాల దర్యాప్తు, పోలీసింగ్‌లో వృత్తి నైపుణ్య ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని డీజీపీ సీవీ ఆనంద్ అధికారులను ఆదేశించారు. నేరాల సమీక్షను కేవలం గణాంకాలకే పరిమితం చేయకుండా.. ప్రతి నేరం వెనుక కారణాలు, నేరస్థుల విధానం, దర్యాప్తు తీరు, కేసుల పరిష్కారాన్ని లోతుగా విశ్లేషించాలని అన్ని యూనిట్ల పోలీసు ఉన్నతాధికారులతో శుక్రవారం డిజిపి కార్యాలయంలో నిర్వహించిన అర్ధవార్షిక వార్షిక నేర సమీక్ష సమావేశం డీజీపీ అన్ని యూనిట్ల పోలీసు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఇటీవలి కాలంలో సీసీటీఎన్ఎస్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించడం మూలంగా గతంలో 70--80 శాతంగా ఉన్న సీసీటీఎన్ఎస్ డేటా అప్‌డేట్.. అధికారులు, సిబ్బంది సమష్టి కృషితో 96 శాతానికి చేరడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రతి నెల నిర్వహించే క్రైమ్ రివ్యూ సమావేశాలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని డీజీపీ సూచించారు. క్షేత్రస్థాయిలో పోలీసులు పాటించాల్సిన ప్రాథమిక విధానాలను కచ్చితంగా అమలు చేయాలని, ప్రొఫెషనల్ స్టాండర్డ్స్‌ను పాటించడాన్ని అధికారులు పోటీగా తీసుకోవాలని అన్నారు. అన్ని జోన్ల డీఐజీలు, మల్టీజోన్ ఐజీలు ఇకపై ఇన్‌స్పెక్షన్ నోట్స్‌ను పరిశీలించాలని ఆదేశించారు. జిల్లాల పర్యటనలు, పోలీస్‌స్టేషన్ల తనిఖీల సమయంలో గుర్తించే అంశాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. నేరాల ధోరణిని ముందుగానే గుర్తించి, అవసరమైన చోట ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు.

## రాష్ట్రంలో 7.15% పెరిగన నేరాలు

మాదకద్రవ్యాల కేసుల్లో 46.10% వృద్ధి.. సైబర్, ఆర్థిక నేరాల్లో తగ్గుదల

రాష్ట్రంలో మొత్తం నేరాల సంఖ్య మూడేళ్లలో 7.15 శాతం పెరిగింది. 2023–24లో 2,65,377 కేసులు నమోదుకాగా.. 2025–26లో 2,84,363కు చేరాయి. లక్ష జనాభాకు నేరాల రేటు 481.58 నుంచి 491.59కి పెరిగింది. మాదకద్రవ్యాల కేసులు 2023–24లో 2,026 ఉండగా.. 2025–26లో 2,960కు చేరాయి. మూడేళ్లలో 46.10 శాతం పెరుగుదల నమోదైంది. వ్యవస్థీకృత నేరాలు 25 నుంచి 451కు పెరిగి 1,704 శాతం వృద్ధిని నమోదు చేశాయి. ట్రాఫిక్ నేరాలు 29,130 నుంచి 31,891కు పెరిగి 9.48 శాతం వృద్ధి చెందాయి. మరోవైపు సైబర్ నేరాలు 25,373 నుంచి 22,000కు తగ్గి 13.29 శాతం, ఆర్థిక నేరాలు 37,690 నుంచి 32,684కు తగ్గి 13.28 శాతం క్షీణించాయి.

## తీవ్ర నేరాల్లో 10.33% తగ్గుదల

తీవ్ర నేరాలు (గ్రేవ్ క్రైమ్) గత ఏడాదితో పోలిస్తే గణనీయంగా తగ్గాయి. 2024–25లో 7,019 కేసులు నమోదుకాగా.. 2025–26లో 6,294కు తగ్గాయి. ఏడాది వ్యవధిలో 10.33 శాతం తగ్గుదల నమోదైంది. లక్ష జనాభాకు నేరాల రేటు 11.21 నుంచి 10.88కు తగ్గింది. ప్రధాన కమిషనరేట్లలో హైదరాబాద్‌లో 1,483 నుంచి 1,094కు తగ్గి 26.23 శాతం క్షీణత నమోదైంది. సైబరాబాద్‌లో 656 నుంచి 613కు, మల్కాజిగిరిలో 664 నుంచి 549కు తగ్గాయి. అయితే కొన్ని జిల్లాల్లో తీవ్ర నేరాలు పెరిగాయి. ములుగులో 44 నుంచి 88కు, నిర్మల్‌లో 66 నుంచి 102కు, ఆదిలాబాద్‌లో 96 నుంచి 140కు చేరాయి. చిన్న, గిరిజన జిల్లాల్లో పెరుగుతున్న తీవ్ర నేరాలపై ప్రత్యేక దృష్టి అవసరమని గణాంకాలు సూచిస్తున్నాయి.

## సాధారణ నేరాలు ఏటేటా పెరుగుతున్నాయ్

మూడేళ్లలో 7.28% వృద్ధి.. ఆదిలాబాద్‌లో 60.71% పెరుగుదల

తీవ్ర నేరాలు తగ్గుతున్నప్పటికీ సాధారణ నేరాలు (నాన్–గ్రేవ్) మాత్రం పెరుగుతున్నాయి. 2023–24లో 2,59,201గా ఉన్న కేసులు 2025–26లో 2,78,069కు చేరాయి. మూడేళ్లలో 7.28 శాతం పెరుగుదల నమోదైంది. కమిషనరేట్లలో ఫ్యూచర్ సిటీలో 23.70 శాతం, సైబరాబాద్‌లో 17.32 శాతం, మల్కాజిగిరిలో 13.53 శాతం పెరుగుదల నమోదైంది. హైదరాబాద్‌లో మాత్రం 2.77 శాతం తగ్గుదల కనిపించింది. జిల్లాల విషయానికి వస్తే కొమురం భీం ఆసిఫాబాద్‌లో 70.88 శాతం, ఆదిలాబాద్‌లో 60.71 శాతం పెరుగుదల నమోదైంది. మెదక్, సంగారెడ్డి, నల్గొండ, నారాయణపేట జిల్లాల్లోనూ సాధారణ నేరాలు పెరిగాయి.

## మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా

రాష్ట్రంలో నార్కోటిక్ కేసుల పెరుగుదల పోలీస్ శాఖకు ప్రధాన సవాలుగా మారుతోంది. 2023–24లో 2,026 కేసులు ఉండగా.. 2025–26లో 2,960కు చేరాయి. లక్ష జనాభాకు నేరాల రేటు 3.68 నుంచి 5.12కు పెరిగింది. కమిషనరేట్లలో సైబరాబాద్‌లో 266 నుంచి 508కు చేరి 90.98 శాతం పెరుగుదల నమోదైంది. వరంగల్‌లోనూ మూడేళ్లలో 142.31 శాతం పెరిగాయి. జిల్లాల్లో ఆదిలాబాద్‌లో 57 నుంచి 219కు కేసులు పెరిగాయి. నేరాల రేటు 7.22 నుంచి 26.91కు చేరింది. నిజామాబాద్‌లో 62 నుంచి 123కు పెరిగాయి. నారాయణపేట, మహబూబ్‌నగర్, జోగులాంబ గద్వాల జిల్లాల్లోనూ గణనీయమైన పెరుగుదల నమోదైంది. ఈ గణాంకల ప్రకారం మొత్తం రాష్ట్ర వ్యాప్తంగా మూడేళ్లలో నార్కోటిక్ కేసులు 46.10% పెరుగుదల నమోదయింది.

## మహిళలు, చిన్నారులపై తగ్గిన నేరాలు

2024–25లో 31,593గా ఉన్న మహిళలు, చిన్నారులపై నేరాలు 2025–26లో 31,108కు తగ్గాయి. ఏడాదిలో 1.54 శాతం క్షీణత నమోదైంది. అయితే 2023–24తో పోలిస్తే 3.81 శాతం ఎక్కువగా ఉన్నాయి. హైదరాబాద్, సైబరాబాద్, వరంగల్ కమిషనరేట్లలో కేసులు తగ్గగా.. ఫ్యూచర్ సిటీలో 790 నుంచి 994కు పెరిగాయి. జిల్లాల్లో ఖమ్మం, ఆదిలాబాద్, మహబూబాబాద్, నారాయణపేట, ములుగులో పెరుగుదల కనిపించింది.

## ట్రాఫిక్ నేరాలు 9.48% పెరుగుదల

రాష్ట్రంలో ట్రాఫిక్ నేరాలు కూడా వరుసగా పెరుగుతున్నాయి. 2023–24లో 29,130 కేసులు ఉండగా.. 2025–26లో 31,891కు చేరాయి. మూడేళ్లలో 9.48 శాతం పెరిగాయి. సైబరాబాద్‌లో 2,882 నుంచి 3,677కు, మల్కాజిగిరిలో 3,213 నుంచి 3,673కు కేసులు పెరిగాయి. హైదరాబాద్‌లో స్వల్ప తగ్గుదల నమోదైంది. వరంగల్‌లో 8.27 శాతం తగ్గింది. జిల్లాల్లో కొమురం భీం ఆసిఫాబాద్‌లో 154 నుంచి 1,115కు చేరి 624.03 శాతం పెరుగుదల నమోదైంది. నిర్మల్‌లో 67.92 శాతం, నల్గొండలో 34.37 శాతం, ఆదిలాబాద్‌లో 28.30 శాతం పెరిగాయి. మరోవైపు భద్రాద్రి కొత్తగూడెం, కామారెడ్డి, వికారాబాద్‌లో తగ్గుదల కనిపించింది.

## సైబర్, ఆర్థిక నేరాల్లో ఊరట

సైబర్ నేరాలు 2024–25తో పోలిస్తే 2025–26లో 13.29 శాతం తగ్గాయి. ఆర్థిక నేరాల్లోనూ 13.28 శాతం తగ్గుదల నమోదైంది. ఈ రెండు విభాగాల్లో మూడేళ్ల కాలానికీ తగ్గుదల కనిపించడం సానుకూల పరిణామంగా పోలీస్ శాఖ భావిస్తోంది. మొత్తంగా రాష్ట్ర నేరాల సరళిని పరిశీలిస్తే.. తీవ్ర నేరాలు, సైబర్, ఆర్థిక నేరాల్లో తగ్గుదల కనిపిస్తున్నప్పటికీ మాదకద్రవ్యాలు, వ్యవస్థీకృత నేరాలు, సాధారణ నేరాలు, ట్రాఫిక్ నేరాల్లో పెరుగుదల నమోదైంది. ఈ నేపథ్యంలో నేరాలపై లోతైన విశ్లేషణ, నెలవారీ సమీక్షలు, క్షేత్రస్థాయి తనిఖీలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఈ సమీక్షా సమావేశంలో డీజీపీ సీవీ ఆనంద్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.డిజిటల్ పోలీసింగ్ పోర్టళ్లలో సమాచారాన్ని నిర్ణీత గడువులోగా నవీకరించాలని డీజీపీ సీవీ ఆనంద్ అధికారులను ఆదేశించారు. సమయానుకూలంగా, కచ్చితమైన సమాచారాన్ని నమోదు చేస్తున్న పోలీసు యూనిట్ల పనితీరును ఆయన అభినందించారు. ఇతర యూనిట్లు కూడా ఇదే విధానాన్ని పాటించి పనితీరును మెరుగుపర్చుకోవాలని సూచించారు. నేర నియంత్రణలో సాంకేతికత వినియోగంపై సమీక్షలో ప్రత్యేకంగా చర్చించారు. ఏఐ ఆధారిత పోలీసింగ్ అప్లికేషన్లు, సీసీటీఎన్ఎస్, టీజీ–కాప్, హాక్ఐ తదితర డిజిటల్ వేదికల పనితీరు, వినియోగంపై అధికారులు ప్రజెంటేషన్లు ఇచ్చారు. కొత్త నేర చట్టాల (ఎన్‌సీఎల్) అమలు, ఇంటర్‌ఆపరబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్ (ఐసీజేఎస్), సైబర్ నేరాల నియంత్రణ చర్యలు, ఈగల్ కార్యకలాపాలు, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్) పనితీరు, కేసుల భారంపైనా సమీక్షించారు.యువ ఐపీఎస్ అధికారులు పోలీసింగ్‌లో చేపట్టిన నూతన ఆవిష్కరణలు, సాంకేతిక ఆధారిత కార్యక్రమాలను సమావేశంలో వివరించారు. పోలీసు శాఖ ఆర్థిక, బడ్జెట్ అంశాలు, పోలీసు గృహ నిర్మాణ ప్రాజెక్టులు, మౌలిక వసతుల అవసరాలు, కార్యకలాపాలకు సంబంధించిన అంశాలపైనా చర్చించారు. లొంగిపోయిన మావోయిస్టులకు సంబంధించిన అంశాలు, వారి పునరావాస చర్యలను కూడా సమీక్షించారు.పోలీసు యూనిట్ల పనితీరుకు సంబంధించిన ఇతర అంశాలపైనా అధికారులు చర్చించారు. ఆయా యూనిట్లలో నెలకొన్న నేర పరిస్థితులకు అనుగుణంగా ప్రాధాన్యాలను ఎప్పటికప్పుడు మార్చుకోవాలని డీజీపీ సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ పరిస్థితులను నిశితంగా పర్యవేక్షించాలని చెప్పారు. నేరాల నివారణ, ఛేదన, దర్యాప్తులో డేటా విశ్లేషణకు ప్రాధాన్యం ఇవ్వాలని డీజీపీ స్పష్టం చేశారు. సమర్థమైన ప్రాథమిక పోలీసింగ్, సకాలంలో డేటా విశ్లేషణ, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, నిరంతర పర్యవేక్షణతోనే మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు. యూనిట్ స్థాయిలో జవాబుదారీతనం, సకాలంలో నిర్ణయాలు, క్షేత్రస్థాయిలో లక్ష్యిత చర్యలు నేర నియంత్రణను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.డీజీపీ సీవీ ఆనంద్ అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశానికి డీజీ (లా అండ్ ఆర్డర్) మహేష్ భగవత్, సీఐడీ డైరెక్టర్ శిఖా గోయెల్, ఉమెన్ సేఫ్టీ, సీఐడీ డైరెక్టర్ చారు సిన్హా, ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా హాజరయ్యారు. రాష్ట్రంలోని అన్ని పోలీసు కమిషనర్లు, జిల్లా ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులు, పోలీసు

# రోజంతా కొబ్బరి వంటకాలు మాత్రమే..!



**హిందువులకు శ్రావణమాసం చాలా ప్రత్యేకమైనది. అత్యంత శుభప్రదంగా భావించే ఈ నెల ఆధ్యాత్మిక కార్యక్రమాలు, వివాహాది శుభకార్యాలతో ఎంతో సందడిగా ఉంటుంది. శ్రావణమాసం అంతా పవిత్రమైనదిగా భావించినప్పటికీ ఆ నెలలో వచ్చే పౌర్ణమిని మాత్రం మరింత శుభప్రదంగా భావిస్తారు. ఆ రోజు ఆలయాలకు వెళ్లి అమ్మవారిని దర్శించి సకల సౌభాగ్యాలు ప్రసాదించాలని కోరుకొంటారు. శ్రావణ పౌర్ణమిని అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగగా జరుపుకొంటాం. ఈ రోజుని వివిధ రాష్ట్రాల్లో వివిధ పేర్లతో పిలుస్తారు. విభిన్న ప్రాంతాల్లో విభిన్నమైన పండగలు జరుపుకొంటారు. మరి, వాటి గురించి తెలుసుకుందాం..**

**కజరీ పూర్ణిమ..**

కజరీ పూర్ణిమను మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో జరుపుకొంటారు. దీన్నే కజలి పూర్ణిమ, కజ్లి పూర్ణిమ అని కూడా పిలుస్తారు. శ్రావణమాసంలో వచ్చే పౌర్ణమి నాడే దీన్ని జరుపుకొంటారు. కజరీ అంటే గోధుమలు అని అర్థం. పంటలు బాగా పండేలా దీవించమని భగవతీ మాతను పూజిస్తారు. ముఖ్యంగా వ్యవసాయ కుటుంబాలకు చెందినవారు దీన్ని జరుపుకొంటారు. శ్రావణ శుక్ల నవమి నాడు మహిళలు తమ పొలాలకు వెళ్లి కుండలో మట్టితో పాటు బార్లీ, గోధుమలను నింపి తీసుకొస్తారు. పూజగదిని ఆవుపేడతో అలికి, గోధుమ పిండితో ముగ్గు వేసి అందులో కుండను ఉంచుతారు. ఆ కుండను నవమి నుంచి పౌర్ణమి వరకు ఏడు రోజుల పాటు పూజిస్తారు. చివరి రోజైన శ్రావణ పౌర్ణమి నాడు సాయంత్రం వేళ పూజ చేసి అప్పటి వరకు పూజ చేసిన మట్టికుండను తలపై పెట్టుకొని దగ్గరలో ఉన్న నదిలో కానీ, చెరువులో కానీ కలిపేస్తారు. భగవతీ దేవికి నైవేద్యాలు సమర్పిస్తారు. ఇలా చేయడం వల్ల భగవతీ దేవి ఆశీస్సులు లభించి పంటలు సమృద్ధిగా పండుతాయని నమ్ముతారు.

**నారికేళ పూర్ణిమ..**

నారికేళ పూర్ణిమనే నరలి పూర్ణిమ, నారియల్ పూర్ణిమ అని కూడా పిలుస్తారు. మహారాష్ట్ర, కర్ణాటక, గోవాలోని సముద్ర తీర ప్రాంతాల్లోని మత్స్యకారులు ఈ పండగని జరుపుకొంటారు. ఈ పర్వదినాన సముద్రుడు, వరుణులను పూజిస్తారు. సముద్రం నుంచి తమకు, తమ ప్రాంతానికి ఎలాంటి ఆపద రాకుండా కాపాడాలని కోరుతూ నారికేళ పూర్ణిమను జరుపుకొంటారు. మరో విధంగా చెప్పాలంటే.. తమకు బతుకుతెరువు కల్పించే ప్రకృతి తల్లికి ప్రణమిల్లే పండగ ఇది. మత్స్యకారులు సముద్రం ఒడ్డున సముద్రునికి కొబ్బరికాయలు సమర్పిస్తారు. పూజ అనంతరం అందంగా అలంకరించిన తమ పడవలపై సముద్రంలోకి వెళ్లి కాసేపటికి తిరిగి వచ్చేస్తారు. ఆ తర్వాత పాటలు పాడుతూ.. నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా గడుపుతారు. ఆ రోజంతా కొబ్బరితో తయారుచేసిన వంటకాలను మాత్రమే తింటారట. కొన్ని ప్రాంతాల్లో నారికేళ పూర్ణిమ నాడు శివుడిని పూజిస్తారు.

**పవిత్రోపాన..**

శ్రావణ పూర్ణిమను గుజరాతీలు పవిత్రోపానగా పిలుస్తారు. ఈ రోజు శివుడిని పూజించి ఆయన ఆశీస్సులు పొందుతారు. ఆలయాలన్నింటినీ వివిధ రకాల పుష్పాలతో అలంకరిస్తారు. భక్తులు శివునికి పాలు, కొబ్బరి నీరు, పెరుగు, తేనె, నీటిని సమర్పిస్తారు. వాటితో సంతృప్తి చెందిన శివుడు ఆరోగ్యాన్ని, సంపదలను ప్రసాదిస్తాడని వారు నమ్ముతారు. ఈ రోజు ముక్కంటిని కొలిస్తే సర్వపాపాలు తొలగిపోతాయని భావిస్తారు. పవిత్ర అమర్‌నాథ్ యాత్ర కూడా ఈ రోజుతోనే ముగుస్తుంది.

త్రినేత్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక



# రవీంద్రభారతిలో ఘనంగా 4వ 'నృత్యనాగ'






**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, ఆగస్టు 28:**
సింగిడి కల్చరల్ ఆర్గనైజేషన్, హైదరాబాద్, తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో, నాగ్‌పూర్‌లోని సౌత్ సెంట్రల్ జోన్ కల్చరల్ సెంటర్ సహకారంతో 4వ 'నృత్యనాగ' కార్యక్రమాన్ని రవీంద్రభారతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా శ్రీలంకకు చెందిన రంగిక నానాయకర, శ్రీ రంగాభి కళా మందిర్ కళాకారులు శ్రీలంక సంప్రదాయ జానపద నృత్యాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. అనంతరం మధ్యప్రదేశ్‌కు చెందిన కళాకారులు నోర్టా, బధాయి జానపద నృత్యాలు, మహారాష్ట్ర కళాకారులు ఢోల్ తాషా ప్రదర్శనలతో అలరించారు. కోల్‌కతాకు చెందిన యాజ్ఞసేని సర్కార్ ఒడిస్సీ నృత్యాన్ని, మౌమితా పాల్ మోహినీయాట్టం నృత్యాన్ని ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.
కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంపీ, తెలంగాణ ప్రభుత్వ క్రీడా సలహాదారు, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్ రెడ్డి హాజరయ్యారు.
గౌరవ అతిథులుగా తెలంగాణ టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి ఐఏఎస్, రైల్వే మంత్రిత్వ శాఖకు చెందిన సుధీర్ ఐఆర్‌టీఎస్, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ నమోజు బాలాచారి పాల్గొన్నారు.
ఈ సందర్భంగా అంజనా రాజపక్స మెమోరియల్ అవార్డులు, 'నృత్యనాగ' అవార్డులను ప్రముఖులకు ప్రదానం చేశారు.

# ఘనంగా "అజీజ్ జన్మదిన వేడుకలు






**హైదరాబాద్, చిక్కడపల్లి, ట్రైనెట్ న్యూస్, ఆగస్ట్ 28 :**
ప్రముఖ గాయకుడు అజీజ్ జన్మదిన వేడుకలు సందర్భంగా 'అజీజ్ ఔర్ అవాజ్' పేరిట సినీ సంగీత విభావరి చిక్కడపల్లి త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదికలో నిర్వహించారు. ఈ సందర్భంగా గాయనీ గాయకులు ఆలపించిన సినీ గీతాలు అలరించాయి.

# డా. గుళ్ల సూర్యప్రకాశ్ కు జీవిత సాఫల్య పురస్కారం










**హైదరాబాద్,చిక్కడపల్లి, ట్రైనెట్ న్యూస్ ఆగస్ట్ 28 :**
**సినీ విజ్ఞాన విశారద**
ఎస్.వి. రామారావు 87వ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఆయన తల్లిదండ్రులు చంద్రమౌళేశ్వరరావు కామేశ్వరమ్మ జ్ఞాపకార్థం సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డా. గుళ్ల సూర్యప్రకాశ్ కు జీవిత సాఫల్య పురస్కారం ప్రధానోత్సవ కార్యక్రమం కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐఎఎస్ (రి), తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారులు డాక్టర్ కెవి.రమణ చారి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్డియాలజిస్ట్ డా. గుళ్ల సూర్యప్రకాశ్ తన దగ్గరికి వచ్చే బాధితులకు ధైర్యాన్ని చెప్పి ప్రాణాలను కాపాడారని పేర్కొన్నారు. ఆయన వైద్య రంగంలో అందిస్తున్న సేవలు మరువలేనివని కొనియాడారు.
ఎస్.వి. రామారావు సినీ, కళా రంగంలో అనేక సేవలు చేశారని పేర్కొన్నారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రముఖ రంగస్థల, సీరియల్, టి.వి. నటులు, దర్శకులు డా. ఎస్.బి. కిశోర్ (చంద్రపూర్), నామాల మూర్తి (వైవిఎస్ మూర్తి)కి ప్రతిభా పురస్కారాలు అందజేశారు. కిన్నెర సంస్థ కార్యదర్శి మద్దాలి రఘురామ్ స్వాగతోపన్యాసం చేసిన కార్యక్రమంలో పూర్వమంత్రి, శాసనసభ్యులు, మండలి బుద్ధ ప్రసాద్, ప్రముఖ సాహితీవేత్త డా. పాలకుర్తి మధుసూదనరావు, ప్రముఖ సినీ నటుడు సుబ్బరాయ శర్మ, యువ కళావాహిని అధ్యక్షుడు లంకా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. సభకు ముందు గీతాలయ ఆర్ట్స్ సమర్పణలో "అక్కినేని ఆణిముత్యాలు" పేరిట గాయని గాయకులు ఆలపించిన సినీ గీతాలు అలరించాయి.

# అలరించిన 'సుస్వరాభిషేకం-9' సంగీత విభావరి






**హైదరాబాద్, చిక్కడపల్లి, ట్రైనెట్ న్యూస్ ఆగస్టు 28 :**
ప్రముఖ సంస్కృతిక సంస్థ 'ఆర్కే మెలోడీస్' ఆధ్వర్యంలో 'సుమం ప్రతి సుమం సుమం' పేరిట 'సుస్వరాభిషేకం-9' తెలుగు - హిందీ పాటల సంగీత విభావరి ?చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభ, కళా లలిత కళావేదిక వేదికలో నిర్వహించారు.
సంస్థ ఫౌండర్, ప్రెసిడెంట్ రామడుగు కృష్ణ ప్రసాద్ నిర్వహణలో గాయనీ, గాయకులు ఆలపించిన మధురమైన గీతాలు అలరించాయి.




# నీట్ (యూజీ) రెండో విడత కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల



దిల్లీ: నీట్ యూజీ 2026 రెండో విడత కౌన్సెలింగ్‌కు షెడ్యూల్ విడుదలైంది. దేశవ్యాప్తంగా మెడికల్, డెంటల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఈ కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా రెండో రౌండ్ రిజిస్ట్రేషన్లు సెప్టెంబర్ 3 నుంచి ప్రారంభం కానున్నాయని మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ) వెల్లడించింది. సెప్టెంబర్ 3 నుంచి 11 వరకు ఆలిండియా కోటా, డీమ్డ్, సెంట్రల్ వర్సిటీల్లో కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగనుంది. సెప్టెంబర్ 7 నుంచి 11 వరకు స్టేట్ కోటా కౌన్సెలింగ్ ప్రక్రియ జరగనుంది. కళాశాలల్లో చేరేందుకు సెప్టెంబర్ 18 ఆఖరి గడువుగా నిర్ణయించారు. శని, ఆదివారం, సెలవు రోజుల్లోనూ అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టాలని ఎంసీసీ సూచించింది. అర్హత కలిగిన అభ్యర్థులు ఎంసీసీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. రెండో విడత కౌన్సెలింగ్‌కు సంబంధించిన పూర్తి వివరాలను ఎంసీసీ వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చు.

edited, Printed, Published and Owned by:Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA. www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136